Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన

ఫోన్ నెంబర్ : 9398191920.

సంపుటి : 01 సంచిక : 175 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శనివారం 19-07-2025 పేజీలు :12 వెల :2/-

## మద్యం కుంభకోణం కేసు.. మాజీ సీఎం కుమారుడి అరెస్టు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన కుమారుడు చైతన్య బఘేల్‌ను ఈడీ శుక్రవారం అరెస్టు చేసింది. ఈ ఉదయం బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు, అనంతరం చైతన్యను కస్టడీ లోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంతో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో చైతన్య బఘేల్ పాత్ర ఉందని అభియోగాలు వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన ఈడీ , మద్యం సిండికేట్‌కు రూ. రెండువేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన దర్యాప్తు సంస్థ , శుక్రవారం మరోసారి తనిఖీలు చేపట్టింది. ఈ ఉదయం దుర్గ్ జిల్లా లోని భిలాయ్ ప్రాంతంలో గల బఘేల్ నివాసానికి ఈడీ అధికారులు చేరుకున్నారు.

మిగతా 2లో

## 10 ఏళ్లుగా రాబర్ట్ వాద్రాను కేంద్రం వెంటాడుతోంది: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : గత పదేళ్లుగా తన బావ రాబర్ట్ వాద్రాను కేంద్ర ప్రభుత్వం వెంటాడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఓ భూ ఒప్పందానికి సంబంధించి అక్రమాలకు పాల్పడిన కేసులో రాబర్ట్ వాద్రాపై ఈడీ ఛార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనే శుక్రవారం రాహుల్ ఎక్స్‌వేదికగా స్పందించారు. ఈ తాజా ఛార్జిషీటు కూడా ఆ కోవకు చెందినదేనని విమర్శించారు. దురుద్దేశంతో రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనేందుకు రాబర్ట్ వాద్రా, ప్రియాంకల కుటుంబానికి తాను అండగా ఉంటానని రాహుల్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీటిని తట్టుకునే ధైర్యం వారందరికీ ఉందని, నిజం ఎప్పటికైనా బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు. వాద్రా సంస్థ స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్, ఆయనతో సంబంధం ఉన్న సత్యానంద్ యాజీ, కేవల్ సింగ్‌లను వారి సంస్థ ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ సహా మొత్తం 11 సంస్థల షేర్లను ఛార్జిషీట్‌లో ఈడీ చేర్చింది.

## తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డంకులు వేయకండి



- కేసీఆర్ శాపగ్రస్తుడు.. 2034 వరకు ఈ పాలమూరు బిడ్డే ముఖ్యమంత్రి: రేవంత్ రెడ్డి
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ పాలనలోనే ఎక్కువ అన్యాయం జరిగిందన్న రేవంత్ రెడ్డి
- ఎంపీగా గెలిపిస్తే పాలమూరు ప్రాంతానికి ద్రోహం చేశారన్న ముఖ్యమంత్రి
- పదేళ్ల పాలనలో పాలమూరు ప్రాంతానికి ఏమీ చేయలేదని విమర్శ

నాగర్‌కర్నూలు జిల్లా కొల్లపూర్, జటప్రోలులో ప్రతిపాదిత యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ముందుగా అక్కడ మదనగోపాల స్వామి వారి ఆలయం చేరుకుని స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన అనంతరం, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమక్షంలో జరిగిన "ప్రజా పాలన %-% ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

రాష్ట్రంలోని ప్రతిపాదిత నీటి పారుదల ప్రాజెక్టులు, మహిళాభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాల వంటి అంశాలను రేవంత్ రెడ్డి ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేస్తూనే అడ్డుపడితే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. "మా ప్రాజెక్టులను అడ్డుకోవద్దు. అక్కడి సూర్యుడి ఇక్కడ పొడిచినా ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. పాలమూరు వలసల జిల్లా కాదు. పరిపాలన అందించే జిల్లాగా నిరూపిస్తాం. చంద్రబాబు నాయుడు గారికి మా విజ్ఞప్తి. వారు బాధ్యతగా వ్యవహరించాలి. సహకరించి ఉదారతను చాటుకోవాలి. పాలమూరు %-% రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబర్ 9 నాటికి పూర్తి చేసి అందరికీ నష్ట పరిహారం చెల్లిస్తాం. రాబోయే రెండేండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పని చేస్తాం. అలాగే, తుమ్మిడిహెట్టి నుంచి వికారాబాద్, తాండూరు, చేవెళ్ల వరకు నీరు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటాం.

మిగతా 2లో

తెలంగాణలో అత్యంత కీలకమైన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు డిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కు విజ్ఞప్తి చేశారు. "తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. సహకరించాలని కోరుతున్నాం. మా విజ్ఞప్తులను వినకపోతే పోరాటం చేసి సాధించుకుంటాం. నాయకత్వం వహించే బాధ్యత నేను తీసుకుంటా.." అని స్పష్టం చేశారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను రద్దు చేయాలని డిమాండ్

ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు పాలమూరును దత్తత తీసుకున్న చంద్రబాబుకి ఇప్పుడు%%. రెండు రాష్ట్రాలు సమంగా, తెలుగు వారు అభివృద్ధి సాధించాలన్న ఆలోచనే నిజమైతే రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు.



## హైదరాబాద్‌లో కుండపోత.. ట్రాఫిక్‌కు అంతరాయం

హైదరాబాద్ : సాయంత్రం వేళ కురిసిన కుండపోత వర్షానికి నగరం అతలాకుతలమైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (%+ఎవీజ%) పరిధిలోని అనేక ప్రాంతాల్లో నీరు నిలిచిపోగా.., భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పాఠశాలలు ముగిసే సమయాలు, ఉద్యోగులు ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే వేళల్లో భారీ వర్షం కారణంగా రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోగా, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, అధికారులు తక్షణమే రంగంలోకి దిగి నిర్దిష్ట ప్రాంతాల్లో రూట్ డైవర్షన్లు అమలు చేసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేయడానికి చర్యలు చేపట్టారు. కాగా, ఈరోజు శుక్రవారం సాయంత్రం వరకు కూకట్‌పల్లి, బేగంపేట, కాప్రా వంటి కీలక ప్రాంతాలలో 100 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, మలక్‌పేట, సికింద్రాబాద్‌లలో కూడా భారీ వర్షం కురిసింది. దీని ఫలితంగా ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి. హైదరాబాద్‌లో మరో రెండు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (%×వీణ%) హెచ్చరించింది. జూలై 19 నుండి 22 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని %×వీణ% వెల్లడించింది. రేపు (జూలై 19న) హైదరాబాద్ తోపాటు 10 జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, సాధారణంగా ఆకాశం మేఘావృతమై ఉండి వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణ సూచనలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.



2లో

## పాక్ ఆక్రమిత కశ్మీర్ లోకి మసూద్ అజార్?

## మరో రెండేళ్లలో అరుదైన సూర్యగ్రహణం... 6 నిమిషాల పాటు అంధకారం!

- 2027లో అద్భుతమైన సూర్యగ్రహణం
- గ్రేట్ నార్త్ ఆఫ్రికన్ ఎక్లిప్స్'గా నామకరణం
- ఆగస్టు 2న ఏకంగా ఆరు నిమిషాల పాటు చీకట్లు



యూరప్, ఉత్తర ఆఫ్రికా, మరియు మధ్యప్రాచ్యంలోని ప్రాంతాల్లో, 2027 ఆగస్టు 2న అద్భుతమైన సూర్యగ్రహణం సంభవించనుంది. ఈ 'గ్రేట్ నార్త్ ఆఫ్రికన్ ఎక్లిప్స్'గా పిలవబడే ఈ ఖగోళ దృశ్యంలో, చంద్రుడు సూర్యుని పూర్తిగా కప్పివేయనుండడంతో, భూమి 6 నిమిషాల 23 సెకన్ల పాటు అంధకారంలో మునిగిపోనుంది. ఇది 1991 నుండి 2114 వరకు భూమిపై కనిపించే అత్యంత సుదీర్ఘమైన సూర్యగ్రహణంగా నిలుస్తుంది, ఇది 100 ఏళ్లలో ఒక అరుదైన ఖగోళ సంఘటనగా నిలుస్తోంది.

తేదీ, సమయం మరియు కనిపించే ప్రాంతాలు: ఈ సూర్యగ్రహణం అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా ప్రారంభమై, తూర్పు దిశగా యూరప్, ఆఫ్రికా, మధ్యప్రాచ్యం వైపు కదులుతుంది. గ్రహణం పూర్తి దృశ్యం (టోటాలిటీ) 258 నుండి 275 కిలోమీటర్ల వెడల్పు గల సన్నని బ్యాండ్‌లో కనిపిస్తుంది. దక్షిణ స్పెయిన్‌లోని కాడిజ్, మలాగా వంటి నగరాల్లో 4 నిమిషాలకు పైగా చీకట్లు అలముకుంటాయి. ఉత్తర మొరాకోలోని

మిగతా 2లో



2 ట్రంప్ ఆంక్షలు.. అమెరికాలో భారీగా తగ్గిన భారతీయ విద్యార్థుల సంఖ్య



2 నిమిష మరణశిక్ష తాత్కాలికంగా నిలిపివేత: సుప్రీంకు కేంద్రం

సత్యమేవ జయతే



# తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డంకులు వేయకండి

“అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశంలోనే ఎస్సీ ఉప కులాల వర్గీకరణ పూర్తి చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. ఎస్సీ ఉపకులాలకు నష్టం వాటిల్లకూడదని వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యాక భర్తీ చేయాలన్న ఉద్దేశంతో కొంతకాలం ఆపి ఇప్పుడు పూర్తి చేయబోతున్నాం.

ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాల కాలం పూర్తయ్యే లోపు మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. మొత్తంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా, తెలంగాణ మాడల్ ను ఆవిష్కరిస్తాం. విదేశీ పర్యటనల సందర్భంగా దాదాపు 3 లక్షల కోట్ల మేరకు పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగావకాశాలు కల్పించాం.”“అధికారం చేపట్టిన 18 నెలల కాలంలో దేశంలో ఏ రాష్ట్రం చేయలేనన్ని సంక్షేమ పథకాలు మహిళలకు అందించాం. మహిళలను చైతన్యవంతులను చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని లక్ష్యంగా నిర్దేశించాం. తెలంగాణ 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని సంకల్పించాం..”

వెనుకబడిన ప్రాంతమైన కొల్లాపూర్ అభివృద్ధికి సంబంధించి మంత్రి జూపల్లి విజ్ఞప్తులపై సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహకి సూచించారు.మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు %-% చెక్కుల పంపిణీ

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద 344 కోట్ల రూపాయల చెక్కును అందించారు. అలాగే బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా, లోన్ బీమాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. పలువురు లబ్ధిదారులకు ఆహార భద్రత (రేషన్ కార్డులు) కార్డులను అందించారు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్ లోకి మసూద్ అజార్?

న్యూఢిల్లీ : పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జైషే మహమ్మద్ ఉగ్రసంస్థ చీఫ్ మసూద్ అజార్ కదలికలను ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. అతడి అడ్డా అయిన బహావల్పూర్ నుంచి 1,000 కిలోమీటర్ల దూరం లోని గిలిత్ ఖలిస్థాన్ ప్రాంతంలో ఉన్నట్టు తెలుస్తోంది. కొన్నాళ్ల కిందటే స్కర్దూ లోని సద్‌పర రోడ్ ప్రాంతంలో అతడిని గుర్తించారు. ఆ ప్రదేశంలో రెండు మసీదులతో పాటు మదర్సాలు, చాలా ప్రైవేటు , ప్రభుత్వ అతిథి గృహాలు ఉన్నాయి. బాహ్య ప్రపంచం నుంచి దూరంగా ఉండాలంటే జైషే చీఫ్‌నకు పీవోకేకు మించిన ప్రదేశం లేదు. సహజసిద్ధమైన పార్కులు, సరస్సులతో ప్రశాంతంగా ఉంటుంది. ఇటీవల పాక్ పీపుల్స్ పార్టీ అధినేత బిలావల్ భుట్టో జర్దారీ మాట్లాడుతూ మసూద్ అఫ్గానిస్థాన్‌లో ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అవసరమైతే అతడిని భారత్‌కు అప్పగించేందుకు పాక్ సిద్ధంగా ఉందన్నారు. అల్‌జజీరా న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూఏ జైషే మహమ్మద్ సంస్థ నేత మసూద్ అజార్ తమ దేశంలో లేదని, ఒకవేళ ఉన్నట్టు భారత్ కచ్చితమైన సాక్ష్యాలు సమర్పిస్తే అతడ్ని అరెస్టు చేసామని పేర్కొన్నారు.లష్కరే తయ్యిబా అధిపతి హాఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ (జేఎం) చీఫ్ మసూద్ అజార్‌లను భారత్‌కు అప్పగించడం గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ..“హాఫీజ్ సయీద్ పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటూ వస్తున్న వార్తలు అవాస్తవం. అతను కస్టడీలోనే ఉన్నాడు. మసూద్ అజార్ ఎక్కడున్నాడో మాకు తెలియదు. అఫ్గానిస్థాన్‌లో ఉన్నాడేమో. ఒక వేళ అతడు పాక్ గడ్డపైనే ఉన్నట్టు భారత ప్రభుత్వం మాకు కచ్చితమైన సమాచారం ఇస్తే అతడిని అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరం లేదు ” అని భుట్టో పేర్కొన్నారు. జైషే సంస్థ ఆన్‌లైన్ ఖాతాలు ఇంటెలిజెన్స్ వర్గాలను తప్పుతోవ పట్టించేలా పలు పోస్టులు చేస్తున్నాయి. ఈ క్రమంలో పాత ఆడియో క్లిప్‌ను రీసైకిల్ చేసి ఆన్‌లైన్‌లో పబ్లిష్ చేయడం వంటి వాటికి పాల్పడుతున్నాయి. అయినా నిఘా వర్గాలు మాత్రం జాగ్రత్తగా అతడి కదలికలపై దృష్టి సారించాయి. భారత్‌లో పలు ఉగ్రదాడుల వెనుక మసూద్ హస్తం ఉంది. 2016 లో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్, 2019 పుల్వామా దాడికి జైషే పాల్పడింది.

# ట్రంప్ ఆంక్షలు.. అమెరికాలో భారీగా తగ్గిన భారతీయ విద్యార్థుల సంఖ్య

వాషింగ్టన్ : ట్రంప్ ఆంక్షలు, వీసాల కట్టడి తరువాత అమెరికాకు భారతీయ విద్యార్థుల రాక గణనీయంగా తగ్గింది. ట్రంప్ రెండో సారి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ బ్రేక్ మరింత పడింది. హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుకేషన్ కన్సల్టెంట్లు ఇప్పటి ఈ పరిస్థితిని విశ్లేషించారు. ఇంతకు ముందటితో పోలిస్తే ఇప్పుడు అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య 70 శాతం వరకూ పడిపోయిందని వివరించారు. వీసా ఫీజులు పెంచడం, వీసా దరఖాస్తుల తిరస్కరణ, ప్రస్తుతం సాగుతోన్న వీసా అపాయింట్మెట్ స్లాట్ల నిలిపివేత వంటి పరిణామాలతో విసిగి వేసారి విద్యార్థులు అమెరికా ఆశలు వదులకుంటున్నారు. బ్రిటన్, ఆస్ట్రేలియా లేదా చైనా వంటి దేశాలను తమ విద్యా మజిలీగా ఎంచుకుంటున్నారు. అమెరికా నిరాకరణతో చేసేది లేక విద్యార్థులలో అత్యధికులు ఇండియాలోనే ఉన్నత విద్యకు దిగుతున్నారని కూడా కన్సల్టెంట్లు తెలిపారు. సాధారణంగా అమెరికాలో విద్యా సంవత్సరం ఆరంభం ముందు నుంచే భారీ స్థాయిలో విద్యార్థుల, తల్లిదండ్రుల రాకలతో ఎడ్యుకేషన్ కన్సల్టెంటీ సంస్థలు సందడిగా ఉండేవి. ప్రతిరోజూ స్లాట్స్ గురించి తాము ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌తో పరిశీలిస్తే అవి ముందుకు సాగడం లేదని, స్లాట్స్ లేకుండా విద్యార్థుల వీసాలకు ఇక్కట్లే అని హైదరాబాద్ ఓవర్సీస్ కన్సల్టెంట్ నిర్వాహకులు సంజీవ్ రాయ్ తెలిపారు. ఇప్పుడు తాము స్టూడెంట్స్‌కు ఏమీ చెప్పలేకపోతున్నామని సారీ అన్నారు.సాధారణంగా ఈ రోజుల్లో ఎక్కువగా ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఈ సందడి లేకుండా పోయిందన్నారు. ఇక వీసా స్లాట్స్‌ను క్రమేపీ పునరుద్ధరించడం తరువాత వేగవంతం చేయడం జరుగుతుందని అమెరికా దౌత్య కార్యాలయ వర్గాలు చెపుతున్నాయి. కానీ ఇది జరగడం లేదు. దీనితో అనిశ్చితత సాగుతోంది. స్లాట్స్ బుక్ తరువాత ఇంటర్వ్యూల ప్రక్రియ ముగిసినా చాలా కాలంగా విద్యార్థులకు వీసా మంజూరీ లేదా నిరాకరణ సమాచారం అందడం లేదని విండో ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ తరపున అంకిత్ జైన్ చెప్పారు. బుకింగ్స్ నిర్ధారణ లేకుండా స్లాట్స్ వేగవంతం చేస్తామని అమెరికా అధికారులు చెప్పడం వల్ల ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. అమెరికా కావాలనే తన వ్యవస్థతో విద్యార్థులకు పరీక్ష పెడుతోందని అనుకోవల్సి ఉంటుందన్నారు. అమెరికా వీసా రావడం లేదు. దీనితో తాను జర్మనీని ఎంచుకున్నానని 23 సంవత్సరాల విద్యార్థి ఒకరు హైదరాబాద్‌లో తెలిపారు. సంవత్సరాల తరబడి యుఎస్ వీసా జపం చేస్తే ప్రయోజనం ఏమిటని నిలదీశారు. ఇతర దేశాలు అమెరికాకు చదువు విషయంలో ప్రత్యామ్నాయ వేదికలు కావచ్చునని చెప్పారు.వచ్చే కొద్ది రోజులలో అయినా స్లాట్లు ఆరంభం కాకపోతే ఇక వేలాది మంది కలలు కల్లలు అవుతాయని ఐ 20 ఫివర్ కన్సల్టెంన్సీ సంస్థ అధినేత అరవింద్ మండువ తెలిపారు. ఇప్పుడు తమ సంస్థ విషయానికి వస్తే వీసా విషయాల్లో 80 శాతం వరకూ తగ్గుదల తలెత్తింది. ఇది మరింతగా ఉంటుందని అనుకుంటున్నాం, దీనికి బ్రేక్ పడాల్సి ఉంది. రోజు రోజు విద్యార్థులు, వారి తలిదండ్రుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఏమి చెప్పాలో తెలియడం లేదని, అయితే త్వరలోనే పరిస్థితి కుదుటపడుతుందని భావిస్తున్నామని అరవింద్ తెలిపారు. అమెరికా ఇమిగ్రేషన్ జాతీయ చట్టంలోని నిబంధనలు అనేకం ఇప్పుడు ట్రంప్ హయాంలో మరింత కటుతరం అయ్యాయి. వడబోతలు ఎక్కువ కావడంతో పరిస్థితి విషమించింది. విద్యాభ్యాసం తరువాత తిరిగి స్వదేశం వెళ్లుతామనే పత్రాల్లో ఎటువంటి లోపాలు ఉన్నా, ఇతరత్రా సమాచారం లేకపోయినా తిరస్కరణ జరుగుతోంది. చాలాకాలంగా స్లాట్లు రాకుండా పోతున్నాయి.అయితే స్లాట్సు బుకింగ్ ఆరంభం అయిందని హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సులేట్ జనరల్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. తరచూ వెబ్‌సైట్ విజిట్ చేయాలని విద్యార్థులకు సలహా ఇచ్చింది. అయితే ఇప్పటికీ మునుపటి స్థితి కొనసాగుతోంది. భారతీయ విద్యార్థుల రాకను అమెరికా అడ్డుకోవాలనుకోవడం లేదని, అయితే వీసా ప్రక్రియ సవ్యంగా ఉండటం , అమెరికా ప్రయోజనాల నేపథ్యంలో కొంత జాప్యం తప్పనిసరి అయిందని కాన్సులేట్ జనరల్ కార్యాలయ ప్రతినిధి వివరించారు. అయితే ఇప్పటి లెక్కల ప్రకారం చూస్తే చైనాను అధిగమించి భారత్ నుంచి అమెరికాకు దాదాపు మూడున్నర లక్షల మంది విద్యార్థులు అమెరికా చదువుకు వెళ్లారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నివేదిక మేరకు చూస్తే 2024 జనవరి 1 నాటికి దాదాపు 12 లక్షల మంది వరకూ భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. వీరిలో అత్యధికులు అమెరికాలోనే ఉన్నారని వెల్లడైంది. యూరప్ దేశాలు కూడా విద్యాభ్యాసానికి కేంద్రాలు అయ్యాయి.

# కెసిఆర్ మేధావిలా, శాస్త్రవేత్తలా మాట్లాడలేదా?:

హైదరాబాద్/ప్రత్యేక ప్రతినిధిః గతంలో బిఆర్‌ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ప్రగతి భవన్‌కు ఆహ్వానించి నీటి విషయంలో అపర మేధావిలా, ఇంజనీర్‌లా, శాస్త్రవేత్తలా మాట్లాడారని బిజెపి సీనియర్ నాయకుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శక్రవారం విలేకరుల సమావేశంలో అన్నారు. తాము కో-ఆపరేటివ్ ఫెడరలిజాన్ని గౌరవిస్తున్నామని, అందుకే బనకచర్ల విషయంలో కూడా వివాదం పరిష్కారానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కేంద్రం ఆహ్వానించిందని ఆయన వివరించారు. కేంద్రం తీర్పు చెప్పదని, ఇలాంటి సమస్యల పరిష్కారానికి వేదిక ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒకరకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా మాట్లాడుతుందని ఆయన విమర్శించారు. పాలసినీ తరచూ మార్చుకునే వారి వ్యాఖ్యలు స్థిరంగా ఉండవని అన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన వ్యాఖ్యలను ఆయన చదివి వినిపించారు. ‘పక్క రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలని మేము మొదటి నుంచి భావిస్తున్నాం, నేను స్వయంగా మహారాష్ట్ర వెళ్ళి అప్పటి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి, దశాబ్దాలుగా ఉన్న ఆంధ్రమహారాష్ట్రకు సంబంధించిన సమస్యకు పరిష్కారం కనుగొన్నాను.వివాదాలు పరిష్కరించుకోవడం వల్ల రెండు రాష్ట్రాలకు మేలు అని భావించాం, అదేవిధంగా గోదావరి, కృష్ణా నదీ జలాల విషయంలో రెండు రాష్ట్రాలకు మేలు జరిగేలా వ్యవహరిద్దాం..’ అని కెసిఆర్ అన్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా తమకు భేషజాలు లేవు, బేసిన్ల గొడవలు లేవు, అపోహలు అవసరం లేదు, వివాదాలు కావాలనుకుంటే మరో తరం వరకు కూడా నీళ్ళు ఇవ్వలేం, కెసిఆర్‌జగన్ వ్యక్తిగతంగా ఆలోచించరు, ప్ర జలు మమ్మల్ని నమ్మి ఓట్లు వేశారు, వారికి మేలు చేయడమే మా ఇద్దరి బాధ్యత .. అని కూడా కెసిఆర్ అన్నట్లు



ఆయన వివరించారు. బనకచర్ల విషయంలో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు లేఖ రాసినందుకే తాను స్వయంగా ప్రధాని నరంద్ర మోదీని, జలశక్తి మంత్రిని కలిసిన తర్వాతే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

కాజిపేట కోచ్ ప్యాక్టరీ సమస్య పరిష్కార దశలోకి వచ్చిందని ఆయన చెప్పారు. పలు రాజకీయ పార్టీలు పలు పర్యాయాలు పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించాయని ఆయన గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని కాజిపేట రైల్వే జంక్షన్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు భూమి పూజ చేశారని, అరవై, డ్భై శాతం పనులు పూర్తి కావచ్చాయని ఆయన తెలిపారు.

యూరియా కొరత లేదు..

తెలంగాణకు యూరియా కొరత లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై అనుమానాలు, అపోహలు అవసరం లేదన్నారు. కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు.

యాదగిరిగుట్ట వరకూ 330 కోట్ల రూపాయలతో రైలు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కొమురవెల్లి మల్లన్న ఆలయానికి హైదరాబాద్ నుంచి వెళ్ళే నేపథ్యంలో అక్కడ కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన చెప్పారు. వచ్చే జనవరిలో కొమురవెల్లి స్టేషన్‌ను పూర్తి చేసి మల్లన్న స్వామికి అంకితం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శంషాబాద్ తరహాలో రూ.720 కోట్ల రూపాయలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు.

# రేవంత్ పనితీరు భేష్: సిపిఐ నారాయణ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి అన్యాయం చేయడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ కితాబిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రజలచేత ఎన్నుకోబడిన నేత అని అన్నారు. ఆయన నామినేట్ చేయబడిన వ్యక్తి కాదని నారాయణ పేర్కొన్నారు. కేంద్ర జలశక్తి శాక ఇరు రాష్ట్రల సీఎంలతో సమావేశం నిర్వహించడంపై నారాయణ శుక్రవారం స్పందించారు. ఈ సమావేశాన్ని తాను స్వాగతిస్తున్నానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని విమర్శిస్తూ రాజకీయాలు చేయాలనుకోవడం సరికాదని అన్నారు. నీళ్లను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం, తల్లిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం వంటిదేనని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎన్నో ఏళ్లుగా పంచాయితీ కొనసాగుతూనే ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై తానే తొలిసారి స్పందించానని అన్నారు.



ఈ ప్రాజెక్టు గురించి చంద్రబాబు కొంచెం అతిగా మాట్లాడారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండానే బనకచర్లను తెరపైకి తెచ్చారని నారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఆయన చంద్రబాబుకు సూచించారు. బనకచర్ల ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు కాదని పేర్కొన్న నారాయణ ఇది రూ.80 వేల కోట్ల ప్రాజెక్టు కాదని, దాదాపుగా రూ.2 లక్షల కోట్లు వ్యయం అవుతుందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు వివాద రహితంగా ప్రాజెక్టులు కట్టుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో ప్రతి అంశంపై ప్రధాన ప్రతిపక్షం సెంటిమెంట్లతో రెచ్చగొడుతోందని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిన తర్వాత తెలంగాణ సెంటిమెంట్ అనేది ఎగిరిపోయిందని అన్నారు.

## నిమిష మరణశిక్ష తాత్కాలికంగా నిలిపివేత: సుప్రీంకు కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో ఆమె భద్రంగా స్వదేశానికి వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని సుప్రీం కోర్టుకు కేంద్రం శు క్రవారం తెలియజేసింది. ఈ కేసుపై తాజాగా అత్యున్నత న్యాయస్థానం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఆమెకు మరణశిక్ష అమలును యెమెన్ తాత్కాలికంగా నిలిపివేసిన విషయాన్ని కేంద్రం జస్టిస్‌లు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. ఈ కేసులో తమవైపు నుంచి చర్యలు కొనసాగుతున్నాయని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కోర్టుకు తెలియజేశారు. నిమిష ప్రియ తరఫున న్యాయవాదుల బృందం కోర్టుకు ఓ అభ్యర్థన చేసింది. ఈ కేసులో బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా యెమెన్ వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరింది.దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రస్తుతం ఆ దేశానికి వెళ్లకుండా ప్రయాణ ఆంక్షలు ఉన్నందున దీనిపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంది. ఇందుకోసం ప్రభుత్వం వద్ద తమ అభ్యర్థన చేసుకునేలా పిటిషనర్లకు అనుమతి కల్పించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది. యెమెన్ దేశస్థుడి హత్య కేసులో నిమిష ప్రియకు జులై 16న మరణశిక్ష అమలు చేయాల్సి ఉండగా, చివరి నిమిషంలో అక్కడి ప్రభుత్వం దీన్ని వాయిదా వేసింది. బ్లడ్ మనీపై బాధిత కుటుంబంతో చర్చలు జరిపేందుకు మరింత సమయం ఇవ్వాలని భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఆ దేశం సానుకూలంగా స్పందించింది. అయితే ఈ బ్లడ్ మనీకి తాము ఎన్నటికీ అంగీకరించబోమని బాధిత కుటుంబం చెబుతోంది. దీంతో ఈ కేసు ఎలా ముగుస్తోందన్న ఉత్కంఠ నెలకొంది.

## మరో రెండేళ్లలో అరుదైన సూర్యగ్రహణం... 6 నిమిషాల పాటు అంధకారం!

టాంజియర్, టెటౌవాన్, మరియు మధ్య ఈజిప్ట్‌లోని లక్సర్ సమీపంలో 6 నిమిషాలకు పైగా పూర్తి అంధకారం కనిపిస్తుంది. నైరుతి సౌదీ అరేబియాలోని జెడ్డా, మక్కా, యెమెన్, మరియు ఈశాన్య సోమాలియా ప్రాంతాలు కూడా ఈ గ్రహణాన్ని చూడగలవు. గ్రహణం భారత మహాసముద్రంలో ముగిసే ముందు చాగోస్ దీవులను దాటుతుంది.ఎందుకు ఈ గ్రహణం ప్రత్యేకం?: ఈ సూర్యగ్రహణం భూమి సూర్యునికి దూరంగా ఉండే సమయంలో (అఫీలియన్) మరియు చంద్రుడు భూమికి దగ్గరగా ఉండే సమయంలో (పెరిజీ) సంభవిస్తుంది. దీని వల్ల సూర్యుడు చిన్నగా, చంద్రుడు పెద్దగా కనిపించి, గ్రహణం యొక్క దీర్ఘకాలికతను పెంచుతుంది. దానికితోడు, ఈ గ్రహణం భూమధ్యరేఖ సమీపంలో జరుగుతుంది, ఇక్కడ చంద్రుని నీడ భూమిపై నెమ్మదిగా కదులుతుంది, దీనివల్ల టోటలిటీ సమయం పెరుగుతుంది.భారతదేశంలో కనిపించదు!: దురదృష్టవశాత్తూ, ఈ సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదు. తూర్పు ఆసియా, ఆస్ట్రేలియా, మరియు ఇతర కొన్ని ప్రాంతాల్లో కూడా ఈ గ్రహణం కనిపించకపోవచ్చు. కొన్ని చోట్ల కేవలం స్వల్పంగానే కనిపిస్తుంది.ఎలా చూడాలంటే: సూర్యగ్రహణాన్ని సురక్షితంగా చూడటానికి ఐఎస్ఓ 12312-2 ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రత్యేక సోలార్ ఫిల్టర్ గ్లాసెస్ లేదా హ్యాండ్-హెల్డ్ సోలార్ వ్యూయర్‌లను ఉపయోగించాలి. సాధారణ సన్‌గ్లాసెస్ లేదా ఇంట్లో తయారు చేసిన ఫిల్టర్‌లు సూర్యుని హానికరమైన కిరణాల నుంచి రక్షణ ఇవ్వవు. పిన్‌హోల్ ప్రొజెక్టర్ వంటి పరోక్ష పద్ధతులు కూడా సురక్షితంగా గ్రహణాన్ని చూడటానికి ఉపయోగపడతాయి.శాస్త్రీయ ప్రాముఖ్యత: ఈ గ్రహణం శాస్త్రవేత్తలకు సూర్యుని కరోనాను అధ్యయనం చేసే అరుదైన అవకాశాన్ని అందిస్తుంది. ఇది సాధారణంగా సూర్యుని ప్రకాశవంతమైన ఉపరితలం వల్ల కనిపించదు. గ్రహణా.ల సమయాల్లో అందుకు మినహాయింపు ఉంటుంది. ఈ అరుదైన ఖగోళ సంఘటనను చూడటానికి ప్రణాళిక వేస్తున్న వారు, ఈ ఒక్క శతాబ్దంలోనే అత్యంత ముఖ్యమైన సూర్యగ్రహణాన్ని సురక్షితంగా ఆస్వాదించేందుకు సిద్ధంగా

## మద్యం కుంభకోణం కేసు.. మాజీ సిఎం కుమారుడి అరెస్టు

కేసుకు సంబంధించి కొత్త ఆధారాలు లభించడంతో మాజీ సీఎం నివాసంలో సోదాలు చేపట్టారు. అయితే ఈ సమయంలో చైతన్య బఘేల్ అధికారులకు సహకరించకపోవడంతో ఆయనను అరెస్టు చేసినట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నుంచి బఘేల్ నివాసం వద్ద పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది మోహరించారు. పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకొని ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా పుట్టిన రోజు నాడే చైతన్యను ఈడీ అధికారులు అరెస్టు చేయడం గమనార్హం. దీనిపై ఆయన తండ్రి భూపేశ్ స్పందించారు. “రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు నేడు చివరిరోజు. అదానీ సంస్థ కోసం చెట్లు కూలుస్తున్న అంశాన్ని మేం లేవనెత్తాం. వెంటనే మా ఇంటికి ఈడీని పంపించారు. నా కుమారుడి పుట్టిన రోజున మంచి బహుమతి ఇచ్చారు ” అని మాజీ సీఎం మండిపడ్డారు.

## హెచ్‌సిఎ స్కామ్.. వెలుగులోకి సంచలన విషయాలు

హైదరాబాద్ : హెచ్‌సీఏ స్కామ్‌పై ఇడి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. హెచ్‌సిఎలో క్విడ్ ప్రో కో జరిగినట్టు గుర్తించింది. టెండర్లు లేకుండా అనుకూలమైన వారికే పనులు కేటాయించడంతో హెచ్‌సిఎ సభ్యులు భారీగా లబ్ది పొందినట్టు ఇడి గుర్తించింది. కొద్ది రోజుల క్రితమే హెచ్‌సిఎ మాజీ ట్రెజరర్ సురేందర్ అగర్వాల్, అతడి భార్యను విచారించింది . రూ. 90 లక్షల రూపాయలు క్విడ్ ప్రో కో జరిగినట్టు గుర్తించారు. క్రికెట్ బాల్స్ టెండర్ల, జిమ్ సామాను టెండర్లు, స్టేడియం కుర్చీలు టెండర్‌లు తమకు కేటాయించినందుకు లక్షల రూపాయలు లంచం ఇచ్చినట్లుగా వెలుగుచూసింది.మాజీ హెచ్‌సిఎ ట్రెజరర్ సురేందర్ అగర్వాల్ భార్య పేరు మీద జెబి జ్యూవెలర్స్ ఖాతాలోకి లంచం డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. బిసిసిఐ నుంచి వచ్చిన నిధులను క్రికెట్ అభివృద్ధి కోసం కాకుండా సొంత పనులకు వాడినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. స్టేడియం టెండర్ల నుంచి మొదలుకుని టికెట్ల విక్రయం దాకా అన్నిట్లో గోల్‌మాల్‌కు పాల్పడ్డట్లు గుర్తించారు. గత 10 ఏళ్లలో బిసిసిఐ నుంచి హెచ్‌సిఎకు 800కోట్లకు పైగా నిధులు వచ్చినట్లు తేలింది. కోట్ల రూపాయలు ఉన్న హెచ్‌సిఎ అకౌంట్‌ను సైతం సొంత ప్రయోజనాలకు వాడారని ఆరోపణలు వస్తున్నాయి.

2022లో జస్టిస్ లావ్ నాగేశ్వర్ రావ్ విచారణలో అనేక విషయాలు బట్టబయలయ్యాయి. క్రికెట్ బాల్స్, స్టేడియం చైర్స్, జిమ్ పరికరాలు టెండర్లులలో కోట్ల రూపాయలు అవినీతి జరిగినట్టు ఫోరెన్సిక్ ఆడిట్‌లో నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంపై గతంలోనే హెచ్‌సిఎ సభ్యులను ఇడి విచారించింది. హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్ మోహన్ రావ్ సైతం ఇదే రీతిలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డట్లు గుర్తించారు. హెచ్‌సిఎలోకి లోకి ఎంట్రీ కావడానికి ఎవరెవరికి ఎంత ఇచ్చారో ఇడి తేల్చనున్నది . ఐపిఎల్ మ్యాచ్ ల సందర్భంగా టెండర్ల విషయంలోనూ సొంత వాళ్లకే ప్రయోజనాలు చేకూరేలా జగన్ వ్యవహరించినట్లు సమాచారం. ఫుడ్ క్యాటరింగ్, స్టేడియం లో స్టాల్స్, టికెట్స్ కేటాయింపులోనూ తన వారికే కట్టబెట్టుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి.

## ఫిష్ వెంకట్ కన్నుమూత



టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ (53) కన్నుమూశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రెండు కిడ్నీలూ చెడిపోవడంతో డయాలసిస్ కోసం కుటుంబ సభ్యులు ఆయనను కొన్ని రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్చారు. ఫిష్ వెంకట్ అసలు పేరు మంగలంపల్లి వెంకటేశ్. ముషీరాబాద్ చేపల వ్యాపారంతో పిష్ వెంకట్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు.రాంనగర్‌లో నివాసం ఉంటున్న వెంకట్ నటుడు శ్రీహరి ద్వారా సినీ పరిశ్రమలోకి వచ్చారు. డైరెక్టర్ వీవీ వినాయక్ ఆయన్ను నటుడిగా పరిచయం చేశారు. వెంకట్ వందకు పైగా చిత్రాల్లో హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినీప్రియులను అలరించారు. ఆది, దిల్, బన్ని, అత్తారింటికి దారేది, గబ్బర్‌సింగ్, డీజె టిల్లు, కింగ్, డాన్ శీను, మిరపకాయ్, సుప్రీమ్, దరువు తదితర హిట్ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఫిష్ వెంకట్ చివరిసారిగా ‘కాఫీ విత్ ఏ కిల్లర్’ చిత్రంలో నటించారు.

## నేటివ్ ఇండియన్స్ స్టూడెంట్స్ ఫోరం సంగారెడ్డి నియోజకవర్గ అధ్యక్షునిగా నాసీర్ అహ్మద్



సత్యమేవ జయతే, – సంగారెడ్డి సంగారెడ్డి : నేటివ్ ఇండియన్స్ స్టూడెంట్స్ ఫోరం సంగారెడ్డి నియోజకవర్గ అధ్యక్షునిగా సదాశివపేట పట్టణానికి చెందిన నాసీర్ అహ్మద్ ను నియమించిన జాతీయ అధ్యక్షులు బీరయ్య యాదవ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ములనివాసుల హక్కులను సంస్కృతిని కాపడుకునేందుకు కృషి చేయాలని అలాగే ఎన్ ఐ ఎఫ్ సంస్థ కొరకు నాలో శక్తి ఉన్నంతవరకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల కోసం పనిచేస్తూ అలాగే నాకు అప్పచెప్పిన బాధ్యతల ప్రకారం సంగారెడ్డి జిల్లాలో మండలాల్లో ప్రతి గ్రామంలో సుమారు పదివేల మందిని విధ్యర్తులని తయారు చేస్తానని అవసరమైతే ఏ సమస్యకైనా నిలబడి పోరాడుతానని అలాంటి శక్తివంతమైన విధ్యర్తులని తయారు చేస్తూ నిరంతరం ప్రతి పల్లెల్లో ప్రతి మండలాల్లో వారి సమస్యలను జిల్లా స్థాయికి మరియు రాష్ట్రస్థాయికి తీసుకెళ్తూ వారికోసం పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నేటివ్ ఇండియన్ ఫోరం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విక్రమ్, ఎన్కేపల్లి అక్షయ్, జయ కృష్ణ, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు



సత్యమేవ జయతే – నిర్మల్ నిర్మల్ : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి సన్నిధికి వచ్చిన మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు వేద మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే మహంకాళి, దత్తాత్రేయ స్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం వసతి గృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రికి నిర్మల్ పెయింటింగ్స్ చిత్రపటం బహుకరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తోందని, బాసర నూతన ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలుపై ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ పాఠక్, ఈవో సుదర్శన్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్‌లో ధర్నా.. రామగిరిలో మాజీ సర్పంచ్‌ల అరెస్ట్




సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : కాంగ్రెస్ ప్రభుత్వ తీరు నవ్విపోదురు కదా అనే విధంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల పెండింగ్ బిల్లులు రాక ఎంతోమంది సర్పంచులు ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకుంటున్నా చలనం లేని ఈ ప్రభుత్వంనికి కనువిప్పు కలగాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ధర్నాకు బయలుదేరిన వారిని ఎక్కడికక్కడ అరెస్టు చేయిస్తున్నది. రామగిరి మండలంలో తాజా మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు అడిగినందుకు ఇవ్వకపోగా అక్రమ అరెస్టులు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని పెద్దపల్లి జిల్లా సర్పంచుల పోరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండవేన ఓదెల యాదవ్ అన్నారు. అప్పుచేసి మరి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించిన సర్పంచుల కుటుంబాలు చిన్న భిన్నంగా మారాయని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గత సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలు, రాజ్యాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి పెండింగ్ బిల్లులే సాక్షమన్నారు.

గత ఎన్నికల్లో గెలుపొందింది 95 శాతం బీఆర్ఎస్ సర్పంచులే కాబట్టి వారు చేసిన పనులకు బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. స్థానిక సంస్థల పదవీ కాలం ముగిసేనాటికే ఎన్నికలు నిర్వహించాలన్న కనీస అవగాహన లేని దద్దమ్మ ప్రభుత్వమని మండిపడ్డారు. 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్.. ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయని కాంగ్రెస్ సర్కార్.. స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు జంకుతున్నదని చెప్పారు. వెంటనే ఎన్నికలు నిర్వహించి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆషాడ మాస బోనాల పండగ సందర్భంగా ముస్తాబవుతున్న షాపూర్ నగర్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం..





### ఆలయ ప్రాంగణం శుభ్రం చేసిన సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ.



సత్యమేవ జయతే,జూలై 18, కుత్బుల్లాపూర్ ప్రతినిధి: ఆషాడ మాస బోనాల పండగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ ధర్మకర్త ముద్దాపురం కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం జరగబోయే బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని శ్రీ నల్లపోచమ్మ ఆలయాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేయిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులతో ఆలయ ప్రాంగణాన్ని చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ముద్దాపురం కృష్ణ గౌడ్ పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఆలయాన్ని తీరొక్క రంగులతో ముస్తాబు చేయిస్తూ విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భవాని గురుస్వామి బి. భద్రయ్య, బి.విజయ్, మల్లేష్, పోతారాజు సన్నీ, సందీప్, ఐ డాల్స్ డెక్రెషన్ (బొమ్మలు) సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరు అందించేందుకు కన్నెపల్లి పంప్ హౌస్‌ను ప్రారంభించాలి.. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

### - కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే ఎత్తిపోతల మొదలు పెట్టని కాంగ్రెస్



సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : రైతుల నార్లు ముదిరి నష్టపోక ముందే కన్నేపల్లి పంప్ హౌస్‌ను ప్రారంభించి మధ్య మానేరు ఎల్ఎండీకి నీరు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరైన వానలు రాకపోవడంతో ఏ ప్రాజెక్టులోను నీరు లేదని పేర్కొన్నారు.

మధ్య మానేరు ఎల్ఎండీలో నీటిమట్టం లేక రానున్న కాలంలో మంచినీటి కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ మేడిగడ్డ వద్ద నేడు 82230 క్యూసెక్కుల వరద నీరు వృథాగా సముద్రంలోకి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ కుంగి పోయిందని ఎత్తిపోతల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే అవకాశమే లేదని పేర్కొన్నారు. కన్నెపల్లి వద్ద 94 మీటర్ల లోనే వరద ప్రవాహం ఉంటే నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉందన్నారు.

ఇప్పుడు 96 మీటర్ల మేరకు వరద ప్రవాహం ఉందని గుర్తు చేశారు. ప్రతీరోజు 20వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసిన పది రోజుల్లోగా మధ్యం మానేరును పూర్తిస్థాయిలో నింపవచ్చని పేర్కొన్నారు. అక్కడి నుంచి కాకతీయ కెనాల్ ద్వారా సూర్యాపేట వరకు రైతులు నాట్లు వేసేందుకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కేసీఆర్ కాలేజీ ప్రాజెక్టు నిర్మించారన్న ఒక్క కారణంతోనే వారిని బదనాం చేయాలన్న ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం చేయకుండా కుట్రలు పన్నుతుందని విమర్శించారు. ఎండీఎస్ఏ కూడా ప్రభుత్వం మరమ్మతులు చేయించవచ్చని పేర్కొందని, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మేడిగడ్డ వద్ద కాంగ్రెస్ ఎందుకు పనులు చేపట్టడం లేదని ప్రశ్నించారు.

నాట్లు వేసుకునేందుకు సాగునీరు అందించాలని, అనేక ప్రాంతాల నుండి రైతులు అడుగుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయకుండా మల్లన్న సాగర్ నుంచి మాత్రం గండిపేటకు మూసి ప్రక్షాళనకు నీళ్లు మళ్లిస్తామని చెబుతూనే ఉందని పేర్కొన్నారు. కేవలం కేసీఆర్ భజనం చేసే కుట్ర నడుస్తుందని విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్ వరంగల్ జిల్లాలోని రైతులు నాట్లకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాట్లు వేసే సమయం అయిపోతే నార్లు పూర్తిగా ముదిరిపోయిన ఈసారి పంట ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల కష్టాన్ని గుర్తుపెట్టుకుని సాగునూరు అందించేందుకు వెంటనే ప్రభుత్వం చర్య తీసుకోవాలని, రాజకీయాల కతీతంగా తాము చేతులెత్తి అడుగుతున్నామని పేర్కొన్నారు. రైతుల విషయంలో రాజకీయాలు మానుకొని పంట వేసుకునేందుకు అవసరమైన సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నాయకులు సిద్ధం వేణు, పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్, జక్కుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ముందు చూపుతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం..

### - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
### - కుంగిన ఒక పిల్లర్ ను భూతద్దంలో చూపి రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారు
### - ధర్మపురిలో లక్ష ఎకరాలకు సాగునీరందించే విధంగా ఎత్తిపోతల నిర్మాణం
### - అక్క పెల్లి ఎత్తిపోతల పథకం పనులు వెంటనే ప్రారంభించాలి



సత్యమేవ జయతే – ధర్మపురి ధర్మపురి : వర్షాభావ పరిస్థితుల్లో కూడా పంటలు ఎండకుండా కేసీఆర్ ముందునూపులోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన ఒక పిల్లర్ ను భూతద్దంలో చూపుతూ మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టే కూలినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతూ రైతులను తప్పుదోవ పట్టిస్తూ నిండా ముంచుకున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు.

ఆయన రైతులతో కలిసి ధర్మపురి మండలం బుద్దేశిపల్లి వద్ద ఎండిన ఆక్కపెల్లి చెరువును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో ధర్మపురి వరప్రదాయిని అయిన అక్కపెల్లి చెరువు నిండుకుండలా ఉండేడదని గుర్తుచేశారు. వర్షాలు సమృద్ధిగా కురువని సందర్భంలో కూడా ధర్మపురిలో లక్ష ఎకరాలకు సాగునీరందించేలా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టామన్నారు. అక్కపెల్లి చెరువును కూడా గోదావరి నీటితో నింపే విధంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రూ. 72. 10కోట్లు మంజూరు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పనులు ప్రారంభించుకున్నామన్నారు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లిఫ్ట్ కు సంబంధించి పనులు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువు కింద దాదాపు 5 వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పంటలు సాగు ప్రశ్నార్థకమేవన్నారు. అలాగే ధర్మపురి నియోజక వర్గాన్ని సస్య శ్యామలం చేసే విధంగా ధర్మపురి, వెల్లటూర్ మండలాల్లో 14ఎత్తిపోతల పథకాలు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకాలతో పాటు చెక్ డ్యాములు, బోలిచెరువు– బందంమాటు, రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకీకరణ, ప్రతీ గ్రామంలో చెరువుల పునరుద్ధరణ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విజయవంతంగా పూర్తి చేశామని, వర్షాలు కురువని పరిస్థితుల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించే విధంగా ధర్మపురిలో ప్రాజెక్టులు నిర్మించి ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు.

దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 మాసాలు గడిచిపోయాయని, చిన్నచిన్న పనులు తప్పా ఎక్కడా ఒక్క మంచి అభివృద్ధి పని జరుగుతున్నట్లుగా కనిపించిన దాఖలాలు లేవన్నారు. ఎస్ఆర్ఎస్పీ లో ప్రస్తుతం 16 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నదని, ఇందులో 10 టీఎంసీలు నీరు తాగునీటికి వినియోగిస్తారని, ఈ పరిస్థితుల్లో పంటలను ఏవిధంగా కాపాడుతారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాకు చూపించి కన్నెపెల్లి లిఫ్ట్ దగ్గర నీటిని లిఫ్ట్ చేసి చెరువులు నింపకుండా, కాలువల ద్వారా నీరు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, రైతులు గమనించాలని సూచించారు.

ధర్మపురిలో రైతులు నార్లు పోసుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నారనీ. ఆక్కపెల్లి చెరువు లిఫ్ట్ పనులు వెంటనే ప్రారంబించాలని డిమాండ్ చేశారు. రైతులకు జీవనాధారంగా ఉన్న అక్కేపెల్లి చెరువుకు ఎత్తిపోతల పథకం అనేది ధర్మపురి రైతుల ఎన్నో ఏండ్ల కల అని, దాని పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అలాగే గొల్లపల్లి మండలం రంగదామునిపల్లి గ్రామంలో నారుపోసుకొని వీరందక బిందెలతో నీరు పోసుకునే దుస్థితి వచ్చిందన్నారు. ధర్మపురి మండలం ధమన్నపేట ఎత్తిపోతల పథకం రిపేరుకు వచ్చిందని. స్టార్టర్లు కాలిపోయి నెలరోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నుండిపడ్డారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పందించి ఎత్తిపోతలకు మరమ్మతుల పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అలాగే రాష్ట్రవ్యాప్తంగా రైతులు అందోళనతో ఉన్నారని, వర్గాలు కురుస్తేనే పంటలు పండే పరిస్థితి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక సస్యశ్యామలమైన ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వపు తప్పుడు విధానాలు అవగాహన లేమి వల్ల రాష్ట్ర పరిస్థితి ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎరువుల కోసం రైతులు క్యూలైన్లు కట్టే కాలం మళ్లీ మొదలైందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనకు ప్రజలు గమనిస్తూనే ఉన్నారనీ, మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి వెంట డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీశాంత్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ సంగి సత్తెమ్మ, నాయకులు అయ్యోరి రాజేష్ కుమార్, సొల్ల భీమయ్య, శేఖర్, శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

## ప్రజల పక్షాన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నిరంతర పోరాటం




సత్యమేవ జయతే – ఇల్లందు ఇల్లందు : దేశంలో మతోన్మాద బీజేపీకి, రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వానికి, భద్రాద్రి కొత్తగూడేనికి నీళ్లు రాకుండా చేసిన అధికార పార్టీ మంత్రులపై సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ కేంద్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందు పట్టణం చంద్ర కృష్ణమూర్తి ట్రస్ట్ భవనంలో వారు మాట్లాడుతూ.. నేడు దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మైనార్టీలను శత్రువులుగా ఎంచుకుని వేటాడి చంపుతున్నట్లు తెలిపారు. పౌర, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, దాడులకు తెగపడుతూ, భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారన్నారు. దేశంలో ఒక్క శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు దేశ సంపద, సహజ వనరులను తాకట్టు పెడుతూ ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి జైల్లో కుక్కుతున్నారన్నారు.
మణిపూర్ మత అల్లర్లు, బస్తర్ చత్తీస్‌గఢ్ ఏరియాలో అమాయక ఆదివాసులను చంపుతూ రక్తపుటేరులు పారిస్తున్నారన్నారు. మధ్య భారతంలో భారత రాజ్యాంగం అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, హామీలను గాలికి వదిలేసిందన్నారు. భద్రాద్రి నీళ్లను భద్రాద్రి జిల్లాకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, రమక్క, కేజీ రామచందర్, చిన్న చంద్రన్న, చంద్రశేఖర్ జీవిత సహచరి విమల, కెచ్చల రంగారెడ్డి, ముద్ద భిక్షం, నాయిని రాజు, జగ్గన్న, అమర్లపూడి రాము, అజ్మీర బిచ్చ, కొత్తపల్లి రవి, జాటోత్ కృష్ణబుర్ర వెంకన్న, యాకూబ్ శావలి, రేస్ బోసు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ పాల్గొన్నారు.

## మార్చిలో ఆర్ఎంయూ ప్రారంభం
## - డిసెంబర్ నాటికి పనులు పూర్తి
## - దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవ



సత్యమేవ జయతే – వరంగల్ వరంగల్ : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే మల్టీ మాన్యుఫ్యాక్చ రింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) వచ్చే మార్చిలో ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. జీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారిగా కాజీపేటకు వచ్చి రైల్వే సర్క్యులేటింగ్ ఏరియా, అమృత్ భారత్ పథకం పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే క్రూ లాబీ, రన్నింగ్ రూంను తనిఖీ చేశారు. రైలు ఎల్పీలు, ఏఎల్పీలు, గార్డులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించగా, షెడ్డు నిర్మాణ మ్యాప్‌ను రైల్వే సీపీఎంసీ మధుసూదనరావు క్షుణ్ణం గా వివరించారు.
అనంతరం ఆయన కార్యాలయంలో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. యూనిట్ షెడ్డులో నిర్మాణ పనులను ప్రతి సెక్షన్‌ను కలియ తిరిగారు. ప్రాజెక్టు పనులను మరింత వేగంగా పెంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగం గా జరుగుతున్నాయ ని, ఈ ఏడాది డిసెంబర్ నాటి పూర్తవుతాయన్నారు. ప్రాజెక్టు ప్రారంభం కాగానే ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు.
అదేవిధంగా జనగామ రైల్వే స్టేషన్‌ను జీఎం తనిఖీ చేసి, అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఆయన వెంట రైల్వే డీఆర్ఎం భర్తేశ్ కుమార్ జైన్, సీపీఎంసీ మధుసూదనరావు, జీఎం సెక్రటరీ శ్రీనివాసరావు, సీనియర్ డీఈఎన్ (కంట్ర క్షన్) రామారావు, ఆర్వీఎన్ఎల్ సీపీఎం సాయిప్రసా ద్, సీనియర్ డీఎన్ ప్రంజ్వల్ కేశవాణి, సీనియర్ డీఎంఈ వెంకట్ కుమార్, సీనియర్ డీఈఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.
– స్థానికులకు అవకాశాలు కల్పించాలి
కాజీపేట రైల్వే స్థలంలో చేపట్టనున్న బస్టాండ్ ఏర్పాటు స్థల ప్రక్రియను వేగవంతం చేయా లని, కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని జీఎంను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ కోరారు. వారు ఈ మేరకు ఆర్ఎంయూ నిర్మాణంలో భూనిర్వాసితుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, వరంగల్ ప్రాంతంలోని రైల్వే సమస్యలపై కలెక్టర్ సత్యశారద వినతి పత్రాలు అందజేశారు.

## దివ్యాంగులందరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. రెడ్డీ స్ ఫౌండేషన్ మేనేజర్ డాక్టర్ గురుదేవి.




సత్యమేవ జయతే మోమిన్ పెట్ బీలక్ష్యంతో దివ్యాంగులు వ్యాపారాలు, చేయాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజర్ గురు దేవి అన్నారు. గురు వారం మోమిన్ పేట్ ఐకెపి స్త్రీ శక్తీ భవన్ లో డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ అధ్వర్యంలో దివ్యాంగులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వికారాబాద్ జిల్లాలోని చిన్న, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలైన దివ్యాంగులను గుర్తించి, వారికి వారి ప్రతిభకు తగ్గట్టుగా వారు చేస్తున్న వ్యాపారాలను బలోపేతం చేస్తూ మెరుగైన జీవనోపాధిని పొందడానికై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అర్హులైన దివ్యాంగులకు వారి వ్యాపారాలకు అవసరమయ్యే వస్తువులను ఇప్పించ నున్నట్లు తెలిపారు. మోమిన్ పెట్ మండలములో 25 మందికి ఇచ్చారు. ప్రతి నిరుపేద దివ్యాంగుల్ని గుర్తించి వారికి ఆర్థిక సాయం అందించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వికారాబాద్ జిల్లా కోఆర్డినేటర్ రామేశ్వర్, లబ్దిదారులు అయ్యూబ్ ఖాన్, మంజుల, చిరంజీవి, అప్సన బేగం, రషీద్, సువర్ణ, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి%



## - కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : నిర్మాణంలో ఉన్న పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. అంకంపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు, అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మడిపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్, నిర్మాణంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల, ఉషన్నపల్లి గ్రామంలోని నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మెట్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కిష్టంపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంకంపల్లి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సంపూర్ణ సహకారం అధికారులు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. మడిపల్లి, ఉషన్నపల్లి గ్రామాలలో నిర్మాణంలో ఉన్న పాఠశాలల పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.
మడిపల్లి పాఠశాలలో ప్రహరీ, గ్రౌండ్ లెవెలింగ్ పనులు కూడా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మొట్లపల్లిలోని జడ్‌పీహెచ్ఎస్ ఆవరణలో కలెక్టర్ మొక్క నాటారు. కాల్వ శ్రీరాంపూర్ మండల పరిధిలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా అమలు చేయాలని, ముఖ్యంగా పాఠశాల ప్రాంగణం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ మండల పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీవో పూర్ణ చందర్ రావు, మండల పంచాయతీ అధికారి ఆరిఫ్, పంచాయతీరాజ్ ఏఈ శ్రవణ్, మండల విద్యాశాఖ అధికారి మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామారెడ్డిలో సంచరిస్తున్న పులి.. భయాందోళనల్లో ప్రజలు



సత్యమేవ జయతే – కామారెడ్డి కామారెడ్డి : కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గోకుల్‌తండా అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం సృష్టించింది. అటవీ ప్రాంతంలో ఆవులపై ాడిచేసింది. గుర్తించిన తండావాసులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో పులి జాడకోసం 5 రోజులుగా గాలిస్తున్నారు. స్కూల్ తండా, బట్ట తండా, జగదాంబ తండా ప్రాంతాల్లో పులి జాడ కోసం అటవీ సిబ్బంది వెతుకున్నారు. ఈ నేపథ్యంలో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఒంటరిగా బటకు వెళ్లకూడదని సూచించారు.
– అమ్రాబాద్‌లో 36కు చేరిన పెద్ద పులులు
అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పెద్ద పులుల సంఖ్య పెరిగినట్టు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి వెల్లడించారు. నిరుడు 33 పులులు ఉండగా ఈ సారి వాటి సంఖ్య 36కు చేరినట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులుల లెక్కింపునకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించినట్టు తెలిపారు.
నిరుడు డిసెంబర్ 20నుంచి ఈ ఏడాది మే15 వరకు కెమెరా ట్రాకింగ్ కోసం రిజర్వ్ ఫారెస్టును నాలుగు బ్లాకులుగా విభజించి.. ఒక్కో బ్లాక్‌లో 250 నుంచి 300 కెమెరాలను బిగించినట్టు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా డేటాను సేకరించి పులుల వివరాలను నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మొత్తం 36 పులులు ఉండగా, వాటిలో 13మగ, 20ఆడ పులులు ఉన్నాయని వివరించారు. అలాగే వాటిలో 2 పిల్లలు ఉన్నాయని, ఒకటి మాత్రం సరిగా గుర్తించబడలేదని తెలిపారు. పులుల సంరక్షణ కోసం నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు.

# తెలంగాణ నయాగరా కుంటాల జలపాతం









ఆదిలాబాద్ జిల్లా జూలై 18 (సత్యమేవ జయతే న్యూస్):- ఆదిలాబాద్ జిల్లా అనగానే ఠక్కున గుర్తుకు వచ్చేవి దట్టమైన అడవులు, ప్రఖ్యాత జలపాతాలు, ఆకట్టుకునే ఆదివాసీ, గిరిజన గూడాలు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత పురాతనమైన నియోజకవర్గంలో ఒకటైన బోథ్ నియోజకవర్గం సప్తగుండాలకు ప్రసిద్ధి. ఇక్కడి అడవుల నుండి జాలువారే జలాధారలతో సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతాలు చూపరులను ఇట్టే కట్టిపారేస్తాయి. యాంత్రిక జీవనం నుండి తాత్కాలికంగానైనా ఉపశమనం పొందాలనుకునే వారికి అదిలాబాద్ జిల్లా ఓ భూతల స్వర్గం.
కుంటాల జలపాతం
తెలంగాణ నయాగరా గా పిలుచుకునే కుంటాల జలపాతం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రం గుండా వెళ్లే జాతీయ రహదారి 44 నుండి 11 కిలోమీటర్ల దూరంలో కుంటాల గ్రామ సమీపంలోని గోదావరి ఉప నది అయిన కడెం నదిపై కలదు. ఉత్తర దక్షిణ భారతానికి వారధిగా ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో సహజ సిద్ధంగా ఈ జలపాతం ఏర్పడింది. తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో గల బోథ్ మండలంలోని నిగిని గ్రామ సమీపంలోని కొండల్లో జన్మించిన ఒక జల ధార, బజార్ హత్నూర్ మండలంలోని భూతాయి ప్రాంతంలో జన్మించిన మరో జల ధార తమ తమ ప్రవహాల్లో అనేక చిన్న చిన్న జల ధారలను కలుపుకొని పెద్ద వాగుగా మారి నేరడిగొండ మండలం కుమారి గ్రామ సమీపంలో ఈ రెండు జల ప్రవాహాలు కలిసి కడెం నదిగా మారి కుంటాల గ్రామం వద్ద సుమారు 45 మీటర్ల ఎత్తు నుండి నేలమీదకు దూ కుతుంది. ఈ మనోహరమైన జల దృశ్యాలను చూడడానికి రెండు కళ్ళు సరిపోవు. ఆకాశం నుండి జారిపడే ఈ జల ధారల నుంచి వెలువడే నీటి తుంపరలు పర్యాటకులను మంత్ర ముగ్దులను చేస్తాయి. ఈ జల ధారల సవ్వడి సుమారు కిలోమీటర్ మేర వినపడుతోంది. ఇక్కడి నుండి ఈ జల ప్రవాహం రిజర్వ్ ఫారెస్ట్ ను చీల్చుకుంటూ కడెం రిజర్వాయర్ లోకి చేరుతుంది. ఈ జలపాతం చుట్టూ ఆకుపచ్చ తివాచీలాగ పర్చుకున్న దట్టమైన అటవీప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఇట్టే కట్టి పడేస్తాయి. జలపాతం చుట్టూ కుంటాల రిజర్వ్ ఫారెస్ట్, నాగమల్ల, రోల్ మామడ, సిరి చెల్మ రిజర్వ్ ఫారెస్ట్ లు కలవు. ఈ అడవుల్లో వైవిధ్యభరితమైన వృక్షాలతో పాటు రకరకాల పక్షులు, వన్య ప్రాణులు తమ అవాసంగా ఏర్పర్చుకున్నాయి. ఈ జలపాత అందాలను వీక్షించడానికి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా తెలంగాణ నలుమూలల తో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీషుగఢ్ రాష్ట్రాల నుండి పర్యాటకులు వస్తుంటారు. ఈ జలపాతంను చూడడానికి ఆగస్టు, డిసెంబర్ మధ్యన రోజుకు సుమారు 1500 పర్యాటకులు వస్తుంటారని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.
జలపాత చరిత్రాత్మక నేపథ్యం
కుంటాల జలపాతనికి ఈ పేరు ధుష్యంతుడి భార్య శకుంతల నుండి వచ్చిందని స్థానిక ప్రజల విశ్వాసం. శకుంతల, ధుష్యంతలు ఈ ప్రదేశంలో తరచుగా కలుసుకునేవారని ఈ జలపాత పరిసరాలను చూసి శకుంతల మైమరిచిపోయి తరచుగా ఈ జలపాతంలో స్నానం చేసేవారని ఇక్కడి ప్రజలు నమ్ముతారు. ఆమె పేరు మీదుగా మొదట్లో దీనిని శకుంతల జలపాతం అని పిలుచుకునే వారని ఆ తర్వాత కాలంలో కుంతల జలపాతమని ప్రస్తుతం 'కుంటాల జలపాతం' గా పేరు స్థిర పడిందని స్థానికులు చెబుతారు.
సోమన్న జాతర
ఈ జలపాతం వద్ద ప్రకృతి సిద్ధమైన రాతి గుహల్లో శివ లింగాలు ప్రతిష్టమై ఉండటం వలన ప్రతి సంవత్సరం శివరాత్రి రోజున భక్తులు ఈ శివ లింగాలను దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. ఈ గుహల్లో ఉన్న శివుడు సోమేశ్వరుడి పేరిట పూజలందుకుంటున్నాడు. ప్రతి శివరాత్రి సమయంలో రెండు రోజుల పాటు జరిగే జాతరను సోమన్న జాతర గా వ్యవహరించారు. ఈ జాతరకు స్థానికులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

## గురుకులాల్లో జరుగుతున్న ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే : ఏబీవీపీ



సత్యమేవ జయతే – హనుమకొండ హనుమకొండ : రాష్ట్రంలోని గురుకులాల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ఆరోపించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం, స్వార్థపూరిత ఆలోచనలతో తెలంగాణ ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతుందని పేర్కొన్నారు.

పేద , బడుగు బలహీన వర్గాల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లు నరకకూపాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో విద్యకు 14 శాతం నిధులు కేటాయిస్తే తెలంగాణలో కేవలం 7 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారన్నారు. గురుకులాల్లో విద్యార్థులు ఫుడ్ పయిజన్ బారినపడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఇంతవరకు వర్సిటీకి పాలకమండలి లేక, బోధన, బోధనేతర పోస్టులు లేక పరిశోధనకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో గారడి మాటలు చెప్పి రైతులను రుణమాఫీ పేరుమీద మోసం చేసిందని ఆరోపించారు. సమావేశంలో హాస్టల్స్ కన్వీనర్ వెలుతుల రాజకుమార్, వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరేపల్లి సుజిత్, జిల్లా కన్వీనర్ హరిచరణ్, శ్రీనివాస్, శివ, శ్రీశాంత్, త్రినీష్, రాజకుమార్, సిద్ధార్థ, రాకేష్ పాల్గొన్నారు.

## ఈనెల 20న 'ఓరుగల్లు పోరుబాట' పుస్తకావిష్కరణ



సత్యమేవ జయతే – హనుమకొండ హనుమకొండ : ఈనెల 20న ఓబీసీల ఓరుగల్లు పోరుబాట పుస్తక సమీక్ష సదస్సును నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్ సింగ్ సంయుక్తంగా రచించిన ఓబీసీల ఓరుగల్లు పోరుబాట ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు సౌజన్యంతో జన అధికార సమితి ఏర్పాటు చేసిందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఓబీసీలకు రిజర్వేషన్ల ప్రక్రియలో జరుగుతున్న అన్యాయాలను, హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాల పనితీరును ఎండగడుతూ పుస్తకంలోని అంశాలను ప్రతి బీసీ వంటపట్టించుకోవాలని సూచించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాపరిషత్ మాజీ చైర్మన్, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబారి సమ్మారావు, వ్యాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ, జన అధికార సమితి రాజకీయ విశ్లేషకులు తిరునగరి శేషు, బీసీ ఇంటిలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్ , గౌరవ సలహాదారులు వేముల సదానందం, జన అధికార సమితి ప్రతినిధి సంపత్, నాయిబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగవెల్లి సురేష్‌కుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు.. కొల్లాపూర్‌లో అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టు






సతమేవ జయతే – కొల్లాపూర్ కొల్లాపూర్ : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచే జర్నలిస్టుల అరెస్టుల పర్వం కొనసాగింది. కవరేజ్ వెళ్లేందుకు పాసులు ఉన్నాయని చెప్పినా పట్టించుకోని పోలీసులు నమస్తే తెలంగాణ ఆర్సీ ఇంచార్జ్ సీపీ నాయుడు, పెంట్లవెల్లి మండల రిపోర్టర్ రమణోజిరావు, కొల్లాపూర్ రూరల్ రిపోర్టర్ స్వామితోపాటు మరి కొంతమంది రిపోర్టర్లను అర్ధరాత్రి వేళ వారి ఇండ్ల నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గత నెల 25 నుంచి కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కొల్లాపూర్ నియోజక వర్గం లోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జర్నలిస్టులు రిలే దీక్షలు చేస్తున్నారు. గత 24 రోజులుగా దీక్షలు కొనసాగుతున్నాయి. కొల్లాపూర్ నియోజక వర్గంలోని ఏ ఒక్క జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వని ప్రభుత్వం, న్యాయం కోసం దీక్షలు చేస్తున్న జర్నలిస్టులను బీఆర్ఎస్ కార్యకర్తలుగా ముద్ర వేసింది. అయినా ఎక్కడా పక్షపాతం చూపించకుండా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ నిత్యం వృత్తి ధర్మాన్ని పాటిస్తున్న జర్నలిస్టుల వృత్తికి ఆటంకం కలిగిస్తూ పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేశారని సీనియర్ జర్నలిస్టులు బచ్చలకూర కురుమయ్య జలకం మద్దిలేటి ఆరోపించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన, స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొంటున్న సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమ కవరేజ్ కోసం ప్రభుత్వం రిపోర్టర్లకు పాసులను కూడా మంజూరు చేసింది. కానీ కవరేజ్‌కి వెళ్లకుండా నియంత్రించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం పునారోలోచన చేసుకోవాలన్నారు.

# ఓటేసిన పాపానికి కాంగ్రెస్ కాటేస్తోందని బాధపడుతున్న ప్రజలు: కేటీఆర్



సత్యమేవ జయతే – ఖమ్మం ఖమ్మం : కేసీఆర్ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రైతులకు బోగస్ మాటలు చెప్పి మోసం చేశారన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. రూ.4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి వయోవృద్ధులను, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం చేశారని మండిపడ్డారు. ఖమ్మం పర్యటనలో భాగంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటేసిన పాపానికి కాంగ్రెస్ కాటేస్తున్నదని ప్రజలు బాధపడుతున్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి. ప్రభుత్వంపై ప్రజలకు కోపం తీవ్ర స్థాయిలో ఉంది. కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలి. రేవంత్ రెడ్డి భరతం పట్టే బాధ్యత సమష్టిగా తీసుకుందాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున సహకారం ఉంటుంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలువస్తే ఏం జరుగుతుందో రేవంత్, బీజేపీకి తెలుసన్నారు. కేసీఆర్ 100 సీట్లతో ఏకపక్షంగా అధికారంలోకి వస్తారని అందరికీ తెలుసని చెప్పారు. కాంగ్రెస్ లాంటి దుర్మార్గులు ఉంటారని అంబేద్కర్ ఊహించలేదన్నారు.

ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి మాత్రం సున్నా. ముగ్గురు మంత్రులు ముగ్గురు మొనగాళ్లలా తిరుగుతున్నారని విమర్శించారు. ఓ మంత్రి బాంబులు.. బాంబులు అంటూ తిరుగుతున్నారని, చివరికి పొంగులేటి కాస్తా బాంబులేటిగా అయ్యారని చెప్పారు. ఎరువుల దుకాణాల వద్ద చెప్పులు, ఆధార్ కార్డులు పెడితే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో పార్టీకి అద్భుతమైన అవకాశం ఉందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, బానోత్ చంద్రవతి పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## ప్రజల పక్షాన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నిరంతర పోరాటం




సత్యమేవ జయతే – ఇల్లందు ఇల్లందు : దేశంలో మతోన్మాద బీజేపీకి, రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వానికి, భద్రాద్రి కొత్తగూడేనికి నీళ్లు రాకుండా చేసిన అధికార పార్టీ మంత్రులపై సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ కేంద్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందు పట్టణం చంద్ర కృష్ణమూర్తి ట్రస్ట్ భవనంలో వారు మాట్లాడుతూ.. నేడు దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మైనార్టీలను శత్రువులుగా ఎంచుకుని వేటాడి చంపుతున్నట్లు తెలిపారు. పౌర, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, దాడులకు తెగపడుతూ, భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారన్నారు. దేశంలో ఒక్క శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు దేశ సంపద, సహజ వనరులను తాకట్టు పెడుతూ ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి జైల్లో కుక్కుతున్నారన్నారు.

మణిపూర్ మత అల్లర్లు, బస్తర్ చత్తీస్‌గఢ్ ఏరియాలో అమాయక ఆదివాసులను చంపుతూ రక్తపుటేరులు పారిస్తున్నారన్నారు. మధ్య భారతంలో భారత రాజ్యాంగం అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, హామీలను గాలికి వదిలేసిందన్నారు. భద్రాద్రి నీళ్లను భద్రాద్రి జిల్లాకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, రమక్క, కేజీ రామచందర్, చిన్న చంద్రన్న, చంద్రశేఖర్ జీవిత సహచరి విమల, కెచ్చల రంగారెడ్డి, ముద్ద భిక్షం, నాయిని రాజు, జగన్న, అమర్లపూడి రాము, అజ్మీర బిచ్చ, కొత్తపల్లి రవి, జాటోత్ కృష్ణబుర్ర వెంకన్న, యాకూబ్ శావలి, రేస్ బోసు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ పాల్గొన్నారు.

## మార్చిలో ఆర్ఎంయూ ప్రారంభం

**- డిసెంబర్ నాటికి పనులు పూర్తి**

**- దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవ**



సత్యమేవ జయతే – వరంగల్ వరంగల్ : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే మల్టీ మాన్యుఫ్యాక్చ రింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) వచ్చే మార్చిలో ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. జీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారిగా కాజీపేటకు వచ్చి రైల్వే సర్క్యులేటింగ్ ఏరియా, అమృత్ భారత్ పథకం పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే క్రూ లాబీ, రన్నింగ్ రూంను తనిఖీ చేశారు. రైలు ఎల్పీలు, ఏఎల్పీలు, గార్డులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించగా, షెడ్డు నిర్మాణ మ్యాప్‌ను రైల్వే సీపీఎంసీ మధుసూదనరావు క్షుణ్ణం గా వివరించారు.

అనంతరం ఆయన కార్యాలయంలో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. యూనిట్ షెడ్డులో నిర్మాణ పనులను ప్రతి సెక్షన్‌ను కలియ తిరిగారు. ప్రాజెక్టు పనులను మరింత వేగంగా పెంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగం గా జరుగుతున్నాయ ని, ఈ ఏడాది డిసెంబర్ నాటి పూర్తవుతాయన్నారు. ప్రాజెక్టు ప్రారంభం కాగానే ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు.

అదేవిధంగా జనగామ రైల్వే స్టేషన్‌ను జీఎం తనిఖీ చేసి, అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఆయన వెంట రైల్వే డీఆర్ఎం భర్తేశ్ కుమార్ జైన్, సీపీఎంసీ మధుసూదనరావు, జీఎం సెక్రటరీ శ్రీనివాసరావు, సీనియర్ డీఈఎన్ (కంట్ర క్షన్) రామారావు, ఆర్వీఎన్ఎల్ సీపీఎం సాయిప్రసాద్, సీనియర్ డీఎన్ ప్రంజ్వల్ కేశవాణి, సీనియర్ డీఎంఈ వెంకట్ కుమార్, సీనియర్ డీఈఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

**– స్థానికులకు అవకాశాలు కల్పించాలి**

కాజీపేట రైల్వే స్థలంలో చేపట్టనున్న బస్టాండ్ ఏర్పాటు స్థల ప్రక్రియను వేగవంతం చేయా లని, కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని జీఎంను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ కోరారు. వారు ఈ మేరకు ఆర్ఎంయూ నిర్మాణంలో భూనిర్వాసితుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, వరంగల్ ప్రాంతంలోని రైల్వే సమస్యలపై కలెక్టర్ సత్యశారద వినతి పత్రాలు అందజేశారు.

## ఉద్యాన పంటల సాగు వైపు ప్రోత్సహించి రైతుల ఆదాయం పెరిగేలా చేయాలి : కలెక్టర్ బీఎం సంతోష్




సత్యమేవ జయతే – జోగులాంబ గద్వాలజోగులాంబ గద్వాల : ఉద్యాన పంటల సాగు విస్తీర్ణ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జిల్లా మిషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ఆదాయం పెరిగేలా ప్రతి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

ఆయిల్ పామ్ తోటల పెంపక విస్తీర్ణం పెంచడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సాగు కోసం రైతులను గుర్తించి అవగాహన కల్పించాలని, సబ్సిడీలు, అంతర పంటల ఆదాయం, డ్రిప్ రాయితీలు తదితర వివరాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. విజయవంతమైన రైతులను రోల్ మోడల్‌గా చూపించి, బ్యాంకులు, ఉపాధి హామీ పథకం ద్వారా సహకారం అందించాలని తెలిపారు.

జిల్లాలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం ద్వారా రైతులకు లబ్ధి చేకూరేలా అమలు చేయాలన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, ఆధునిక సాగు పద్ధతులు, కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్ల వంటి సదుపాయాలను సమర్థవంతంగా అందించాలన్నారు. తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడికి రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులపై ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ భాష, వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, పరిశ్రమల శాఖ జీఎం రామ లింగేశ్వర్ గౌడ్,కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్మమ్మ, ఏడీఏ సంగీత లక్ష్మి, ఫారెస్ట్ అధికారి పర్వేజ్ అహ్మద్, పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ మోహన్, ఉద్యానవన,వ్యవసాయ శాఖ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే



# నల్లగొండలో ఘనంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సత్యమేవ జయతే - నల్లగొండ నల్లగొండ : మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు నల్లగొండ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యకర్తలు, అభిమానులు భారీ కేక్ ఏర్పాటు చేయగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కట్ చేశారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా ప్రజల పక్షాన జగదీశ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జగదీశ్‌రెడ్డి ఉద్యమకాలం నుండి కేసీఆర్ వెన్నంటి ఉంటూ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని, ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎవరిన్ని కుట్రలు పన్నినా ఆయన నాయకత్వంలో ఉమ్మడి జిల్లాలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ పూర్వ వైభవం సంతరించుకుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని ఉమ్మడి నల్లగొండ జిల్లాను సమర్థవంతమైన తన నాయకత్వంలో జగదీశ్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ప్రసాదించి మరింతగా ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి పాటుపడే విధంగా భగవంతుడి ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,



అభిమన్యు శ్రీనివాస్, పార్టీ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కనగల్, తిప్పర్తి, నల్లగొండ మండలాల అధ్యక్షులు అయితగోని యాదయ్య, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, ముఖ్య నాయకులు సింగం రామ్మోహన్, బక్క పిచ్చయ్య, కంచనపల్లి రవీందర్‌రావు, కొండూరు సత్యనారాయణ, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మారగోని గణేశ్, జమాల్ ఖాద్రి, మెరుగు గోపి, అన్వర్ పాషా, గుండ్రెడ్డి యుగంధర్‌రెడ్డితో పాటు భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22న నల్లగొండ ఎన్జీ కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం.. టాపర్స్‌కు గోల్డ్ మెడల్స్ బహూకరణ

సత్యమేవ జయతే - నల్లగొండ నల్లగొండ : నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (ఎన్జీ) వ్యవస్థాపక దినోత్సవం, టాపర్స్‌కు గోల్డ్ మెడల్ పంపిణీ ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. శుక్రవారం కళాశాలలోని తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కళాశాలలోని 27 యూజీ, 6 పీజీ కోర్సుల్లో 4 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో చదివి ఆయా కోర్సులో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ పంపిణీని కళాశాల పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో 2021-2025 బ్యాచ్ వరకు మొత్తం 83 మంది విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా దాతలు బంగారు పతకాల పంపిణీకి ముందుకు వచ్చి రూ.1.5 లక్షలు డిపాజిట్ చేస్తే దానిపై వచ్చే వడ్డీతో ప్రతి ఏడాది వారు సూచించిన పేరుతో విద్యార్థులకు గోల్డ్ మెడల్ బహూకరించనున్నట్లు చెప్పారు.

ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే వ్యవస్థాపక దినోత్సవం, గోల్డ్ మెడల్ పంపిణీనికి ముఖ్య అతిథిగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, గౌరవ అతిథులుగా తెలంగాణ కళాశాల విద్యా సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేంద్రసింగ్, ప్రొఫెసర్ పి.బాలబాస్కర్, ఎంజీయూ సీఓఈ




డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, తెలంగాణ కళాశాల విద్య విశ్రాంత ఆర్‌జేడీ ప్రొ. జి.యాదగిరి తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కళాశాల సీఓఈ డాక్టర్ బి.నాగరాజు, తెలుగు విభాగం సీనియర్ అధ్యాపకులు వెల్దండ శ్రీదర్ పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ దుకాణదారుడి నోటిదూల..! కేశంపేటలో రోడ్డెక్కిన రైతన్నలు..!!



సత్యమేవ జయతే - రంగారెడ్డి రంగారెడ్డి : ఫర్టిలైజర్ దుకాణదారుడి నోటిదురుసుతో కేశంపేట మండల కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగారు. ఏవో వచ్చి న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేదిలేదని రహదారిపై భీష్మించుకు కూర్చోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఏవో శిరీషతోపాటు స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు.

వివరాల్లోకి వెళ్తే.. కేశంపేట మండల కేంద్రానికి చెందిన చిర్ర యాదయ్య, కడియాల అంజయ్యలు స్థానికంగా ఉన్న శ్రీనివాస నాగలి ఫర్టిలైజర్ దుకాణంలో నానో డీఏపీ, మొక్కజొన్న పంటకు పురుగుల మందుతోపాటు కలుపు మందును కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఆయా మందులకు దుకాణదారుడు చెప్పిన ధరల మధ్య వ్యత్యాసంగా ఉండడంతో పక్క దుకాణంలో తక్కువ ధర ఉన్నాయని, మీరెందుకు ఎక్కువగా చెబుతున్నారని అడగడంతో ఆగ్రహానికి గురైన దుకాణదారుడు నోటికి పని చెప్పాడన్నారు. 'తన దుకాణం తన ఇష్టమని, తనకు నచ్చిన ధర చెబుతానని, నీ ఇష్టం ఉంటే తీసుకో.. లేదంటే ఇక్కడి నుండి'%&% అంటూ పత్రికల్లో రాయలేని బూతు మాటలు తిట్టాడని ఆరోపించారు.

విషయాన్ని స్థానికంగా ఉన్న తోటి రైతులకు చెప్పడంతో ఆగ్రహానికి గురైన రైతులు దుకాణంవద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం రైతులు, దుకాణదారుడి సంతకాలతో కూడిన రశీదులు సైతం ఇవ్వడంలేదని, నకిలీ రశీదులతో రైతులను మోసం చేస్తున్నారంటూ రహదారిపై బైఠాయించారు. ఏవో వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని రహదారిపై ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఘటన స్థలానికి చేరుకున్న ఏవో శిరీష, పోలీసులు ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఏమైనా సమస్య ఉంటే లిఖిత పూర్వకంగా ఇవ్వాలని, రహదారిపై ప్రజల రాకపోకలకు ఇబ్బందులు సృష్టించవద్దని పోలీసులు సూచించడంతో ఆందోళనకారులు వ్యవసాయశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఫర్టిలైజర్ దుకాణదారులు రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు సాజిద్, మురళీమోహన్‌లు మద్దతు తెలిపారు. కేశంపేటలో ఫర్టిలైజర్ దుకాణాలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాని డిమాండ్ చేశారు. పోలీసుల రంగం ప్రవేశంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎం.కృష్ణయ్య, మాధవరెడ్డి, రమేశ్‌గౌడ్, ఎ.పారేశ, బి.శేఖర్, సతీశ్, సత్తయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఏబీవీపీ కార్యకర్తలు

సత్యమేవ జయతే కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని రావు ఇంటర్నేషనల్ స్కూల్ లో ఈరోజు సుమారు 11:30 గంటల సమయం లో కొంతమంది ఏబీవీపీ కార్యకర్తల మని చెప్పి అక్రమంగా స్కూల్ లోనికి ప్రవేశించి కంప్యూటర్లు కుర్చీలు విరగగొట్టి నారు.మరియు స్కూల్ బస్సు అద్దాలను ధ్వంసం చేసి నానా హంగామా సృష్టించినారు.వైస్ ప్రిన్సిపల్ పై పూల తొట్టి పడవేసి గాయపరిచారు.మరియు స్కూల్ పిల్లలను,సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేసినారు అని స్కూల్ డైరెక్టర్ గారు దమ్మనేని విశ్వాస రావు దరఖాస్తు ఇవ్వగా కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి గారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## రోడ్ల మరమ్మతులపై నిరసన.. రోడ్లపై వరినాట్లేసి కాంగ్రెస్ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధ



సత్యమేవ జయతే - ఇబ్రహింపట్నం ఇబ్రహింపట్నం : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణప్రాంత రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రం నుంచి విజయవాడ హైవేలోని తూప్రాన్‌పేట్ వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేశారు. ముఖ్యంగా రాయపోల్ గ్రామంలో రోడ్డు వెడల్పు చేయకపోవటంతో రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, నిరసిస్తూ శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో రోడ్డుపై నిలిచిన నీటిలో గ్రామస్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వరినాట్లు వేసి, స్థానిక ఎమ్మెలే మల్ రెడ్డి రంగారెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు హయాంలో గ్రామీణ రోడ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. రాయపోల్ గ్రామంలో రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేను పలుమార్లు కోరినప్పటికి పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. నిరసనగా రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ.. క్యాన్సర్ వ్యాధి కంటే ప్రమాదకరం.. బీఆర్ఎస్ నాయకుడు తోట కమలాకర్ రెడ్డి సెటైర్లు



సత్యమేవ జయతే - మెదక్ మెదక్ : క్యాన్సర్ వ్యాధి కంటే కూడా కాంగ్రెస్ పార్టీ ప్రమాదకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో గుంతల రోడ్లు, గుడ్డి దీపాలు ఉండేవని గుర్తుచేశారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఎనుకటి రోజులు తీసుకొచ్చేవిధంగా రాష్ట్రంలో పరిపాలన చేస్తున్నారని మండిపడ్డారు. గుంతలమయమైన బీటీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

బీటీ రోడ్ల మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ కమాన్ నుంచి మోతె మీదుగా మిరుదొడ్డి మండలం కాసులాబాద్, మిరుదొడ్డి వరకు ఆయా గ్రామాల ప్రజలతో కలిసి బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పల్లెల్లో ఎంత మద్యం అమ్ముడవుతుందని సీఎం రేవంత్ రెడ్డి సర్వే చేయించి, ఆ పల్లెల్లో బెల్టుషాపులు పెట్టించాడే గానీ, రైతులకు ఎన్ని విత్తనాలు, ఎంత యూరియా అవసరం అవుతుందని అంచనా వేయకుండానే పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.

కేసీఆర్‌పై నిత్యం అసత్య ఆరోపణలు చేయడమే తప్ప.. రాష్ట్రంలో పాలన లేదని తోట కమలాకర్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి వెనుకంజ వేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గంలో ఎక్కడ సమావేశం జరిగితే అక్కడ ఆ స్టేజి ఎక్కి కూర్చుంటాడే తప్ప.. ఆయనకు రైతుల బాధలు పట్టడం లేదని విమర్శించారు. పల్లెల్లో బీటీ రోడ్లకు మరమ్మతులు చేయకుంటే.. కాంగ్రెస్ పార్టీని బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

### విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.. అధికారులకు సిద్దిపేట కలెక్టర్ వార్నింగ్



సత్యమేవ జయతే - మర్కూక్ మర్కూక్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నూతనంగా మెనూ అమలు చేయాలని, భోజన నాణ్యతపై రాజీ పడే ప్రసక్తే లేదని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్ని శాఖల అధికారులను ఆమె హెచ్చరించారు.సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల కేంద్రంలో శుక్రవారం నాడు కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు, తహసీల్దార్ కార్యాలయం, జడ్పీ హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని సూచించారు. భోజన నాణ్యతపై రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. అక్కడి వైద్య సదుపాయాలను పరిశీలించారు. వైద్య సేవలపై రోగుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమీకృత భవనంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ మార్పు అంశంపై ఉన్నతస్థాయి అధికారులతో చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కేజీబీవీలో నీళ్లు లేక విద్యార్థినుల అవస్థలు.. మూడు రోజులుగా తిప్పలు



సత్యమేవ జయతే - రామాయంపేట

రామాయంపేట : మెదక్ జిల్లా రామాయంపేట కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులు నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా నీళ్లు రాకపోవడంతో స్నానం కూడా చేయలేని దుస్థితి నెలకొంది. కోమటిపల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో 400 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో ఇటీవల కేజీబీవీలో ఉన్న ఒకే ఒక్క బోరు బావి కూడా ఎండిపోయింది. దీంతో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిపైనే కేజీబీవీ ఆధారపడింది. కానీ గత మూడు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు కూడా రావడం లేదు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగడానికే కాకుండా కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానాలకు కూడా నీళ్లు ఉండటం లేదు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో పాఠశాల సిబ్బంది ట్యాంకర్ తెప్పిస్తున్నప్పటికీ అవి సరైన సమయంలో రావడం లేదు. దీంతో ట్యాంకర్ వచ్చే వరకు బహిర్భూమి కూడా వెళ్లకుండా ఉండిపోవాల్సి వస్తుందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీలో నీటి సమస్యతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని ప్రిన్సిపల్ అనురాధ తెలిపారు. తాగునీటితో బాలికలకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ట్యాంకర్ తెప్పించి, విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని వివరించారు.

# ప్రభుత్వ పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది: హరీశ్‌రావు




సత్యమేవ జయతే - సిద్దిపేట

సిద్దిపేట : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. విద్యాశాఖను తన దగ్గర పెట్టుకుని ఏనాడూ సమీక్ష నిర్వహించని గొప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. దాతల సహకారంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం చిన్నకోడూరు పెద్దచెరువుపై నూతనంగా నిర్మించిన కట్ట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పట్టించుకోకుండా పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. విద్యారంగానికి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాఠశాలలను బలోపేతం చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అందించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా పిల్లలు బతికుంటే చాలని గురుకులాల నుంచి తమ పిల్లలను తల్లిదండ్రులు తీసుకెళ్లే పరిస్థితి దాపురించిందని అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గత 8 సంవత్సరాలు పాటు వరుసగా ఒకటి, రెండు స్థానాల్లోనే ఉండేదని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సిద్దిపేట జిల్లా 24వ స్థానానికి పడిపోయిందని అన్నారు. ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. - మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోండి విద్యార్థులు మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని హరీశ్‌రావు సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులు సోషల్‌మీడియా, వాట్సాప్‌కు దూరంగా ఉండాలన్నారు. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

## వికారాబాద్ జిల్లా లో ఆర్ ఆర్ ఆర్ ఆర్ రింగ్ రోడ్డు...



వికారాబాద్.... సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. హైదరాబాద్ చుట్టు పురోగతి ని ప్రోత్సహించెందుకు నిర్వహించడం నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్ ఓ ఆర్ ఆర్ ఈ ప్రాంతం అవును అన్యాయం జరిగింది ఇప్పుడు అదే దిశగా నూతన ప్రతిపాదించిన ట్రిబుల్ ఆర్ రోడ్డు వికారాబాద్ జిల్లా ను తాకనుద్ధి ఈ రోడ్డు పార్వతీపుర్ కంకల్ సిద్దురీర్ అక్కనాపూర్ పులుమామిడి చీమలదరి గ్రామాల మీదుగా వేళ్లనుది.ఈ రోడ్డు వికారాబాద్ జిల్లా లో ప్రవేశం చేయడం తొ పరిసర గ్రామాలకు భూములకు మంచి ధరలు రానున్నాయి. ప్రతీయ అభివృద్ధి కి మారవచ్చు అని పరిశీలకులు అంటున్నారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి మార్గం వైపు పోయే అవకాశాలు ఉన్నాయి.ఐ టీ పరిశ్రమల వైపు పరుగులు తీసుకొని పోతారు.

## సర్పాన్ పల్లి ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టి,కలువల పుటికలు తియ్యాలి.

## 3300ఎకరాలకు సాగునీరు అందించాలి.ప్రాజెక్ట్ చుట్టూ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని,సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్....



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా.. శుక్రవారం సిపిఎం, రైతు సంఘా%శీ%,వ్యవసాయ కార్మిక సంఘల ఆధ్వర్యంలో సర్పాన్ పల్లి ప్రాజెక్టు కింద ఉన్న గొట్టిముక్కల ద్యాచారం సర్పాన్ పల్లి తదితర గ్రామాలలో పర్యాటక చెయ్యడం జరిగింది. సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్పలు మాట్లాడుతూ సర్పాన్ పల్లి ప్రాజెక్టు కింద రెండు గేట్లున్నవి. 2తూములు పగులు ఏర్పడ్డవి ప్రమాద కారంగా ఉన్నవి. ఎడమ కాలువ, కుడి కాలువల కింద 3300 ఎకరాలవరకు సాగునీరు, 0.3%ంవీజ% కెపాసిటీ ఉంది. ఎడమవైపు కాల్వ కింద గొట్టిముక్కల, ద్యాచారం,అంతరం ఐనాపుర్ గ్రామాలకు 300ఎకరాలకు వరకు సాగునీరు అందించాలి. కుడికాలువ కింద గొట్టిముక్కల, ద్యాచారం సర్పాన్ పల్లి, నాసన్ పల్లి, తరిగోపుల గ్రామాలకు 3000వేల ఎకరాల వరకు సాగునీరు అందించాలి.కానీ 20ఏండ్లుగా కాలువలు పుటికలు తియ్యడం లేదు. మరమ్మతులు పుటికలు చేసినట్లు డబ్బులు బిల్లులు తిన్నారు. తూములవద్ద బారి లీకేజీల ఉన్నవి. ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులు కాలువలపై పర్యవేక్షణ లేదు. రైతులకు నీళ్లు అందుతున్నాయా లేదా అనే దిక్కులేని పరిస్థితి కొనసాగుతుంది. ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులు ఉన్నప్పటికీ ప్రాజెక్టులపై పర్యవేక్షణ కరువైంది. కాలువలలో పుటికలు తీయడంలో బారి, బారి లీకేజీలు పూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. లీకేజీలు అధికంగా ఉన్నాయి. ప్రాజెక్ట్ నుండి కిందికి వచ్చే సాగునీరు లీకేజీల వల్ల వాగులలో కాలువలో నీరు వృధా ఎల్లిపోతున్నది రైతులు లబోదిబో అంటున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయింది. అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. ఎడమ కాలువ కింద మూడు ప్రాంతాలలో సిమెంటు, ఇనుప రేకులతో వాగులపై డ్యాములు నిర్మించారు. 20 ఏళ్లుగా నీరు బారీగా వృధాగా లీకు అవుతుంది. సాగునీరు వృధాగా కాలువలో వాగుల్లో పోతుంది. రైతులతో మాట్లాడగా... అయగ్రమాల రైతులు జిల్లా కలెక్టర్లకు, ఎమ్మెల్యే లకు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పీకర్ ఎమ్మెల్యే వెంటనే ప్రాజెక్ట్ కింద ఉన్న గ్రామాలను సందర్శించి రైతులకు సాగునీరు అందే విధంగా కాలువలలో పూటికలు తీయాలి. లీకేజీలో మరమ్మత్తులు చేయాలి. ప్రాజెక్టు కింద సాగు చేసుకుంటున్నా రైతులందరికీ సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రాజెక్ట్ కాలువల పరివేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇరిగేషన్ ఈ ఈ, అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, కొత్త అధికారులను నియమించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాం లేనిచో ఇరిగేషన్, జిల్లా కలెక్టర్ కార్యాలయల ముందు ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాల రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామనీ ప్రభుత్వానికి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల తరపున హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యూ.బుగ్గప్ప, రైతులు, నాయకులు లక్ష్మయ్య వెంకటయ్య దశరథ్ వెంకటేష్ అంజయా జంగయ్య నర్సింలు ఆంజనేయులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ లో పార్కుల అభివృద్ధి కి కృషి హెచ్ఎండిఏ. డైరెక్టర్... ప్రసాద్ ఐ ఫ్ ఎస్.





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. వికారాబాద్ పురపాలక సంఘం హెచ్ఎండిఏ పరిధిలోని శివసాగర్ చెరువు మరియు పలు పార్కు లను అభివృద్ధి చేసేందుకు గాను హెచ్ఎండిఏ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతు వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న పార్కులను అభివృద్ధి చేస్తామని తెలిపారు మరియు అధికారులు మరియు జిల్లా అదనపు కలెక్టర్ ఎం సుదీర్ ,మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ .మరియు జిల్లా అటవీ శాఖ అధికారి ,మునిసిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ,ఎన్విరాల్మెంట్ యేసు. మరియు శ్రీనివాస్ ఇంజనీర్ మరియు ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది.

## పల్లె పల్లె కు కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు

## ప్రజా పాలనలో అభివృద్ధి వైపు గ్రామాలు...

సత్యమేవ



జయతే. వికారాబాద్ జిల్లా..

శుక్రవారం పరిగి మండలం జాఫర్ పల్లిలోని మోడల్ స్కూల్లో 2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన బయోటాక్స్ లైట్లను పరిగి ఎమ్మెల్యే %ం% డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.లి

అనంతరం రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.లి

కద్లపూర్ గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు.లి

కద్లపూర్ గ్రామంలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో స్థానిక నాయకులు అధికారులతో కలిసి పాల్గొని మొక్కలు నాటారు.లి

సయ్యద్ పల్లి గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు.అనంతరం లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

అనంతరం రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.లి

మహోత్సవ కార్యక్రమంలో స్థానిక నాయకులు అధికారులతో కలిసి పాల్గొని మొక్కలు నాటారు.

లబ్ధిదారులకు రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.లి

## రూ.1 లక్ష పెడితే రూ.20 లక్షల లాభం.. జీవితాన్నే మార్చేసిన స్కీమ్స్!



స్కీమ్స్ మాత్రం కేవలం లక్షతోనే 20 లక్షల రూపాయల వరకు లాభాలు తెచ్చి పెట్టింది. ఇందు కోసం చాలా మంది ఇన్వెస్టర్లు లార్జ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ ఎంచుకుంటుంటారు. ఈ ఫండ్స్ తమ పెట్టుబడులను లార్జ్, స్థిరమైన వృద్ధి..ఘ్రుతీవ

దీవర్ ాష్ట్రవవం%: ఈ రోజుల్లో డబ్బు సంపాదించేందుకు రకరకాల మార్గాలున్నాయి. తక్కువ ఇన్వెస్ట్‌మెంట్‌తో ఎక్కువ లాభాలు వచ్చే పథకాలు ఎన్నో ఉన్నాయి. స్కీమ్స్ మాత్రం కేవలం లక్షతోనే 20 లక్షల రూపాయల వరకు లాభాలు తెచ్చి పెట్టింది. ఇందు కోసం చాలా మంది ఇన్వెస్టర్లు లార్జ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ ఎంచుకుంటుంటారు. ఈ ఫండ్స్ తమ పెట్టుబడులను లార్జ్, స్థిరమైన వృద్ధి గల కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. పెద్ద కంపెనీలు మార్కెట్ అనిశ్చితులు, ఆర్థిక మాంద్యం వంటి పరిస్థితుల్లోనూ బలంగా నిలబడగలే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. మీరు లార్జ్ క్యాప్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తే మీ డబ్బులు బలమైన బ్యాలెన్స్ షీట్లు, బలమైన మేనేజ్‌మెంట్, స్థిరమైన నగదు నిర్వహణ ఉన్న కంపెనీల్లోకి వెళ్తాయి.గత 20 సంవత్సరాల్లో రెండు ఫండ్స్ హైరిటర్న్స్ అందించాయి. ఇన్వెస్టర్ల సంపదను 20 రెట్లు పెంచాయి. లక్ష రూపాయలు పెట్టిన వారికి రూ.20 లక్షలు అందించాయి. ఫండ్స్ ఇండియా, ఏస్ ఎంఎఫ్ రీసర్చ్ డేటా ప్రకారం.. గత 20 ఏళ్లలో దేశంలోనే కేవలం 2 ఫండ్స్ మాత్రమే ఇన్వెస్టర్ల సంపదను 20 రెట్లు పెంచాయి. అవే ఆదిత్య బిర్లా సన్ లైఫ్ లార్జ్ క్యాప్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ క్యాప్ ఫండ్. ఈ రెండు ఫండ్స్ రూ.1 లక్ష పెట్టుబడిని 20 ఏళ్లలో రూ.20 లక్షలు చేశాయి. గత 20 ఏళ్లలో ఆదిత్య బిర్లా సన్ లైఫ్ లార్జ్ క్యాప్ ఫండ్ 21.1 రెట్లు రిటర్న్స్ అందించింది. ా సీఏజీఆర్ రేటు 16.5 శాతంగా ఉంది. అంటే ప్రతి ఏడాది 16.5 శాతం చొప్పున రిటర్న్స్ అందిస్తూనే వచ్చింది. ఇక హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ క్యాప్ ఫండ్ 20 ఏళ్లలో 20.1 రెట్ల మేర లాభాలు అందించింది. ఈ స్కీమ్ సీఏజీఆర్ రేటు 16.2 శాతంగా ఉంది.

సత్యమేవ జయతే


# మహాదానం.. మనమూ చేద్దాం!

**మన రక్తం మనల్ని బతికిస్తుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇతరుల జీవం నిలబెడుతుంది. రక్తం అమృతభాండం లాంటిది. పంచుకున్నకొద్దీ పెరుగుతుంది. ప్రమాదాల్లోనో, ప్రసూతి సమయంలోనో, శస్త్ర చికిత్సల కారణంగానో ఎవరికి రక్తం అవసరమైనా.. స్వచ్ఛందంగా అందిద్దాం. మన రక్తంలో మానవత్వం ప్రవహిస్తున్నదని నిరూపించుకుందాం శరీరంలోని వివిధ అవయవాలకు ప్రాణవాయువును చేరవేసే వాహకం.. రక్తం. మనిషికి శ్వాస ఎంత ముఖ్యమో, రక్తమూ అంతే ప్రధానం. శ్వాస ద్వారా మనం తీసుకున్న ప్రాణవాయువును ప్రధాన అవయవాలైన.. గుండె, మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలతో పాటు అన్ని అంతర్గత భాగాలకూ అందిస్తుంది రక్తం. రోడ్డు ప్రమాదాలు, ఇతర సంఘటనలు జరిగినప్పుడు రోగి శరీరంలోని రక్తం ధారాపాతంగా బయటికి పోతుంది. ఫలితంగా ఒంట్లోని రక్తం తగ్గిపోతుంది. మెదడు, గుండె తదితరాలకు రక్త సరఫరా నిలిచిపోవడంతో.. ఆక్సిజన్ కూడా అందదు. వివిధ అవయవాలు పనిచేయడం మానేస్తాయి.ఈ పరిస్థితుల్లో రోగి మరణించే ఆస్కారమూ ఉంది. కాబట్టే ప్రమాదాల్లో తీవ్ర రక్తస్రావానికి గురైనవారికి తక్షణం రక్తం ఎక్కిస్తారు వైద్యులు. మహిళల విషయానికొస్తే.. చాలా మందికి కాన్పుల సమయంలో రక్తస్రావం జరుగుతుంది.**

అలాంటప్పుడు బయటి నుంచి రక్తం అవసరం అవుతుంది. గుండె, కాలేయం, కిడ్నీలు తదితర భాగాలకు శస్త్రచికిత్సలు జరిగినప్పుడు, ఇతర ఆపత్సమయాల్లోనూ రోగులకు రక్తం ఎక్కించాల్సిందే. ఆలస్యమైనకొద్దీ ప్రాణగండమే. ఈ క్రమంలోనే రక్తదానానికి ప్రాధాన్యం పెరిగింది. రక్తదాన ఆవశ్యకతను జనంలోకి తీసుకెళ్లి.. రక్తదాతలను ప్రోత్సహించే క్రమంలో ఏటా జూన్ 14ను 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం'గా జరుపుకొంటారు. ఎముక మజ్జ రక్తానికి జన్మస్థానం. తొమ్మిది రకాలు రక్తంలో ఎనిమిది ప్రధాన గ్రూపులతోపాటు, మరొక అరుదైన గ్రూపు కూడా ఉంది. ఆ ఎనిమిదిలో నాలుగు పాజిటివ్ అయితే, నాలుగు నెగెటివ్. సుమారు 90 శాతం మంది పాజిటివ్ గ్రూపులకు చెందిన రక్తాన్నే కలిగి ఉంటారు. అందులో ఎక్కువ మంది 'ఒ-పాజిటివ్' పరిధిలోకి వస్తారు. రెండో స్థానంలో 'ఎ-పాజిటివ్', మూడో స్థానంలో 'బి-పాజిటివ్', నాలుగో స్థానంలో 'ఎబి-పాజిటివ్' ఉంటారు. ఇవి కాకుండా.. ఎ-నెగెటివ్, బి-నెగెటివ్, ఎబి-నెగెటివ్, ఒ-నెగెటివ్ గ్రూపులూ ఉంటాయి. ఈ ఎనిమిదింటిలో 'ఎబి-నెగెటివ్' అరుదైంది. ప్రతి వెయ్యిమందిలో ఆరుగురికి మాత్రమే ఈ గ్రూపు రక్తం ఉంటుంది. ఇక, అన్నిటికంటే అపురూపమైంది 'బాంబే బ్లడ్ గ్రూప్'.



### అత్యవసర పరిస్థితుల్లో

ఒ-పాజిటివ్ రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో పాజిటివ్ గ్రూప్‌కు చెందిన.. అంటే ఎ-పాజిటివ్, బి-పాజిటివ్, ఎబి-పాజిటివ్ వ్యక్తులకు ఎక్కించవచ్చు. కానీ, నెగెటివ్ గ్రూపులకు అంటే.. ఎ-నెగెటివ్, బి-నెగెటివ్, ఎబి-నెగెటివ్, ఒ-నెగెటివ్ గ్రూపుల వారికి అస్సలు ఎక్కించకూడదు. అలా చేస్తే ప్రాణాంతకం కూడా. ఒ-నెగెటివ్ రక్తాన్ని మాత్రం అన్నిరకాల పాజిటివ్, నెగెటివ్ గ్రూపుల రోగులకు ఎక్కించవచ్చు. అందుకే దీన్ని 'యూనివర్సల్ డోనర్' అని పిలుస్తారు.

### బాంబే బ్లడ్‌గ్రూప్

1952లో మొదటి సారిగా డాక్టర్ భేండే అనే వైద్యుడు.. ముంబైలో ఈ అరుదైన గ్రూపును గుర్తించారు. కాబట్టే, దీనికి బాంబే బ్లడ్‌గ్రూప్ అని పేరు పెట్టారు. పదివేల మందిలో ఒకరికి మాత్రమే ఈ తరహా రక్తం ఉంటుంది. బాంబే గ్రూపు వ్యక్తులకు ఆ గ్రూపునే ఎంచుకోవాలి. మరే ఇతర రకాన్నీ ఇచ్చేందుకు వీలులేదు.

### ఏం ఉంటాయి?

సాధారణంగా దాతల ద్వారా సేకరించిన రక్తం నుంచి రెండు రకాల ద్రవాలను, రెండు రకాల కణాలను తీస్తారు. అందులో ముఖ్యమైంది 'ప్యాక్డ్ రెడ్ బ్లడ్‌సెల్స్'. 'రెడ్ బ్లడ్‌సెల్స్' అనీ అంటారు. రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా.. అనే అనే నాలుగు ప్రధాన పదార్థాలు ఉంటాయి. వీటినే 'కాంపొనెంట్స్'గా వ్యవ హరిస్తారు. ఒక వ్యక్తి నుంచి సేకరించిన రక్తాన్ని ప్రత్యేక పద్ధతి ద్వారా వేరు చేస్తారు. ఆ ప్రక్రియలో ఎర్ర రక్తకణాలన్నీ అడుగు భాగానికి చేరుకుంటాయి. ప్లాస్మా పైకి తేలుతుంది. ప్లేట్‌లెట్స్ మధ్యభాగంలో ఉండిపోతాయి. వీటిని ప్రత్యేక పద్ధతి ద్వారా వేరుచేస్తారు. అవసరాన్ని బట్టి రోగులకు ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తారు.

### ఎర్ర రక్తకణాలు

ఎర్రరక్త కణాలున్న ద్రవాన్ని రెడ్ బ్లడ్‌సెల్స్(ఆర్‌బీసీ) అంటారు. ఎర్ర రక్తకణాలు శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను చేరవేస్తాయి. ఎర్ర రక్తకణాలను 43 రోజుల పాటు నిల్వ ఉంచవచ్చు. గుండె, కాలేయం, కిడ్నీ మార్పిడి వంటి శస్త్ర చికిత్సలు, కాన్పులు, ప్రమాదాల సమయంలో ఎక్కిస్తారు. పరిస్థితి తీవ్రతను బట్టి రక్తహీనత ఉన్న వారికి కూడా ఎర్ర రక్త కణాలను అందిస్తారు.

### ప్లేట్‌లెట్స్

ప్లేట్‌లెట్స్ రక్తస్రావాన్ని అరికడతాయి. శరీరం నుంచి ధారాపాతంగా కారిపోకుండా అడ్డుపడతాయి. శస్త్ర చికిత్సలు, రోడ్డు ప్రమాదాల్లో రోగికి తీవ్ర రక్తస్రావం జరిగినప్పుడు.. ఈ కణాలను ఎక్కిస్తారు. క్యాన్సర్, డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబలినప్పుడు రోగి శరీరంలో ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. అప్పుడు కూడా ఈ కణాల అవసరం ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ కణాలను ఐదు రోజులు నిల్వ చేయవచ్చు.

### ప్లాస్మా ద్రవం

అగ్ని ప్రమాద బాధితులకు ఎక్కువగా ప్లాస్మా ఎక్కిస్తారు. ఇలాంటి సందర్భంలో ఒంటిమీది చర్మం కాలిపోయి మాంసం తేలుతుంది. రక్తంలోని ద్రవ పదార్థం ఆవిరైపోతుంది. ప్లాస్మాకు శరీరంలోని విష పదార్థాలను నిరోధించే శక్తి ఉంటుంది. కాలిన గాయాల వల్ల ప్లాస్మా ఆవిరైపోవడంతో శరీరంలో విషపదార్థాలు పేరుకుంటాయి. దీన్నే 'ఇన్‌ఫెక్షన్' అంటారు. ప్లాస్మా తగ్గేకొద్దీ ఇన్‌ఫెక్షన్స్ పెరిగిపోతాయి. ప్లాస్మాను నిర్దిష్ట ఉష్ణోగ్రతల వద్ద సంవత్సరం పాటు నిల్వ ఉంచవచ్చు. అగ్ని ప్రమాద బాధితులకు, దీర్ఘకాలిక కాలేయ వ్యాధిగ్రస్తులకు ప్లాస్మాను ఎక్కువగా వినియోగిస్తారు. అలాంటివారికి సంజీవినిలా పనిచేస్తుంది.

### రక్త దానానికి అర్హతలు

సాధారణంగా, రక్తదాన సమయంలో ఒక వ్యక్తి నుంచి 450 మిల్లీ లీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. రక్తం సేకరించే ముందు దాతకు కొన్ని పరీక్షలు చేస్తారు. రక్తదానం చేసేవారికి కొన్ని అర్హతలు కూడా ఉండాలి. పద్దెనిమిదేండ్లు నిండాలి. అరవై ఏండ్లలోపు వారై ఉండాలి. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులై ఉండాలి 60 కిలోలకు పైగా బరువు కలిగి ఉండాలి. రక్తపోటు సాధారణంగా ఉండాలి.రక్తంలో హిమోగ్లోబిన్ తగినంత ఉండాలి.చర్మవ్యాధులు ఉండకూడదు.హెచ్‌ఐవీ తదితర అంటువ్యాధులు ఉండకూడదు.రక్తదానం చేసిన సుమారు 21 రోజుల్లో శరీరం ఆ లోటును భర్తీ చేసుకుంటుంది.కాబట్టి, ఒకసారి రక్తదానం చేసినవారు, కనీసం మూడు మాసాల తరువాత మరో రక్తదానానికి సిద్ధం కావచ్చు. ఇంకో ప్రాణాన్ని నిలబెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేయవచ్చు. రక్తదానాన్ని మించిన మహాదానం లేదు. రక్తం ఇవ్వడం అంటే.. అమృతాన్ని ప్రసాదించడమే. అపోహలను, భయాలను వదిలిపెట్టి అర్హులంతా రక్తదానానికి ముందుకు రావాలి. కాకపోతే రక్తదానానికి వెళ్లేముందు కొన్ని జాగ్రత్తలూ అవసరం. ముందురోజు కంటినిండా నిద్రపోవాలి. రక్తదానానికి ముందు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. పుష్కలంగా మంచినీళ్లు తాగాలి. దీర్ఘకాలంగా ఏవైనా మందులు వాడుతుంటే.. ఆ విషయాన్ని తెలియజేయాలి.

### రక్తం తగ్గిపోతే..

రక్తం లేకపోతే మనిషి బతకలేడు. శరీరంలో ప్రవహించే రక్తం మెదడు, గుండెతో పాటు ఇతర అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా చేస్తుంది. రక్త ప్రసరణ తగ్గిపోయినా, సరఫరా నిలిచిపోయినా.. మెదడు పనిచేయడం మానేస్తుంది. రక్తహీనత వల్ల ముఖ్యంగా బీపీ పడిపోతుంది. అంటే రక్తప్రసరణ ప్రవాహ తీవ్రత తగ్గుతుంది. దీనివల్ల మెదడుకు ప్రాణవాయువు అందదు. దీంతో మెదడు చైతన్యహీనం అవుతుంది. 'బ్రెయిన్‌డెడ్' అంటే ఇదే. రక్త ప్రసరణ ఆగిపోతే మెదడు 3 నుంచి 5 నిమిషాలకు మించి పనిచేయదు. ఈ సమయం దాటితే నిర్జీవ స్థితికి చేరుకుంటుంది. రక్తహీనత వల్ల దెబ్బతినే రెండో ప్రధాన అవయవం గుండె. రక్తప్రసరణ ఆగిన 30 నుంచి 45 నిమిషాల వరకు మాత్రమే కనాకష్టంగా పనిచేస్తుంది. అంతకు మించితే శాశ్వతంగా ఆగిపోతుంది.

# ప్రతీరోజూ రాత్రి ఈ జాగ్రత్తలతో డయాబెటిస్ కంట్రోల్!!




డయాబెటిస్.. దీర్ఘకాలిక వ్యాధి. డయాబెటిస్ ను సకాలంలో నియంత్రించకపోతే అది హార్ట్ స్ట్రోక్ ను, బ్రెయిన్ స్ట్రోక్ ను కూడా కలిగిస్తుంది. సరైన ఆహారం తీసుకుంటూ, జీవనశైలి విధానాన్ని మార్చుకుంటే డయాబెటిస్ ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించాలి అనుకుంటే కచ్చితంగా తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్లను తగ్గించి, ప్రోటీన్లు పెంచుకోవాలి. మంచి ప్రోటీన్లు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది. డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవడానికి రాత్రిపూట కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిక్ బాధితులు రాత్రివేళ చిరుతిండ్లు తినకూడదు. డయాబెటిక్ బాధితులు రాత్రిపూట తక్కువ తినాలి. అది కూడా ఏడు గంటల లోపే డయాబెటిక్ బాధితులు భోజనం చేయడం మంచిదని సలహా ఇవ్వబడింది. రక్తంలో చక్కెర స్థాయిలు నిర్వహించడం కోసం డయాబెటిస్ బాధితులు ప్రతి రోజూ 7 నుండి 8 గంటల సేపు నిద్రపోవాలని సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద రైలు ప్రమాదాలు ఇవే ఇక ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు ఒక కప్పు చామంతి టీ తాగితే డయాబెటిస్ అదుపులోకి వస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక నిద్రకు ముందు వాకింగ్ చేయడం కూడా డయాబెటిస్ బాధితులకు మేలు చేస్తుందని చెబుతున్నారు. ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు ఏడు నుంచి ఎనిమిది పప్పులు నానబెట్టిన బాదం పప్పు తినడం వల్ల కూడా షుగర్ లెవెల్ అదుపులోకి వస్తుంది. అలాగే ప్రతిరోజు రాత్రి సమయంలో నానబెట్టిన మెంతుల నీళ్లు తాగుతూ, నానబెట్టిన మెంతులు తింటే కూడా డయాబెటిస్ కంట్రోల్ లో ఉంటుంది. మెంతులు హైపో గ్లైసీమిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే రాత్రి భోజనం చేసిన తర్వాత మరియు పడుకునే ముందు 15 నిమిషాల పాటు వజ్రాసనంలో కూర్చుంటే రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. తిన్న ఆహారం ఈజీగా జీర్ణమవుతుంది. అందుకే డయాబెటిస్ ను కంట్రోల్ చేసుకోవాలనుకునే వారు రాత్రివేళల్లో ఈ చిన్న చిన్న చిట్కాలను పాటించాలని సూచిస్తున్నారు.

# ఈ పండ్లు తింటే వయస్సు గుర్తించలేనంత యవ్వనంగా.. నిత్య నూతనంగా..

మనలో చాలామంది సంవత్సరం గడుస్తున్న కొద్దీ వయసు మీద పడుతుందని తెగ బాధ పడుతూ ఉంటారు. వయసు కనపడనీయకుండా ఉండటంకోసం యాంటీ ఏజింగ్ క్రీములు, సీరమ్ లు వాడుతూ ఉంటారు. అయితే అవేవీ అవసరం లేకుండానే యాంటీ ఏజింగ్ ఫ్రూట్స్ ఆహారంలో భాగంగా చేసుకుంటే యవ్వనంగా, నిత్యనూతనంగా కనబడతారని, వయసు అసలు గుర్తుపట్టలేనంతగా యంగ్ గా మారతారని చెబుతున్నారు. వయసు కనబడనివ్వకుండా, అందాన్ని ఇనుమడింపజేసే ఆ పండ్లు ఏమిటో తెలుసుకుందాం. ఆరోగ్యాన్ని మరియు ఆరోగ్యకరమైన చర్మాన్ని కాపాడుకోవడానికి ఆహారంతోపాటు జీవనశైలి ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. జీవనశైలిలో మార్పులతో పాటు ఆహారంలో కొన్ని యాంటీ ఏజింగ్ ఫ్రూట్స్ ను చేర్చుకుంటే యవ్వనంగా కనిపిస్తారు. ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద రైలు ప్రమాదాలు ఇవే ఇక అటువంటి పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉన్న నారింజ పండు ఒకటి. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన చర్మ సంరక్షణ చేసి, చర్మం ముడతలు రాకుండా కాపాడతాయి. ఏజింగ్ సమస్యలు లేకుండా చేస్తాయి. వృద్ధాప్యాన్ని మరియు అనేక వ్యాధులను నిరోధించే ఫ్రీ రాడికల్స్ తో ఇవి పోరాడతాయి. తెలంగాణ ప్రజలను దగా చేశారు.. ఇక మన శరీరంలో కొలాజిన్ ఉత్పత్తిని పెంచి, శరీరాన్ని ముడతలు లేకుండా చేసి, యవ్వనంగా వుంచటంలో పుచ్చకాయలు దోహదం చేస్తాయి. పుచ్చకాయలు శరీరాన్ని హైడ్రేట్ గా కూడా ఉంచుతాయి . ద్రాక్ష పళ్లలో యాంటీ ఏజింగ్



లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి దోహదం చేస్తాయి. బొప్పాయి ఆరోగ్యానికే కాదు చర్మానికి ఎంతో మేలు చేస్తుంది . చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది . చర్మ కణాలు డ్యామేజ్ కాకుండా బొప్పాయి కాపాడుతుంది. బొప్పాయి కూడా ఏజింగ్ లక్షణాలను బయటకు రాకుండా చేస్తుంది. కివీ పండ్లు చర్మాన్ని మృదువుగా మెరుస్తూ ఉండేలా చేస్తాయి. కోరమాండల్ రైలు ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ విచారం: హెల్ప్‌లైన్ నెంబర్లు కివీ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు విటమిన్ సి మరియు విటమిన్ ఈ చర్మ సౌందర్యాన్ని పెంచడానికి పనిచేస్తాయి. అవకాడోలో విటమిన్లు ఆరోగ్యకరమైన కొవ్వుల తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుందియాంటీఏజింగ్ బెనిఫిట్స్ ఇందులో ఉంటాయి.

# రెటినాల్ ఎంత మేలు?

చర్మ సంరక్షణలో రెటినాల్ ప్రాధాన్యం గురించి చాలా చెబుతుంటారు. అలాంటి క్రీమ్‌లు రాసుకోవచ్చా?

**ఓ పాఠకురాలు :** ప్రాథమికంగా ఇది విటమిన్-ఎలోని కొవ్వులో కరిగే పదార్థాల సమూహానికి చెందింది. కణాల పునరుద్ధరణలో ఉపయోగపడుతుంది. చర్మ సౌందర్యాన్ని రెట్టింపుచేసే సామర్థ్యం ఉంది. ఒంటికి నిగారింపునిచ్చి, అసలు వయసు కనబడకుండా చేస్తుంది. ముడతలు, మచ్చలు మొదలైన వాటిని వేగవంతంగా దూరం చేస్తుంది. క్రీమ్, సీరమ్ రూపంలో రెటినాల్ లభిస్తుంది. రోజు విడిచి రోజు కానీ, మూడురోజులకు ఒకసారి కానీ వాడొచ్చు. కాకపోతే కొందరికి రెటినాల్ పడదు. అలాంటివారు దూరంగా ఉండటమే మంచిది. పూసుకోగానే.. చర్మం కందిపోవడం, ఎర్రబారడం, నల్లబడిపోవడం, ఊడిపోవడం, దురద తదితర దుష్ప్రభావాలు కనిపిస్తాయి. వాడేముందు నిపుణులను సంప్రదించడం మంచిది. గర్భిణులు దూరంగా ఉండటం క్షేమం. మరీ ఎక్కువ కాలం వాడటం కూడా మంచిది కాదని అధ్యయనాలు చెబుతున్నాయి.



# సర్వైకల్ క్యాన్సర్ రాకుండా..



డాక్టర్ గారూ నమస్తే. సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఏ వయసులో వేసుకోవాలి. ఇలాంటి క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్లు మార్కెట్‌లో ఇంకేమైనా ఉన్నాయా? ఎంత ఖర్చు అవుతుంది? ఎక్కడ లభిస్తాయి?

సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్లను తొమ్మిదేళ్ల నుంచి పదిహేనేళ్లలోపు ఆడపిల్లలైతే.. రెండు డోసులు వేయించాలి. తొలిడోసు తర్వాత ఆరునెలలకు మరో డోసు వేస్తారు. ఒక్కో డోస్ రెండు వేల దాకా అవుతుంది. పెద్దవాళ్లు కూడా వేయించుకునే వీలుంది. నిజానికి, సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను 45 ఏళ్ల వయసులోనూ తీసుకోవచ్చు. కాకపోతే, పెళ్లికి ముందు అయితే మంచిది. ఎందుకంటే, ఈ క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్ల వస్తుంది. ఇది సంభోగం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. హెచ్‌పీవీలో చాలా రకాలు ఉంటాయి. అలా అని, అన్నిటి వల్లా క్యాన్సర్ రాదు. హైరిస్క్ హెచ్‌పీవీ వల్ల మాత్రమే క్యాన్సర్ వస్తుంది. శరీరంలో ఉండేది మామూలు వైరసా, హైరిస్క్ వైరసా అనేది బయటికి తెలియదు కాబట్టి, లైంగిక జీవితం ప్రారంభించకముందే ఈ వ్యాక్సిన్లు తీసుకుంటే మంచిది. ఇవి వేయించుకున్నా సరే.. పెళ్లయ్యాక లేదా సెక్స్ జీవితం ప్రారంభించిన మూడేళ్ల తర్వాత పాప్‌స్మియర్ తప్పకుండా చేయించుకోవాలి. పదిహేను దాటాక అయితే, మొదటి డోసు తర్వాత రెండు నెలలకు ఒకటి, ఆరునెలలకు మరొకటి చొప్పున మూడు డోసులు తీసుకోవాలి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా దాదాపు 80 శాతం వరకూ ఇవి నియంత్రించగలవు. మిగతా క్యాన్సర్లకు ఎలాంటి వ్యాక్సిన్లూ అందుబాటులో లేవు. ఏ వయసు వాళ్లయినా వేసుకోగలిగే మరో వ్యాక్సిన్ హెపటైటిస్-బి. ఇది లివర్ క్యాన్సర్ రాకుండా అరికడుతుంది. కామెర్లతో వచ్చే ఇన్‌ఫెక్షన్ కారణంగా ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. హెపటైటిస్-బి పరీక్ష నెగెటివ్ వస్తే ఈ డోస్ వేయించుకోవచ్చు.

# రైతుకు రొక్కం.. చేనుకు శోభ!



మా నాన్న భద్రయ్య హెడ్ మాస్టర్. సొంతూరు కరీంనగర్ జిల్లా చొప్పదండిలో మాకు యాభై ఎకరాల సేద్యం ఉంది. కూలీలు ఉన్నా కుటుంబ సభ్యులు కూడా కష్టపడక తప్పదు. చదువుకునే రోజుల్లో నేనూ పొలానికి వెళ్లేదాన్ని. అప్పట్లో ఇన్ని పనిముట్లు లేవు. ఇన్నిన్ని వంగడాలు లేవు. నేను హైదరాబాద్‌లోని రెడ్డి ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ చదివాను. అప్పట్లో హైదరాబాద్‌లో మత ఘర్షణల వల్ల చాలా రోజులు కాలేజ్ మూసేశారు. క్లాసులు సక్రమంగా జరిగేవి కాదు. దీంతో ఎంసెట్ సరిగా రాయలేకపోయాను. చదివితే వ్యవసాయ శాస్త్రమే చదవాలనే పట్టు దలతో డిగ్రీలో చేరలేదు. ఎంసెట్ రెండో ప్రయత్నంలో మంచి ర్యాంక్ వచ్చింది. బీఎస్సీ (అగ్రికల్చర్)లో చేరాను. రెండో సంవత్సరంలో ప్లాంట్ బ్రీడింగ్ పరిచయమైంది. కొత్త వంగడాల గురించి ఇందులో ఉంటుంది. పీజీలో ప్లాంట్ బ్రీడింగ్ చదవాలంటే ఎంట్రన్స్‌లో మంచి ర్యాంక్ రావాలి. అందుకే పట్టుదలగా చదివాను. ఫస్ట్ ర్యాంక్ సాధించాను. ఎమ్మెస్సీలో ప్లాంట్ బ్రీడింగ్ స్పెషలైజేషన్ చేశాను. సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ రీసెర్చ్ ఫెలోషిప్ వచ్చింది. ధార్వాడ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌లో చేరాను. పొద్దుతిరుగుడు పంటలో పేరెంటల్ లైన్స్ (ఆడ, మగ) సాగు మీద పరిశోధన చేశాను. మూడేళ్లలోనే పీహెచ్‌డీ పట్టా సాధించాను.

**వరంగల్ కంది**

పీహెచ్‌డీ పూర్తికాగానే మండల వ్యవసాయ అధికారిగా ఉద్యోగం వచ్చింది. మూడేళ్ల తర్వాత ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సైంటిస్ట్ కొలువు వరించింది. నన్ను ప్రత్యేక బాధ్యతలతో వరంగల్‌లోని రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌కు పంపారు. అప్పట్లో ఇంత నీటి లభ్యత లేదు. ఆరుతడి పంటలే ఎక్కువ. కంది చేలు వైరస్‌ను తట్టుకోలేకపోయేవి. తక్కువ దిగుబడి పంటలనే రైతులు సాగు చేసేవారు. అధిక రాబడినిచ్చే, వైరస్ తెగుళ్లను తట్టుకునే కొత్తరకం వంగడాలపై అక్కడ పరిశోధన జరిగేది. నేనూ భాగస్వామిని అయ్యాను. డబ్ల్యూఆర్‌జీఈ93, డబ్ల్యూఆర్‌జీఈ97, డబ్ల్యూఆర్‌జీ255 వంగడాలను అభివృద్ధి చేశాం. తెలంగాణ రైతులు అత్యధికంగా సాగు చేస్తున్నది ఈ కంది వంగడాలనే. ఆపైన కరీంనగర్‌లోని మొక్కజొన్న పరిశోధనా స్థానానికి బదిలీ అయ్యాను. ఇక్కడ ఎండు తెగులును తట్టుకునే హైబ్రిడ్ మొక్కజొన్న కేఎన్ఎంహెచ్4010131, యాసంగిలో తక్కువ కాలంలో దిగుబడి నిచ్చే కేఎన్ఎంహెచ్ 4010141 పేరెంటల్ లైన్స్‌ని అభివృద్ధి చేశాం.

**నెంబర్ వన్ సీడ్**

పొలాసలోని రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్‌లో అసోసియేట్ బ్రీడర్‌గా వరి వంగడాలపై పరిశోధన చేశాను. ఉల్లికోడు పురుగు వల్ల ఎక్కువగా నష్టపోతున్నామని రైతులు చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారంగా తక్కువ వ్యయంతో, అధిక లాభాలిచ్చేలా కొత్త వంగడాల రూపకల్పనకు పూనుకున్నది మా బృందం. రెండేళ్లు కష్టపడి 'ప్రద్యుమ్న' రకం తయారు చేశాం. ఇది తక్కువ కాల పరిమితిలో మంచి దిగుబడిని ఇస్తుంది. వానకాలం, యాసంగి పంటగా వేసుకోవచ్చు. ఉల్లికోడును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే 'బతుకమ్మ' రకం వరి వంగడాన్నీ మేమే అభివృద్ధి చేశాం. సన్న వడ్లలో 'జేజీఎల్ 24423' రకం వంగడాన్ని అభివృద్ధి చేశాం. ఈ రకం వరిని సాగుచేస్తే మొక్క పడిపోదు. గింజ రాలిపోదు. సన్న వడ్లలో అధిక దిగుబడినిచ్చే 'కేఎన్ఎం1638' వంగడాన్నీ అభివృద్ధి చేశాం. మన రైతుల ప్రాధాన్యం ఈ వరి వంగడాలే. తెలంగాణలో సాగు అవుతున్న వరిలో కేఎన్ఎం1638, జేజేఎల్24423లే ఎక్కువ.

**బ్రీడ్ లీడర్**

అయిదేళ్ల క్రితం.. నర్సాపూర్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌కు సీనియర్ సైంటిస్ట్‌గా బదిలీ అయ్యాను. ఇక్కడ ఆగ్రో ఫారెస్ట్రీలో రీసెర్చ్ చేస్తున్నాను. ట్కట్కప్లె ఉడ్ పరిశ్రమ దేశంలో శరవేగంగా ఎదుగుతున్నది. ఆ కంపెనీలకు కావాల్సిన చెక్క మన దగ్గర అందుబాటులో లేదు. మన వేప ఉద్యాన సాగుకు అనువైంది కాదు. కొమ్మలు ఎక్కువగా ఉండటం వల్ల దిగుబడి తగ్గుతుంది. కొమ్మలు కత్తిరించడం రైతుకు సమస్యే. వీటిని అధిగమించేందుకు మలబార్ వేపతో ఎన్‌టీపీఎంబీ01 అనే మ్యూటెంట్ (ఉత్పరివర్తనం చెందించిన) వేపను అభివృద్ధి చేశాను. ఈ వేపచెట్టు నిలువుగా పెరుగుతుంది.

కొమ్మలు వాటంతట అవే రాలిపోతాయి. తెలంగాణలో ఉద్యాన పంటలు పెరుగుతున్నాయి. టమాట, వంగ లాంటి మొక్కల పెంపకానికి ఊతంగా నిలువు కర్రల సాయం అవసరం అవుతుంది. ఇప్పటి వరకు మన రైతులకు ఈ సమస్యపై అవగాహన లేదు. భవిష్యత్ అవసరాల కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన పద్దెనిమిది వెదురు జాతులను నర్సాపూర్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో పెంచుతున్నాం. ఉద్యాన పంటల సాగులో వీటి ఉపయోగాన్ని అధ్యయనం చేస్తున్నాం. భవిష్యత్ అవసరాల కోసం టిష్యూ కల్చర్ ద్వారా కొత్తరకం వెదురు మొక్కను అభివృద్ధి చేసే పనిలో ఉన్నాను. తెలంగాణ రైతులకు ఇది మా కానుక.

# తమిళనాట.. తెలుగు రుచుల ఊట



పక్కపక్కనే ఉన్నా రెండు బావుల్లోని నీళ్ల రుచులు వేరువేరుగా ఉంటాయి. ఇరుగుపొరుగే అయినా తమిళ వంటలకు, తెలుగు విందులకు ఎంతో తేడా. ద్రవిడ దేశపు సాంబారు ఇడ్లీ ఎంత నచ్చినా, రోజూ తింటే బోరే. మామిడికాయ తొక్కు మీదా, కారం పొడులూ, కజ్జికాయల మీదా ప్రాణం లాగుతూనే ఉంటుంది. చెన్నైలో స్థిరపడిన తెలుగువాళ్లకు ఆ లోటు ఏమాత్రం తెలియకుండా చేస్తున్నారు 'ఆంధ్రా డెలికసీ' యజమాని సౌజన్య ధనాల. తమ తెలుగు రుచుల విశేషాల్ని 'జిందగీ'తో పంచుకున్నారిలా..

తరాల క్రితమే చెన్నైలో స్థిరపడిన తెలుగువాళ్లం మేం. మా వారిది కర్నూలు జిల్లా బనగానపల్లె. ఆయన ఇక్కడే ఐటీలో ఉద్యోగం చేస్తారు. నిల్వ పచ్చళ్లు పెట్టడంలో, పొడులు చేయడంలో చేయితిరిగిన మనిషి మా అత్తగారు. మా కోసం రకరకాల పదార్థాలు చేసి పంపేవారు. వాటిని మేం తినడమే కాదు, చుట్టుపక్కల వాళ్లకూ పంచేవాళ్లం. వాళ్లంతా ఆ రుచిని ఎంతగానో మెచ్చుకునేవారు. నేను న్యూజిలాండ్‌లో ఎంబీఏ చేశాను. గతంలో ఓ ఐటీ కంపెనీ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేదాన్ని. పని ఒత్తిళ్లు, వృత్తి పట్ల అసంతృప్తి కారణంగా.. రెండేళ్లకన్నా ఎక్కువ కాలం కొనసాగలేక పోయాను. ఉద్యోగానికి స్వస్తి పలికాను. తొలినుంచీ నాకు సొంతంగా వ్యాపారం చేయాలని ఉండేది. దాంతో మా అత్తగారు పంపే పచ్చళ్లు, పొడులు, పిండివంటలను ఓ బ్రాండ్ కింద అమ్మితే ఎలా ఉంటుంది? అనిపించింది. ఆయనకూ ఐడియా నచ్చడంతో అత్తగారితో మాట్లాడాం. ఆవిడ కూడా ఉత్సాహం చూపారు. అలా, 2017లో 'ఆంధ్రా డెలికసీ' ప్రారంభించాం.

**మంచి ఆదరణ**

నలుగురికీ తెలిసేలా ఒక బ్రాండ్ సృష్టించడంలోనే ఏ వ్యాపార విజయమైనా దాగి ఉంటుంది. అందుకే తొలి రోజుల్లో ఎక్కడ ఎగ్జిబిషన్ జరిగినా మా ఉత్పత్తులతో వెళ్లేవాళ్లం. సింగపూర్ వరకూ తీసుకెళ్లాం. ఇంకా కావాలంటే ఆన్‌లైన్ ఆర్డర్ పెట్టుకోవచ్చని చెప్పేవాళ్లం. అయితే, దీనివల్ల పదార్థాలు బాగా వృథా అయ్యేవి. ఒకసారి పాతిక కేజీల దాకా పచ్చడి మిగిలిపోయింది. అనాథా శ్రమంలో ఇచ్చాం. తర్వాత నుంచి ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లాంటి వేదికల ద్వారా ప్రకటనలు చేశాం. ఆ ప్రచారం విజయవంతమైంది. మా సంస్థ ద్వారా ఆవకాయ, గోంగూర, ఉసిరికాయ పచ్చళ్లతో పాటు.. పప్పుల పొడి, నల్లకారం, గవ్వలు, పూత రేకులు, హల్వా లాంటివి అమ్ముతున్నాం. వెబ్‌సైట్‌లో వీటి వివరాలు ఉన్నాయి. అవి కాకుండా వంకాయ, చిక్కుడుకాయ, క్యాలీ ఫ్లవర్ తదితర కూరగాయలతోనూ నిల్వ పచ్చళ్లు పెడతాం. నెలకు కనీసం పాతిక కిలోల పచ్చళ్లు విక్రయిస్తాం. అన్నీ కలిపి లక్షా లక్షన్నర దాకా అమ్మకాలు జరుగుతాయి. కృష్ణాష్టమి, దసరా, దీపావళిలాంటి పండుగలప్పుడు విభిన్న రకాల స్వీట్ల కలగలుపుగా మేం అందించే స్పెషల్ ప్యాక్‌లు చాలా మందికి నచ్చు తున్నాయి. అమెరికా, దుబాయ్, సౌతాఫ్రికాలాంటి చాలా దేశాలకూ పార్సిల్స్ పంపుతున్నాం. ప్రస్తుతం ఉన్న మా స్టోర్‌ను మరింత పెద్దది చేసి సాయంత్రాలు పునుగులు, మిర్చీబజ్జి, ఉగ్గాణి లాంటివి అమ్మాలనుకుంటున్నాం. చెన్నపట్నం ప్రజలకు మరిన్ని తెలుగు రుచులను అందించడమే లక్ష్యంగా ముందుకెళు తున్నాం. 'మీ మిఠాయిలు రుచి చేసిన ప్రతిసారీ సొంతూరికి వెళ్లిన భావన కలుగుతుంది' అంటుంటారు చాలామంది.




# గోరింటాకు చేతులు కాళ్లకే కాదు.. ఇప్పుడు వీపు దాకా పాకేసింది!



గోరింటాకు అరచేతిలో పండితే అందం. కాళ్లను చుడితే ముస్తాబు. అదే రవికగా మారిపోతే.. వీపునూ చేతులనూ అలంకరిస్తే.. కొత్త ట్రెండ్! అవును.. ఇప్పుడు బ్లౌజ్ మెహందీ సరికొత్త ట్రెండ్. అతిసాదా అలంకరణ నుంచి నిండైన నగల డిజైన్ల దాకా ఎన్నో రకాలు.. మెహందీ రవికల్లో కనువిందు చేస్తున్నాయి. మెహందీ ఫంక్షన్ ఎంత ఘనంగా చేసుకున్నా, గోరింటాకులో ఎన్ని కొత్త డిజైన్లు ప్రయత్నించినా.. అలంకరించేది కాళ్లకూ, చేతులకేగా! ఎక్కడ చూసినా, ఎన్నేళ్లు గడిచినా ఇంతేనా.. అనుకునే ఆధునిక పెళ్లి కూతుళ్ల కోసం మెహందీ డిజైనర్లు సరికొత్త కాన్సెప్ట్‌తో ముందుకొచ్చారు. చూడగానే వావ్ అనిపించేలా, కళ్లతో చూస్తే కాదనలేని విధంగా కొంగొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. బ్లౌజ్ మెహందీ డిజైన్లు నేటి తరం పెళ్లి కూతుళ్ల బ్యాక్‌లెస్ జాకెట్లకు కొత్త అలంకారం.

**ఎన్నో ఎన్నెన్నో..** మెహందీలో ఉన్నట్టుగానే ఇందులోనూ ఎన్నో రకాల డిజైన్లు అందాలొలికిస్తున్నాయి. విభిన్న మోటిఫ్ ప్రింట్లతో అచ్చం నిజం బ్లౌజ్‌లా కనిపించేలా, వెనక బటన్లు, అంచువెంట వేసే పూసలు, లేసులను కూడా అచ్చు గుద్దినట్టు ఇందులో చూపిస్తున్నారు కళాకారులు. వీపు మీద టాజిల్స్ వేలాడినట్టు, చిన్ని గంటలు వరుస కట్టినట్టూ కనికట్టు చేస్తున్నారు. ఆడపిల్లలకు వర్క్ బ్లౌజుల మీద ఉండే ఇష్టాన్ని గమనించి గ్రాండ్‌గా ఎంబ్రాయిడరీ వర్క్ చేసినట్టు అనిపించే డిజైన్లనూ ఆవిష్కరిస్తున్నారు. పూలు, లతలు, మామిడి పిందెలు, ఏనుగులలాంటి మోటిఫ్‌లను ఇందుకోసం వాడుతున్నారు. వీపు మీద, చేతుల మీద నాజూగ్గా వచ్చే జాలీ వర్క్ ముద్దు గుమ్మలను మరింత ముగ్ధ మనోహరంగా చూపిస్తుంది. మరింత సునిశితంగా ఉండే నగల డిజైన్లను చేయి తిరిగిన కళాకారులు ఈ బ్లౌజ్ మెహందీలో మెరిపిస్తున్నారు. చీరతో పాటు ఫ్యాషనబుల్ డ్రెస్సుల మీదకీ నప్పేలా మాడ్రన్ జువెలరీ డిజైన్లతోనూ మెహందీని పెడుతున్నారు. బ్యాక్ ఓపెన్ బ్లౌజ్‌ల కోసం పల్లకీ తరహా డిజైన్లు అదుర్స్ అనిపిస్తున్నాయి. చేతులకు ఒకరకంగా, బాడీకి మరోరకంగా వచ్చే డిజైన్లు ఎక్కువ మందికి ఫేవరెట్‌గా ఉంటున్నాయి. బ్యాక్‌లెస్ కాకుండా స్లీవ్‌లెస్ మాత్రమే వేసుకునే వాళ్లకోసం అరచేతిలో మొగ్గ తొడిగిన గోరింటకు మ్యాచింగ్‌గా చేతులకూ డిజైన్‌ను వేస్తున్నారు. ఇవైతే పెళ్లికూతుళ్లకే కాదు, విడిగా ఈవెంట్లకు వేసుకునేందుకూ నప్పుతాయి. ఇక నుంచీ అరచేత మాత్రమే కాదు అందాల వీపుమీదా గోరింట మొగ్గ తొడుగుతుందన్న మాట!

# మహేంద్రజాలం చూడాల్సిందే!







తూర్పుకనుమల్లో అందాలు నెలకొన్న కొండలు మహేంద్రగిరులు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పర్వత శ్రేణులపై ప్రకృతి ఎప్పుడూ పరవశిస్తూ ఉంటుంది. చెట్లు, చేమలతో పచ్చలపేరులా మెరిసిపోతున్న మహేంద్రగిరుల్లో.. అక్కడక్కడా వజ్రాలు పొదిగినట్టుగా అపురూప ఆలయాలు దర్శనమిస్తాయి. ముత్యాలు కుమ్మరించినట్టుగా నీటి చెలమలు కనిపిస్తాయి. ఈ గిరులకు ఏడాదంతా పర్యాటకుల తాకిడి ఉంటుంది. ముఖ్యంగా శివరాత్రి సందర్భంగా వేల మంది భక్తులు తరలి వస్తారు. ఇక్కడి పాండవుల ఆలయాలను సందర్శిస్తారు. ఆ చుట్టుపక్కల వాళ్లు ప్రతిష్ఠించిన మహాలింగాలను భక్తితో పూజిస్తారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం సింగుపురం సమీపంలో ఉంటాయి మహేంద్రగిరులు. సముద్ర మట్టానికి ఐదువేల అడుగుల ఎత్తులో ఉన్నాయివి. అరుదైన వృక్షసంపద వీటి సొంతం. వనవాసకాలంలో పాండవులు మహేంద్రగిరులపై కొంతకాలం గడిపారని చెబుతారు. ఆ సమయంలో ఒక్కొక్కరూ ఒక్కో మందిరాన్ని నిర్మించుకొన్నారని స్థానిక కథనం.

అందుకు తగ్గట్టుగా ఇప్పుడు అక్కడ పాండవుల పేరిట ఆలయాలు కనిపిస్తాయి. ధర్మరాజు, కుంతీదేవి ఆలయాలు ఒక ప్రదేశంలో ఉండగా.. భీమసేనుడి ఆలయం ఎత్తయిన శిఖరంపై కనిపిస్తుంది. అక్కడికి కొంత దూరంలో అర్జునుడు, నకుల, సహదేవుల ఆలయాలు ఉన్నాయి. వీటి పరిసర ప్రాంతాల్లో పాండవులు ప్రతిష్టించారని భావించే లింగాలు కనిపిస్తాయి. కాలప్రవాహంలో ఆలయాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా.. వాటి ప్రాశస్త్యం మాత్రం తగ్గలేదు. ఏటా శివరాత్రి సందర్భంగా మహేంద్రగిరులపై జరిగే ఉత్సవాలకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. పిల్లలు, పెద్దలు వ్యయప్రయాసలకోర్చి సాహసయాత్రకు పూనుకుంటారు. శివరాత్రికి ఒకరోజు ముందుగానే భక్తులంతా గిరులపైకి చేరుకుంటారు. పూజాసామగ్రి, మంచినీళ్లు, ఆహారం, పళ్లు అన్నీ వెంట తెచ్చుకుంటారు. శివరాత్రి ఉపవాస దీక్షలో ఉంటారు. భజనలతో రాత్రంతా జాగరణ చేస్తారు. మర్నాడు భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణం అవుతారు.

శివరాత్రి సందర్భంగా జనంతో కిటకిటలాడే మహేంద్రగిరులు ఆ తర్వాత బోసిపోతాయి. సాహస యాత్రికులు మాత్రం తరచూ ఇక్కడికి వస్తుంటారు.

ఇలా వెళ్లాలి.. మహేంద్రగిరుల యాత్రకు సాహసంతో పాటు ఓపిక కూడా ఉండాలి. ముందుగా శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి బస్సుల్లో మందస మండలం సింగుపురం చేరుకోవాలి. మహేంద్రగిరులకు సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ పలాస. ఇక్కడి నుంచి మందస మీదుగా సింగుపురం చేరుకోవచ్చు. బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. సింగుపురం నుంచి వాహనాల్లో.. చొంపాపురం మీదుగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన రాజబసకు వెళ్లాలి. ఆపై కాలినడక మొదలవుతుంది. దాదాపు 28 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది.

# మమ్మీలను చూసొచ్చాం..!










**గీజా పిరమిడ్‌లో...**

గ్రేట్ పిరమిడ్‌కు రెండు ద్వారాలు ఉన్నాయి. ఒకటి ఫారో చక్రవర్తి కోసమైతే, రెండోది ప్రజలకోసమట. సందర్శకులను ఒక ద్వారం నుంచే అనుమతిస్తున్నారు. లోపలకు వెళ్లి కింగ్స్ ఛాంబర్‌ను చూశాం. దీంట్లోనే కూఫూ తనకోసం నిర్మించుకున్న సమాధి ఉంది. ప్రస్తుతం నాలుగు పిరమిడ్లను మాత్రమే సందర్శకులకు అనుమతిస్తున్నారు. ఒక్కో పిరమిడ్ వెనక మూడు చిన్న పిరమిడ్లను రాణులకోసం నిర్మించారు. అవి చూశాక దగ్గర్లోనే ఉన్న వ్యాలీ ఆఫ్ నైలులోని స్ఫింక్స్ చూడ్డానికి వెళ్లాం. మనిషి మొహం, సింహం శరీరం గల పౌరాణిక రూపమే స్ఫింక్స్. ఒక సున్నపురాతి కొండనే ఆ విధంగా మలిచారట. ఆ ముఖం ఫారో కాఫ్రాది అని చెబుతారు. దీన్ని క్రీ.పూ. 2613- 2494లో నిర్మించినట్లు తెలుస్తోంది.

తరవాత మజిలీ ఈజిప్టు మ్యూజియం... అందులో 1,20,000కి పైగా పురాతన వస్తువులూ 12 మమ్మీలూ ఉన్నాయి. దీన్ని 1902లో నిర్మించారట. 2011లో ఈజిప్టులో జరిగిన తిరుగుబాటులో కొన్ని విగ్రహాలనూ రెండు మమ్మీలనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారట. ఇందులో ప్రధానంగా చూడదగ్గది టూటన్‌కామెన్ మమ్మీని ఉంచిన బంగారు శవపేటిక. ఇది ప్రపంచంలోకెల్లా ఖరీదైన శవపేటికగా పేరొందింది. అప్పట్లో ఆయన ముఖానికి 14 కిలోల బంగారు తొడుగు తొడిగారు. ఆయనకోసం చేయించిన బంగారు మంచం, కుర్చీ, నగలు కూడా అక్కడ ఉన్నాయి. తరవాతిరోజు కైరోలోని ఒక మార్కెట్‌ని సందర్శించాం. ఈజిప్షియన్లలో అత్యధికులు ముస్లింలే. ముఖ్య భాష అరబ్బీ. కైరోలో చాలావరకూ ఇండ్లకు ప్లాస్టరింగ్ చేయడం తక్కువ. అక్కడ వర్షపాతం చాలా తక్కువ. దాంతో ముందు మాత్రమే చేస్తారట.

**ఆస్వాన్ నగరంలో...**

మర్నాడు ఆస్వాన్ సిటీకి బయలుదేరాం. ఆస్వాన్‌లో ఆనకట్టను 'హై డ్యామ్' అని పిలుస్తారు. ఈ నిర్మాణంవల్ల లోతట్టు ప్రాంతం ముంపునకు గురైంది. అందులో ఆస్వాన్ ఆలయం, ఫిలై ఆలయం, అబుసింబల్ ముఖ్యమైనవి. అయితే యునెస్కో సహకారంతో వాటిని ఎత్తైన ప్రదేశాలకు తరలించారు. ఈ చుట్టుపక్కల న్యూబియన్ అనే పురాతన తెగ ఉన్న గ్రామం కూడా ముంపునకు గురయింది. వారి భాష న్యూబియన్. దీనికి లిపి లేదు. వారికి తప్ప ఎంత ప్రయత్నించినా వేరే ఎవరూ ఆ భాష నేర్చుకోలేరని తెలిపాడు గైడ్. వాళ్లను అత్యంత ప్రాచీన ఈజిప్షియన్లుగా చెప్పవచ్చు.

మరబోటులో వెళ్లి ఫిలై ఆలయాన్ని సందర్శించాం. ఇందులోని దేవత పేరు ఐసిస్. ప్రాచీన ఈజిప్షియన్లు నిర్మించిన చిట్టచివరి ఆలయం ఇదేనట. దీన్ని వాళ్లు దేవతలుగా ఆరాధించే ఓజిరిస్, ఐసిస్‌లు పుట్టిన ప్రదేశంగా విశ్వసిస్తారు. కాలక్రమంలో క్రిస్టియన్లు దీన్ని చర్చిగానూ ఉపయోగించారు. పురాతన ఈజిప్షియన్లు తాము ఆరాధించే దేవతలని మానవరూపంలో కాకుండా జంతురూపంలోనే ఎక్కువగా పూజించేవారు. అందుకే ఆలయగోడలమీద ఎద్దు, గద్ద, నక్క, మొసలి రూపంలో మలిచిన విగ్రహాలన్నీ ఆ కోవకే చెందుతాయి. నైలునదిలో ఆస్వాన్ నుంచి లక్సర్‌కు పడవలో బయలుదేరాం. దారిలో పిరమిడ్లకోసం తవ్విన గ్రానైట్ క్వారీనీ, అసంపూర్తిగా వదిలేసిన ఓబిలిస్క్‌నీ చూశాం. ప్రాచీన ఈజిప్షియన్లు ఒంటిరాయి స్తంభాలను నిర్మించి వాటిమీద రాజుల గురించి చెక్కించేవారు. నైలునది దక్షిణం నుంచి ఉత్తరానికి 6,853 కిలోమీటర్లు ప్రవహించి, రెండు పాయలుగా చీలి మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. ఈజిప్టు మొత్తం నైలునది మీదే ఆధారపడి ఉందంటే అతిశయోక్తి కాదు. అందుకే అక్కడివాళ్లంతా 'నో నైల్, నో ఈజిప్ట్' అంటుంటారు. ఎక్కడో చిన్న చిన్న పాయలుగా మొదలైన నైలు నది ఈజిప్టుకే వరప్రదాయని అని చెప్పవచ్చు. పడవలో సాయంత్రం ఆరు గంటలకు కొమాంబు ఆలయానికి చేరుకున్నాం. ఈ ఆలయాన్ని మొసళ్ల దేవతకోసం నిర్మించారు. 22 మొసళ్లనూ గుడ్లనూ మమ్మీలుగా చేసి ప్రదర్శిస్తున్నారు.

మర్నాడు ఉదయం నాలుగు గంటలకు అబుసింబల్ దర్శించడానికి బయలుదేరాం. 300 కి.మీ. దూరం సహారా ఎడారిలోనే ప్రయాణం. దారిలో ఒక్క ఊరు కూడా కనబడదు. గొప్ప ఫారో చక్రవర్తిగా పేరొందిన రామ్‌సీస్ ఖిఖి నిర్మించినదే అబుసింబల్ ఆలయం. ఆనకట్ట కారణంగా ముంపునకు గురవడంతో దీన్ని ఇక్కడకు తరలించారు. ఇది రెండు ఆలయాల సముదాయం. ఒకటి రామ్‌సీస్ కోసమైతే, రెండోది ఆయన భార్య నెఫెర్‌టారికోసం. ఇది ఒకటే రాతితో నిర్మించిన భారీ విగ్రహాల సముదాయం. ఆ అద్భుత శిల్పకళా సంపదను దర్శించి, తిరిగి ఓడ దగ్గరకు వచ్చేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. అక్కడినుంచి ఓడలోనే ఎడ్ఫుకి చేరుకున్నాం. ఉదయం ఏడు గంటలకు గుర్రపుబగ్గీలో ఎడ్ఫు ఆలయానికి చేరుకున్నాం. గద్ద ముఖం, మనిషి శరీరంతో గల హోరస్ దేవతకు చెందిన ఆలయం ఇది.ఇక్కడి ఆలయాలన్నీ ముందు భాగం వెడల్పుగానూ ఎత్తుగానూ లోపలికి వెళ్లే కొద్దీ వెడల్పూ ఎత్తూ తగ్గుతూ ఉంటాయి. ఇక్కడ ఉన్న భారీ కుడ్యాలనూ స్తంభాలను చూస్తే ఔరా అనిపించక మానదు. గోడలమీద అప్పట్లోనే ఆపరేషన్లకు అవసరమైన వస్తు సామగ్రినీ కాన్పు సమయంలో తల్లిని కూర్చోబెట్టిన దృశ్యాలనూ చెక్కడం చూసి ఆశ్చర్యపోయాం. చివరి రోజు లక్సర్ పట్టణాన్ని సందర్శించాం. ఇది ఫారోల రాజధాని నగరం. ఇక్కడ ముఖ్యంగా చూడదగ్గవి నాలుగు. మార్చురీ టెంపుల్ ఆఫ్ హాట్సెప్సుట్, కార్నక్ టెంపుల్, వ్యాలీ ఆఫ్ కింగ్స్, లక్సర్ ఆలయాలు. హాట్సెప్సుట్ టెంపుల్ ఓ సూర్యదేవాలయం. ఈ ప్రదేశంలో దొరికిన శిథిలాలతో దీన్ని పునర్నిర్మించారు. ఇందులోని వర్ణచిత్రాలను చూసి ఆశ్చర్యపోవాల్సిందే. వేల సంవత్సరాలు గడిచినా ఎండకు ఎండినా రంగులు మాత్రం వెలిసిపోలేదు. అక్కడి నుంచి వ్యాలీ ఆఫ్ కింగ్స్‌కు బయలుదేరాం.

**సమాధుల్లో మమ్మీలతో..!**

ఈజిప్టుని పాలించిన ఫారో చక్రవర్తులు మరణానంతర జీవితం ఉంటుందని విశ్వసించేవారు. అందుకోసమే భారీ యెత్తున పిరమిడ్లు నిర్మించుకున్నారు. క్రీ.పూ. 1069 నాటికి క్రమంగా వాటిమీద ఇష్టం తగ్గి, సమాధులు నిర్మించుకోవడం ప్రారంభించారు. పిరమిడ్‌లలో ఉంచిన మమ్మీలనూ సంపదలనూ దుండగులు కొల్లగొడుతుండటం కూడా ఒక కారణం కావచ్చు. దాంతో తమ సమాధులను భద్రంగా ఉండేందుకు ఈ వ్యాలీ ఆఫ్ కింగ్స్‌ను ఎన్నుకున్నారు. ఈ భూభాగమే సహజసిద్ధంగా ఏర్పడిన పిరమిడ్ ఆకారంలో ఉంటుంది. దాంతో తరవాతి కాలానికి చెందిన ఫారోలు తాము జీవించి ఉండగానే తమ అభిరుచికి అనుగుణంగా తమ సమాధులని ఇక్కడ తీర్చిదిద్దుకున్నారు. అలాంటివాటిల్లో టూటన్‌కామెన్ సమాధి ఒకటి. కైరో మ్యూజియంలోని మమ్మీలన్నీ ఇక్కడ బయటపడినవే. ప్రస్తుతం ఈ వ్యాలీలో కేవలం మూడింటిలోకే ప్రవేశం ఉంది. భూమిలోపలి పొరల్లో గుహలుగా తొలిచి మరీ వీటిని నిర్మించారు. అద్భుత కుడ్యచిత్రాలతో కూడిన టూటన్‌కామెన్ సమాధిలో అతని మమ్మీని సందర్శించాం. ఆ సమాధిలో అనేక వస్తువులతోబాటు బంగారు తొడుగూ టూటన్‌కామెన్ మమ్మీ బయటపడ్డాయట. మమ్మీనీ, చెక్క శవపేటికనీ ఇక్కడ సందర్శనకు ఉంచి మిగిలిన సంపదను కైరో మ్యూజియంకు తరలించారు. చివరగా లక్సర్ ఆలయానికి వెళ్లాం. ఇది 66 ఎకరాల్లో నిర్మించిన 132 భారీ స్తంభాల సముదాయం. ఇక్కడ రహదారికి ఇరువైపులా మానవశరీరం పొట్టేలు ముఖం కలిగిన విగ్రహాలున్నాయి. పిరమిడ్లతోబాటు ఈజిప్షియన్ల కళాసంపదనీ చూశామన్న తృప్తితో వెనుదిరిగాం.

**వానాకాలం విహారం మనసుకు ఆహ్లాదాన్నిస్తుంది. ప్రయాణంలో కొన్ని చికాకులు ఉన్నా.. చల్లటి వాతావరణం, పచ్చదనంతో పులకించే పుడమి, జలకళ సంతరించుకున్న నదీనదాలు ఇవన్నీ మాన్‌సూన్ పర్యాటకానికి కిక్ ఇచ్చేవే. వానకాలం ప్రయాణాల్లో ఈ జాగ్రత్తలు పాటిస్తే సాధారణ సమస్యల నుంచి సులభంగా బయటపడొచ్చు.**



# వానల్లో వెళ్తున్నారా..

వర్షాకాలం దోమల బెడద నుంచి తప్పించుకోవాలంటే రెప్పలెంట్ దగ్గరుంచుకోవాలి. రెప్పలెంట్ బాండ్స్ కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి.

ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగడం మంచిది కాదు. మినరల్ వాటర్ తాగండి. అవకాశం ఉంటే నీటిని కాచి వడగట్టండి.

రెయిన్ కోట్, గొడుగు వెంట తీసుకెళ్లండి.

వర్షాకాలం విహారంలో ఎక్కువగా ఆకర్షించేవి చిరుతిళ్లు. చిరుజల్లుల వేళ.. వేడివేడిగా ఏది కనిపించినా తినకుండా ఉండలేం. శుభ్రత పాటించని ఫుడ్‌కోర్టుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చిరుతిళ్లు తింటే.. ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. వర్షపాతం వివరాలు, పర్యటించదలచిన ప్రాంతంలో పరిస్థితులు వీటి గురించి అంతర్జాలంలో సమాచారం సేకరించి అందుకు తగ్గట్టుగా ప్రయాణ ప్రణాళిక మార్చుకోవాలి.



# ఐస్‌కేఫ్.. కెవ్వుకేక!

ప్రకృతిలో చాలా అందాలున్నాయి. అద్భుతాలున్నాయి. కొన్నింటిని మనిషి సృష్టిస్తే కొన్నింటిని మాత్రం ప్రకృతి ఇచ్చింది. అలా ప్రకృతి ఇచ్చినవి ఎప్పటికీ అద్భుతంగానే ఉంటాయి. భారతదేశంలో ఉన్న ఏకైక ఐస్‌కేఫ్ ఇది. అయితే ప్రకృతిసిద్ధంగా లడఖ్‌లో ఉద్భవించింది. సముద్రమట్టానికి 14వేల అడుగుల ఎత్తులో ఉన్నది. మనాలి -లే హైవే ఈ కేఫ్ కనిపిస్తుంది. దీన్ని మానవులు సృష్టించలేదు. సహజ ప్రకృతి ప్రక్రియ ద్వారా వెలువడింది. ఈ ఐస్‌కేఫ్ బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ అధికారులు వెలుగులోకి తీసుకొచ్చారు. ఇది లే నుంచి 75 కిలోమీటర్ల దూరం ఉన్నది. లడఖ్‌కు వచ్చే సందర్శకులను ఆకర్షించేందుకు ఈ ఐస్‌కేఫ్‌ను ప్రారంభించారు. గుహ మాదిరిగా ఉన్న దీనిలో హాట్‌డ్రింక్స్, నూడుల్స్‌వంటి ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు.



# కొత్త ప్రదేశానికి వెళ్తే ఎక్కడ తినాలో?

ఓ పట్టాన అర్థం కాదు. మంచి హోటల్ ఎక్కడుందో తెలియదు. ఇలాంటి సమయాల్లో చాలామంది ఆన్‌లైన్ రివ్యూలపై ఆధారపడుతుంటారు. ఈ రేటింగ్స్ ఎక్కువగా పర్యాటకులే ఇస్తుంటారు. సదరు రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు వాళ్లకు ఎ దురైన అనుభవాన్ని బట్టి రివ్యూలు రాసేస్తుంటారు. అందుకే వాటిని గుడ్డిగా నమ్మెయొద్దు. ఒక ప్రాంతంలో ఉన్న రెస్టారెంట్లు, ఆహార విషయాలు స్థానికులకు తెలిసినంతగా.. చుట్టపు చూపుగా వచ్చిన పర్యాటకులకు అంతగా తెలియకపోవచ్చు. అందుకే ఆన్‌లైన్ రివ్యూలు కాకుండా.. స్థానికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఎక్కడ తినాలో నిర్ణయించుకోవాలి. స్థానిక రుచుల గురించి ఆరా తీయాలి.. ఆరగించాలి. మరో విషయం ప్రయాణాల్లో చాలామంది స్ట్రీట్ ఫుడ్ జోలికి వెళ్లరు. అన్ని సమయాల్లోనూ ఇది సరికాదు. బడ్జెట్‌లో వేడివేడి రుచులు కావాలన్నా.. ఆ ప్రాంతానికే ప్రత్యేకమైన రుచులు ఆస్వాదించాలన్నా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ రుచికరమైన ఆహారం దొరుకుతుందో లేదో తెలుసుకోవడం కూడా సులభమే! సాధారణంగా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్స్‌కు స్థానికులే ఎక్కువగా వెళ్తుంటారు. ఎక్కడ రద్దీగా ఉంటుందో.. అక్కడికి వెళ్లి ఓ పట్టు పట్టేయడమే. రుచి బాగుంటేనే కదా రద్దీ ఎక్కువగా ఉండేది!

## మనిషి తప్పిపోయాడు



మనిషి తప్పిపోయాడు
వర్షం వెతుకుతూ వుంది
చిరునామావుంది శరీరం లేదు!
వర్షం ఉడీసెత్తిందంటూ
వరుణుణ్ణి నిందిస్తూ
ప్రజాక్షేమం మరిచిన
మనిషి తప్పిపోయాడు!
ఇన్నాళ్ళూ కురిసిన
వర్షధారనుజి
అరచేతుల్కెనా
అడ్డేసి అడ్డుకోని మనిసి
సముద్రానికి దత్తం చేశాడు!
వానకురువబోతుంది
ఒడిసి పట్టుకోమంటూ
తప్పిపోయిన మనిషికై
వర్షం దేవులాడుతుంది!
మనిషి మాయమయ్యాడు
ఓటు వెతుకుతూ వుంది
మార్పు రావాలంటూ
పరవంజానెక్కి మేధావి విమర్శలు!
మార్పుకు మూలవిరాట్కైన
పోలింగు బూతుకు
అతడు ముఖంచాటు!
చేతికందే దూరంలో
పోలింగు కేంద్రం పిలుస్తుంది
బద్దకం మేధావిని వదలదు
శీతలగది కదలనివ్వదు!
కోకిల కనపడటం లేదు
ఆరు ఋతువులు సమానమై
గున్నమామిడి గుబుర్లో వొదిగి
సంగీతం ఆలపిస్తూ
స్వర్గం సృష్టించిన కోకిల
హఠాత్తుగా అంతర్ధానమైంది
గాలింపుకు పోబిడీలేదు
మనసున పన్నీరద్దిన
సంగీత కచేరీలేదు!
మనిషి వేటగాడ్కై
ఎక్కుపెట్టిన బాణం
మట్టుపెట్టిందని ప్రచారం!
మనిషిజి
మనీషిగాజి
మారటానికిజి
మానవత్వమేజి
దీర్ఘతపస్సు!
అడిగోపుల వెంకటరత్నమ్,

## బతుకంటే



కళ్ళలో శిశిరాలు రాలుతున్నప్పుడు
ఒక జీవిత నిర్వేదం ఒక జీవిత క్రమం
పాఠాలు చెబుతుంటాయి.
కన్నీళ్ళను బిగపట్టి వసంతాల చిగుళ్ళ కోసం
మనసుతో మాటాడి
కాస్తంత ఊరట పొందటం ఒక అవసరం.
నిశ్శబ్ద ఏకాంతాన్ని నాలో నింపుకొని
కళ్ళ నిండా చెట్ల గాలులు పూసుకొని
ధ్యాన సాగరంలో మునిగిపోతాను.
చుట్టూ ప్రపంచం నుంచీ
వేడి గాలులూ తగులుతుంటాయి.
ఏదీ పూర్తిగా చొరబడనివ్వక
లోలోపల రక్షణ కవచాల్ని
నిర్మించుకుంటాను
బతుకంటే, బతకడమంటే
నిరంతర మూల్యాంకనం లోంచి సరిచూసుకొని
నిత్య నూతనంగా జీవించడమే.

# పాఠకుల ఆర్తిని తీర్చే 'రాతి గుండెలో నీళ్లు'

%కథ అంటే ఏమిటి అనేదానికి సార్వత్రిక నిర్వచనాలున్నా, అది ఎలా పుడుతుందనే దానికి స్పష్టమైన కారణాలు చెప్పలేం. రచయిత తను విన్నవి, కన్నవి, చదివినవి, తన అనుభవంలోకొచ్చిన అనేక సంఘటనల్లో మనసుకు నచ్చిన వాటిని ఎంచుకుని వాటికి సంభాషణలు పేర్చి సృజనాత్మకతతో రూపుకడతాడు. అతను ఎదుగుతున్న కొద్దీ అతని చూపు విశాలమవుతుంది. దృక్పథం మారుతుంది. శ్కెలి, శిల్పం కొత్త సొబగులు అద్దుకుంటాయి. రాయగా.. రాయగా.. ప్రతి రచయితకీ తన సొంత గొంతు ఏర్పడుతుంది.

30 ఏళ్లవయసు.. 50 కథల అనుభవం ఉన్న దొండపాటి కృష్ణ మూసలో కొట్టుకుపోకుండా తనద్కైన ప్రత్యేకత చూపటానికి గుంజాటన పడుతున్నారు. సమకాలీన పత్రికలన్నింటిలోనూ ఆయన కథలు వస్తూంటాయి. కొన్ని కథలకు దక్కిన బహుమతులు ఈ యువరచయిత ప్రతిభకు తార్కాణాలు. ఇటీవల ఆయన వెలువరించిన 'రాతి గుండెలో నీళ్లు' కథా సంకలనం గురించి ఇప్పుడు మనం మాట్లాడుకుందాం. ఇందులో 16 కథలున్నాయి. ఇతివృత్తం పరంగా వాటిల్లో వైవిధ్యం కనిపిస్తుంది. రచయిత 'చూపు' మనకు అర్థమవుతుంది.

'కారు ఆగింది. అది సూర్యం హోదాను మోసుకొచ్చింది' ఇదీ 'వెలుగు సూర్యుడు' కథకు ప్రారంభ వాక్యం. ఓ అధికారి కారులో దిగగానే అందరు విస్తుపోయి చూడటం సాధారణమే. కానీ ఈ అధికారి అందరిలాంటివాడు కాడు. ఒకప్పుడు చెత్తకుప్పలో విసిరివేయబడ్డ పసిబిడ్డ. అతన్ని యాదయ్య అనే బిచ్చగాడు చేరదీస్తాడు. కొన్నాళ్ల తర్వాత ఆ పిల్లాడు అడితీలో పనికి చేరతాడు. చదువుకోవాలన్న అతని ఆకాంక్షకు నీరుపోసి పెంచి పోషిస్తాడు ఆ అడితీ యజమాని. దాంతో అతను బాగా చదువుకుని సోషల్ వెల్ఫేర్ ఆఫీసరుగా ఎదుగుతాడు. అంతే కాదు, తనను ఇంత వాడిని చేసినందుకు అతను అదే ఊరిలో అనాథ వసతి గృహం నిర్మాణానికి సిద్ధమవుతూ కృతజ్ఞత చూపటానికి సిద్ధమవుతాడు. ఫ్లాష్‌బ్యాక్ పద్ధతిలో సాగిన ఈ కథలో మెరుపులాంటి వాక్యాలు కనిపిస్తాయి. "జ్ఞానానికి, దీపానికి ప్రత్యేక గుర్తింపు అవసరం లేదు. అవి పాతాళంలో ఉన్నా దశదిశలకూ తమ కాంతులను ప్రసరింపచేస్తూ ఉంటాయి. అందుకే 'విద్య' అనే దీపం వెలిగించుకోవాలి/గమ్యమెరుగని అతని నావకు దారి చూపిన దార్శనికుడు. గతి తప్పిన అతని జీవితాన్ని శృతి చేసిన మహానుభావుడు/గొంగళి పురుగులా అక్కడే పడి కొట్టుమిట్టాడుతున్న అతని జీవితం సీతాకోకచిలుకలా ఎలా రంగుల మయంగా మారిందో గుర్తుకొచ్చింది. ప్రధాన పాత్రకు 'సూర్యం' అన్న పేరు ఉంచటంలోనే రచయిత ఉద్దేశ్యం బోధపడుతుంది.

ఇటీవల మగపిల్లలు పెళ్లి చేసుకోవటానికి వెనకాముందు ఆడుతున్నారు. ఉన్న సంపాదనతో ఇల్లు నెట్టుకురావటం కష్టమనే భయం వారిని వెనక్కిలాగుతోంది. 'ఊహల రెక్కలతో ఎగరనీయ్' కథలో ఇదే అంశంపై చర్చకు పెట్టారు. జీవితంలో సర్దుబాటు ఎంత అవసరమో చెప్పారు. నిరంతరం సోషల్ మీడియాలో మునిగిపోతున్న ఇల్లాళ్లకు భిన్నంగా, ఇంట్లో ఉన్నంతసేపు




కుటుంబసభ్యులకు మాత్రమే వెచ్చించే 'ఇందిర' అన్న పాత్ర సృష్టించారు. "ఆఫీసు నుంచి ఇంటికొచ్చాక బంధువులతో కూడా ఫోన్ మాట్లాడదు. ఎంజాయ్ చేయటం అంటే మనుషులతో ప్రేమతో మెలగాలి. వస్తువులతో కాదు. వీలునుబట్టి వాళ్లను కలవచ్చు. మీరు, పాప నాకున్నారు. మీ సమయాల్ని నాకు కేటాయిస్తే చాలు' అంటుంది. ఈ కథలో పెళ్లి విశిష్టత గురించి రచయిత చర్చించారు. "మనుషులకు స్థూల, సూక్ష్మ, కారణ అనే మూడు శరీరాలుంటాయి. పెళ్లి సమయంలో వేసే ఒక్కో ముడి ఒక్కో శరీరానికి వేసేది. ఒక్క బాహ్యశరీరంతోనే కాదు. మొత్తం మూడు శరీరాలతో మమేకం కావటం అనే అర్థంలో మూడుముళ్లు వేస్తారు. ఈ మూడుముళ్లకు 'అనురాగపు ముడి'ని జత చేసి లైఫ్ జర్నీ చేయాలి. అది మనం చూపించే ప్రేమను బట్టి ఉంటుంది. క్వాలిఫికేషన్ బట్టి కాకుండా క్యారక్టర్ ను బట్టి వివాహాలు విజయవంతమవుతాయి"అని చెప్పుకొచ్చారు.

మరో కథ 'ఇది కదా సంతోషం' లోనూ వివాహ ఔన్నత్యం గురించి చర్చ కనిపిస్తుంది. మనవడి వివాహవేడుకలను కళ్లారా చూసుకుని సంతసించిన తాతయ్య ఇందులో కనిపిస్తాడు. అణకువతో, నేర్పుతో సంసారాన్ని తీర్చిదిద్దిన తన భార్యను అలక్ష్యం చేశానన్న చింత ఆయనను వెంటాడుతూంటుంది. "నీరు ఎంత అమూల్యమైనదో, బావి ఎండిపోయే వరకూ మనకు తెలియదు. భార్య తోడుగా ఉన్నంతకాలం ఆమెను గ్రహించలేకపోయాను" అన్న ఆవేదనకు లోనవుతాడు. "భార్యలేని మగవాడి జీవితం అసంపూర్ణం. ఆమెతో గడిపిన క్షణాలే నీ జీవితం లో అమూల్యం" అని మనవడికి భార్య గొప్పతనాన్ని వివరించటంతో కథ ముగుస్తుంది. 'యాచకురాలు' కథలో బిచ్చగాళ్ల పట్ల సహానుభూతి కనిపిస్తుంది. "నీకు సాధ్యమైతే బిచ్చమెయ్యి. అంతే కానీ నోటికొచ్చినట్టు మాట్లాడి వాళ్లను చులకన చేయొద్దు" అన్న హితవు, "ఎదుటివారిని ఆదుకున్నప్పుడు, క్షమించినప్పుడు మన మోహంలో ద్కెవత్వం కనిపిస్తుంది" అనే సందేశం ఇందులో మనం చూడొచ్చు. సమాజం చిన్న చూపు చూసే యాచకులను ప్రయోజకులుగా, బాధ్యతగల కాంట్రాక్టు ఉద్యోగులుగా మలచిన మున్సిపల్ ఉద్యోగి ఉదంతం "మళ్లీ చిగురించారు" కథలో కనిపిస్తుంది. మనిషికి పరిసరాలతోనూ, ప్రకృతితోనూ ఉండే అనుబంధం గాఢమైనది, బలీయమైనది. "స్వర్గసీమ", " రాముడు –భీముడు" కథలు ఈ విషయాన్ని బలంగా చాటుతాయి. తన ఇల్లు, పెరడులో పెంచుకున్న మొక్కలతో అవ్యక్తమైన అనుబంధాన్ని పెంచుకున్న అర్చన భర్త ఇల్లు అమ్మి సొంత ఊరికి వెళ్లిపోదామని చెప్పినప్పుడు తల్లడిల్లుతుంది. "స్వర్గమంటే అదెక్కడో ఉండదు. నిర్మలమైన మనస్సుతో, మనకున్న సౌకర్యాలతో సంతృప్తిగా బతికే జీవితమే స్వర్గం. ఇల్లే స్వర్గసీమ" అన్న స్పృహతో చివరికి భర్త తన నిర్ణయాన్ని మార్చుకుంటాడు. ఇక 'రాముడు–భీముడు కథలో, పదిమంది పిల్లలున్నా నిరాదరణకు గురైన రాముడు, భీముడు (వేపచెట్టు)నీడలో సేదతీరుతూంటాడు. అతను కన్నుమూసినప్పుడు ఆ కట్టలే అతనికి ఆధారమవుతాయి.

ఒక సామాజిక సమస్యపైన సామాజిక మాధ్యమాల్లో మద్దతు కూడగట్టటానికి సిద్ధమైన యువకుని ఉదంతం 'మైత్రీవనం'లోనూ, ప్రేమ ఉచ్చులో పడిపోకుండా, బాగా చదువుకుని బాధ్యతగా మెలగాలన్న సూచన 'చ్కెతన్యకిరణం'లోనూ కనిపిస్తుంది. ఆగంతకుల దాడి నుంచి నేర్పుగా బయటపడిన యువతి కథ 'గుంట నక్కలు".

ఈ సంకలనంలో రెండు కథలను ప్రస్తావించకపోతే, ఈ సమీక్ష అసంపూర్ణమవుతుంది. 'రాతిగుండెలో నీళ్లు, 'ఉరేసుకున్న మౌనం' అన్న ఈ రెండు కథలు రచయితకు బహుమతులు తెచ్చిపెట్టాయి. డ్వాక్రా సభ్యులు అకస్మాత్తుగా చనిపోతే, వారికి ఆర్థిక సాయం అందించే బాధ్యతలో ఉన్న రంజని అనే ఉద్యోగినికి చిత్రమైన అనుభవం. అది ఆమెలో మార్పుకు ఎలా కారణమయ్యిందో తెలియచెప్పే కథ "రాతి గుండెలో నీళ్లు". ఇందులో హిజ్రాల జీవితంలో సాధకబాధకాలను, కుటుంబ సభ్యుల నిరాదరణను హృదయవిదారకంగా చెప్పుకొచ్చారు రచయిత.

ఇక ఉరేసుకున్న మౌనం కథలో భర్త చేసే అవమానాలను భరించలేక జ్యోతి ఆత్మహత్యకు సిద్ధపడుతుంది. ఆఖరునిముషంలో అంతరాత్మ ప్రబోధంతో వెనక్కి మళ్లుతుంది. భర్త పశ్చాత్తాపానికి లోనవుతాడు. ఇలా ప్రతి కథలోనూ దొండపాటి తనద్కైన విశిష్టతను చూపారు. కథల పట్ల ఆసక్తిగల వారు తప్పనిసరిగా చదవవలసిన సంకలనమిది.

# కమ్మనైన అమ్మ భాష



తెలుగు భాష వ్యాప్తికి, మనుగడకు సంబంధించి ఏళ్ల తరబడి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. దీనిపై ఇప్పటివరకూ ఐదు ప్రపంచ తెలుగు మహాసభలు కూడా జరిగాయి. ప్రాంతాలను బట్టి యాస, మాండలిక సొగసూ ఎలా ఉన్నా రెండు రాష్ట్రాల్లోనూ ప్రజల భాష తెలుగే. ఇదే, ఇలాగే వర్ధిల్లాలన్న ఆకాంక్ష అందరిలో అభివ్యక్తం కావటంతో మాత్రమే తెలుగు వర్ధిల్లదు. అది వెలుగులీనే వ్యవస్థకు అంకురార్పణ చేయాల్సింది, అమలు చేయాల్సింది కచ్చితంగా పాలకులే! ఈ నెల 21న 'ప్రపంచ మాతృభాషా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం..

మన అమ్మభాష తెలుగు. మన భాషకు వెయ్యేళ్లకు పైబడిన చరిత్ర ఉంది. విస్తారమైన సాహిత్యం ఉంది. అనేక సాహిత్య ప్రక్రియలు శాఖోపశాఖలై వర్ధిల్లాయి. జనజీవన స్రవంతిలోకి సజీవ పాయలుగా ప్రవహించాయి. పద్యాలూ పాటలూ, కథలూ కావ్యాలూ, నాటకాలూ నాటికలూ, ప్రబంధాలూ మహా గ్రంథాలూ.. ఆయా కాలాలను, జనజీవనాన్ని చిత్రించాయి. అన్నిటా తీయతీయని తెలుగు పలుకు వేకువల వెల్లువలా ప్రవహించింది. ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో తెలుగూ ఒకటి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూబీ దేశంలోనూ, దేశం బయటా దాదాపు 16 కోట్ల మంది తెలుగు మాట్లాడతారని ఒక అంచనా. దేశంలో హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే భాష తెలుగే అంటారు. తెలుగుకు ప్రాచీన భాష హోదా కూడా ఉంది. ఇవన్నీ మనం ఘనంగా చెప్పుకోవటానికి దోహదపడే సంగతులు. కానీ, తెలుగు వాడుక, వేడుక రోజురోజుకూ తరిగిపోతుందన్నది ఒక వాస్తవం. వెంటనే పెను ప్రమాదం లేకపోయినా– కొన్నేళ్లకు ప్రాభవం కోల్పోయే భాషల్లో తెలుగు కూడా ఉందనేది యునిసెఫ్ హెచ్చరిక. ఎందుకంటే– ఇప్పుడు చాలామంది అక్షరాస్యులకు తెలుగు మాట్లాడ్డం వచ్చుగానీ, చదవడం, రాయడం రాదు. తెలుగును తెలుగులో కాక ఇంగ్లీషు లిపిలో రాస్తున్న తరం రోజురోజుకూ పెరుగుతోంది. మాట్లాడ్డానికే పరిమితమయ్యే భాష.. క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని భాషా అధ్యయనకర్తల ఆందోళన.

ఏ భాష అయినా ఎందుకు అవసరమవుతుంది? అంటే– 'మన అవసరాలు తీర్చుకోవటానికి..' అనేది జవాబు. ఒక సమూహపు ప్రజల అవసరాలు, జీవనం ఆ సమూహానికే పరిమితం అయినప్పుడు– ఆ సమూహపు అమ్మభాషకు ఢోకా ఉండదు. ఇతర సమూహాలతో, ప్రాంతాలతో కలిసినప్పుడూ భాషకు ప్రమాదం వాటిల్లదు. మాటలను ఇచ్చిపుచ్చుకోవటం ద్వారా రెండు భాషలూ పరిపుష్టమవుతాయి. ఇది భాష పుట్టినప్పటి నుంచీ అనుభవంలో ఉన్నదే! కానీ, మన భాషకు మించి మరొక భాషకు ఆధిపత్య స్థానం ఇవ్వటం ప్రమాదకరం. అది క్రమేణా అమ్మభాష చెల్లుబాటును హరించేస్తుంది. ఇప్పుడు జరుగుతున్నది ఇదే!

### ఆకాంక్షలు వేరు.. ఆచరణ వేరు..

తెలుగును వెలుగులీనే విధంగా చేయాలని చాలామంది ఆకాంక్షిస్తారు. తెలుగు భాష గత వైభవాన్ని గానం చేస్తారు. ఏఏ అంశాల్లో తెలుగు గొప్పో చరిత్రనీ, సాహిత్యాన్నీ ఉటంకిస్తారు. కానీ, ఆచరణ కూడా అదే స్థాయిలో ఉందా? అంటే – లేదు. ఈ శతాబ్దిలో 2012, 2017ల్లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. తెలుగు ప్రాభవం పెంచటానికి పలు తీర్మానాలూ జరిగాయి. కానీ, అమల్లోకి వచ్చింది ఒక్కటీ లేదు. ఆ సందర్భంలో తెలుగుకు ప్రాచీనహోదా గురించిన చర్చలు, ఆ హోదా రావటం వల్ల తెలుగు ఎంతగా వికసిస్తుందో, ఎన్నెన్ని విస్తృత కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతుందో భాషావేత్తలు, సాహిత్య అభిమానులూ ఆశావహంగా చర్చించారు. కానీ, ఇన్నేళ్లలో ఏం ఒరిగిందీ అంటే– జరిగింది లేశ మాత్రమే! పైగా మాతృభాష వికసించి, పరిమళించాల్సిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సైతం ఆంగ్లమాధ్యమం ప్రవేశించింది. తెలుగులో కోర్టు తీర్పులు, పాలనలో తెలుగు వాడుక వంటివి అక్కడక్కడ అప్పుడప్పుడు తప్ప, సమూలమైన మార్పు సాధ్యం కాలేదు. తెలుగు కేవలం సాహిత్య భాషగా ఉంటే– అది పుస్తకాలకే పరిమితం అవుతుంది. పాఠశాల మాధ్యమంలో, పాలనా వ్యవహారాల్లో నిండుగా మాతృభాషకు స్థానం ఇస్తేనే అది ఒక అవసరంగా, ఒక వ్యవహార సాధనంగా మారుతుంది. మాటల్లో ఉన్న తెలుగు ఘనత పనులకు ఉపయోగపడనప్పుడు పెద్దగా ఫలితం ఉండదు. అవసరానికి అక్కర రానిది క్రమంగా పక్కకు వెళ్లిపోవడం ప్రకృతి సహజం.

### బోధన ఏ భాషలో?

'ప్రజల భాషలో రాష్ట్ర పరిపాలన జరగటం ప్రజాస్వామ్యానికి అవసరం' అనే ఆదర్శంతో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అలా ఏర్పడ్డ మొదటి రాష్ట్రం తెలుగువారిదే! అంటే– మాతృభాష, సంస్కృతుల ఆవశ్యకత, ఆకాంక్షలను చాటిన తొలి గొంతు మనదే! భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాక దేశభాషలకు సముచిత స్థానం ఇవ్వటానికి ప్రయత్నాలు జరిగాయి. ప్రధాన భాషలను అధికార భాషలుగా గుర్తించటం, విద్యా విధానంలో పట్టభద్ర స్థాయి దాకా రాష్ట్ర భాషా మాధ్యమం ప్రవేశపెట్టటం జరిగింది. తెలుగులో 1957లో సాహిత్య అకాడమీ, 1968లో తెలుగు అకాడమీ వచ్చాయి. 1969–1974కి తెలుగు మాధ్యమం పియుసి నుంచి బిఏ, బికాం, బిఎస్సీ స్థాయిదాకా వ్యాపించింది. కానీ, ఆ తరువాత తెలుగుకు క్రమంగా ప్రాధాన్యం తగ్గిపోయింది. ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాధాన్యం తగ్గి, ప్రయివేటు ప్రాబల్యం పెరగటంతో ఈ జాడ్యం మొదలైంది. ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నవాళ్ళకు ఉద్యోగావకాశాలు పెరగటం, తెలుగు మాధ్యమం నిరుపయోగం అనే భావన విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో గట్టిగా స్థిరపడడం దీనికి ప్రధానకారణం. అది ఇప్పటికీ తారాస్థాయికి చేరుకుంది. ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లీషులో చదువు నేర్పటం అవసరమనే భావన బలంగా పెరిగింది.

### భాష వేరు.. మాధ్యమం వేరు!

మనం చిన్నప్పటి నుంచీ ఏ భాషా వాతావరణంలో పెరిగామో, ఏ భాష ఇంటి భాషగా ఉందో అదే మాధ్యమభాష అవుతుంది. మన ఆలోచనలన్నీ ఆ భాషలోనే స్ఫురిస్తాయి. ప్రాథమిక దశలో పిల్లలు ఏ నేర్చుకున్నా ఆ భాషలోనే నేర్చుకుంటారు. కాబట్టి– అమ్మభాషను మాధ్యమంగా ఉంచాలనేది ఒక శాస్త్రీయ అవగాహన. ఈ అంశంలో ఏ దేశంలోనూ వేరే చర్చ లేదు. మన దేశంలో, ప్రత్యేకించి మన రాష్ట్రంలో ఆంగ్లభాషా మాధ్యమం ప్రాథమిక విద్యలోనూ విస్తారంగా ప్రవేశించింది. నేర్పడం, నేర్చుకోవడంలో ఇది ఎలాంటి ఫలితాలను ఇస్తుందో ఇటీవల ప్రథమ్ సంస్థ నిర్వహించిన సర్వే తేటతెల్లం చేసింది. ప్రాథమిక విద్య స్థాయిని దాటాక – అవసరాలరీత్యా ఒక విద్యార్థి ఎన్ని భాషలైనా నేర్చుకోవొచ్చు. వారు ఎన్నుకునే వృత్తిని బట్టి, నివసించే ప్రాంతాన్ని బట్టి భాషలను అనుసరించొచ్చు. కానీ, భాష కోసం ప్రాథమిక బోధనా మాధ్యమాన్ని మార్చాల్సిన అవసరం లేదు. ఆంగ్ల భాషా ప్రావీణ్యం కొన్ని వృత్తుల్లో, దేశాల్లో రాణించటానికి ఉపయోగపడొచ్చు. కానీ, అది ఉద్యోగాలను సృష్టించదు. ఆంగ్లం ఒక భాషే తప్ప– ప్రత్యేక వృత్తి నైపుణ్యం కాదు. కొద్దికాలంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థలు వేలాది ఉద్యోగాలను తొలగిస్తున్నాయి. దానికి కారణం ఆర్థిక రంగంలో ఏర్పడ్డ సంక్షోభం తప్ప, భాష కాదు. ఇంగ్లీషు నేర్చుకుంటేనే ఉపాధి అవకాశాలు, లేకుంటే లేదన్నది పూర్తి వాస్తవం కాదు. శాస్త్ర సాంకేతిక విద్య, ఉన్నతవిద్యల బోధన ఎలాగూ ఆంగ్ల మాధ్యమంలోనే నడుస్తోంది. హైస్కూలు దశలోనూ ఆంగ్లం, హిందీ సబ్జెక్టులుగా ఉన్నాయి. సైన్సు, గణితం, సోషలు వంటి సబ్జెక్టులనూ ఇంగ్లీషులో నేర్పడం విద్యార్థుల అవగాహనకు గండి కొడుతుందని భాషా పరిశీలకులు అంటున్నారు.



### చెల్లుబాటు ఉంటే – తెలుగు వెలుగు

ఇంగ్లీషులో మాట్లాడితేనే, ఇంగ్లీషు తెలిస్తేనే పనులు జరుగుతాయి అన్న భావన బలంగా స్థిరపడేలా మన పాలనా యంత్రాంగం ఉంది. ఇది బ్రిటీషు పాలన మిగిల్చిన అవశేషం. ఏ భాష మనుగడ సాగించాలన్నా అది పరిపాలనా భాషగా ఉండాలి. మాతృభాష ప్రజల అన్ని అవసరాలనూ తీర్చగలగాలి. అప్పుడే దానికి మనుగడ. అన్ని కార్యాలయాల్లో ప్రజలు సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం, సంభాషణలు తెలుగులోనే జరపడం వల్ల భాష పట్ల గౌరవం పెరుగుతుంది. తెలుగు మొత్తం సమాజపు భాషగా వికసిస్తుంది. తెలుగు కలకాలం వినపడాలన్నా, కనపడాలన్నా– అది అధికారిక హోదా పొందాలి. అన్నింటా చెల్లుబాటు కావాలి. చెల్లుబాటు జరిగినప్పుడు, జరుగుబాటు కుదిరినప్పుడు– భాషే కాదుబీ ఏదన్నా వర్ధిల్లుతుంది. వెయ్యేళ్లు బతుకుతుంది.

### తెలుగు భాషా చరిత్ర

భాష ఒక నిత్య ప్రవాహిని. పాయలు పాయలుగా మారి, అనేక క్షేత్రాల్లోకి చేరి, అక్కడి స్థానిక భాషాప్రవాహాల్లో సంగమించి, కొంత ఇచ్చి, కొంత తీసుకొని, కొంగొత్తగా అవతరించి.. ఆ క్రమంలో కొంత అంతరించి, కొంత కొత్తగా ఆవిర్భవించి.. నిర్విరామంగా సాగుతూ ఉంటుంది. ఇలా వందల ఏళ్ల నుంచి పరిణామం చెందుతూ ప్రవహిస్తున్న భాష జన్మస్థానం ఎక్కడీ అంటే ఆనవాళ్లను కచ్చితంగా కనుక్కోవడం కష్టమే! ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రెండింటా తెలుగు మాతృభాషగా ఉన్న వారి సంఖ్య దాదాపు తొమ్మిది కోట్లు. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో తెలుగు మాట్లాడేవారు మరో ఏడు కోట్ల మంది ఉంటారని ఒక అంచనా. ఈ విధంగా ప్రపంచంలోని ప్రజలు అత్యధికంగా మాట్లాడే భాషల్లో తెలుగుది 13వ స్థానం. రెండున్నర వేల సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు ప్రపంచ ప్రాచీన భాషల్లో ఒకటి. వెనీసుకు చెందిన వర్తకుడు నికొలో డా కాంటి మనదేశంలో పర్యటిస్తూ– తెలుగును చూసి, విని తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా అభివర్ణించాడు. ఎందుకంటే ఇటాలియన్ కూడా మన తెలుగు వలే అజంతా భాష.

### తెలుగు ఎక్కడ పుట్టింది?

తెలుగును ద్రావిడ భాషా వర్గానికి చెందినదిగా భాషా శాస్త్రకారులు వర్గీకరించారు. తమిళం, కన్నడం, మలయాళం, తోడ, తుళ, బ్రహ్మి తదితర భాషలు ద్రావిడం. ఇవి హిందీ, ఇతర దేశీయ భాషల వలె ఇండో ఆర్యన్ భాషలు కావు. ఈ భాషలు వర్ధిల్లే సమాజాల సంస్కృతి కూడా భిన్నమైనది. తెలుగు వారి భాషా సంస్కృతులు చాలా లోతైన పునాదుల మీద నిర్మితమై ఉన్నాయి. కావ్యాలు, గేయాలు, పద్యాలు, పాటలు, జానపదాలు, నృత్యాలు, వినోదాలు, విహారాలు, ఆచార వ్యవహారాలు అన్నిటా ప్రత్యేకత, వైవిధ్యమూ గల చరిత్ర తెలుగు వారిది. ఆర్యభాషలు ప్రవేశించకముందు ద్రావిడ భాషలు మనదేశమంతా విస్తరించి ఉండేవని.. కొంతమంది భాషా చరిత్రకారుల అభిప్రాయం. తెలుగు మూల మధ్య ద్రావిడ భాష నుంచి పుట్టింది. ఈ కుటుంబంలో తెలుగుతో పాటు కుయి, కోయ, కొలామి కూడా ఉన్నాయి.

క్రీ.శ మొదటి శతాబ్దంలో శాతవాహనులు సృష్టించిన 'గాథాసప్తశతి' ప్రాకృత పద్య సంకలనంలో తెలుగు పదాలు కనిపించాయి. తెలుగుభాష మాట్లాడేవారు శాతవాహన కాలానికి ముందే కృష్ణా, గోదావరి నదుల మధ్య భూభాగంలో నివసించేవారని ఒక అంచనా. తెలుగులోని స్పష్టమైన మొట్టమొదటి ప్రాచీన శిలాశాసనం 7వ శతాబ్దికి చెందినది. శాసనాల్లో మనకు లభించిన తొలి తెలుగు పదం 'నాగబు'. క్రీ.పూ. 700 ప్రాంతంలో వచ్చిన ఐతరేయ బ్రాహ్మణం (రుగ్వేదంలో భాగం)లో మొదటిసారిగా 'ఆంధ్ర' అనే పదం జాతిపరంగా వాడారని భాషావేత్తలు చెబుతారు. మనకు తెలిసినంతలో ఇదే ప్రాచీన ప్రస్తావన. ఆ తరువాత బౌద్ధ శాసనాల్లోనూ, అశోకుని శాసనాల్లోనూ ఆంధ్రుల ప్రస్తావన ఉంది. క్రీ.శ. 1000కి ముందు శాసనాల్లోగాని, వాఙ్మయంలో గాని తెలుగు అనే శబ్దం మనకు కానరాదు. 11వ శతాబ్దం ఆరంభం నుంచి 'తెలుంగు భూపాలురు', 'తెల్గరమారి', 'తెలింగకులకాల', 'తెలుంగ నాడొళగణ మాధవికెయ' వంటి పదాలు శాసనాల్లో వాడారు. 11వ శతాబ్దంలో నన్నయ్య కాలంనాటికి తెలుగు రూపాంతరంగా 'తెనుగు' అనే పదం వచ్చింది. 13వ శతాబ్దంలో మహమ్మదీయ చరిత్రకారులు ఈ ప్రాంతాన్ని 'త్రిలింగ' అని వ్యవహరించారు. 15వ శతాబ్దం పూర్వభాగంలో విన్నకోట పెద్దన్న తన కావ్యాలంకార చూడామణిలోనూ ఈ ప్రస్తావన చేశాడు. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామం – అనే మూడు శివలింగక్షేత్రాల మధ్యభాగం త్రిలింగదేశమని, 'త్రిలింగ' పదం 'తెలుగు'గా పరిణామం పొందిందని ఒక సమర్థన. ఇది సంస్కృతీకరింపబడిన పదమే తప్ప మరొటి కాదనిబీ వాస్తవానికి తెలుగు అనేదే ప్రాచీన రూపమని చరిత్రకారుల అభిప్రాయం. 12వ శతాబ్దిలో పాల్కురికి సోమనాథుడు 'నవలక్ష తెలుంగు' అని వాడాడు. తొమ్మిది లక్షల గ్రామ విస్తీర్ణం గలిగిన దేశమని వర్ణించాడు.

నన్నయ్యకు పూర్వం నుంచి గ్రాంథిక భాష, వ్యావహారిక భాష స్వతంత్రంగా పరిణామం చెందుతూ వచ్చాయి. 20వ శతాబ్దం తొలినాళ్లలో వీటి మధ్య ఉన్న వ్యత్యాసాలు తీవ్ర వాదోపవాదాలకు దారితీసాయి. గ్రాంథికం ప్రమాణ భాష అని, స్థిరమైన భాష అని, దాన్ని మార్చకూడదని గ్రాంథిక భాషావాదులు భీష్మించారు. ప్రజల భాషనే గ్రంథ రచనలో ఉపయోగించాలని వ్యావహారిక భాషావాదులు వాదించారు. ఆఖరికి ప్రజల భాషే పైచేయి సాధించింది. గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం వంటివారు ఆ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. దీనికన్నా ముందే పోతన, సోమన, వేమన వంటివారు సరళమైన తెలుగులో సారస్వతం సృష్టించారు.

## ఈ 5 నగరాలను ఓసారి లుక్కేయండి..

# వీలైతే వెళ్లి చూడండి..!








ఎప్పుడూ చూసే పర్యాటక ప్రదేశాలు కాకుండా ఈసారి ప్రపంచంలోని కొన్ని అద్భుతమైన నగరాల గురించి తెలుసుకుందాం. అవెలా ఉంటాయి. వాటి ప్రత్యేకలతేంటి చూద్దాం.

ప్రపంచంలో ఎన్నో అందమైన నగరాలు ఉన్నాయి. నిత్యం వివిధ దేశాల నుండి పర్యాటకులను రారమ్మని ఆహ్వానిస్తుంటాయి. దీంతో చాలా మంది ట్రావెలర్లు ఆయా ప్రదేశాలకు వెళ్లి అక్కడి అనుభూతులను మనసారా ఆస్వాదిస్తారు. అలాంటి నగరాల్లో కొన్ని చాలా ప్రత్యేకమైనవి కూడా ఉంటాయి. అందులో ఈ 5 నగరాలు సైతం ప్రపంచ టూరిస్టుల మనసు గెలుచుకున్నాయి. కొద్ది రోజులు అక్కడ ఉండి స్థానిక సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకొని వారు ప్రత్యేక అనుభూతికి గురయ్యారు. మీరు కూడా అలాంటి ప్రత్యేకమైన నగరాలేవో.. అక్కడున్న విశేషాలేంటో తెలుసుకోవాలనుకుంటే ఈ సమాచారం మీకోం. (%ూష్ట్రశీశీ జతీవఅఱ: ఖఅంజూశ్రీఖంష్ట్ర)

%సరాజేవో, బోస్నియా..

సరాజేవో, బోస్నియా.. బోస్నియాలోని సరాజేవో ప్రపంచంలోని అందమైన నగరాల్లో ఒకటి. నగరం చుట్టూ ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తాయి. అలాగే ఈ నగరంలో గత కాలానికి చెందిన చేదు జ్ఞాపకాలు కూడా కనిపిస్తుంటాయి. అయితే, ఇప్పుడు ఈ సరాజేవో భిన్న సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా మారింది. దీంతో ప్రజలు చాలా ప్రశాంతంగా ఉన్నారు. అక్కడ చర్చిలు, మసీదులు, ప్రార్థనా మందిరాలు దాదాపు ఒకదాని పక్కన మరొకటి కనిపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందుకే ఈ నగరాన్ని "యూరోపియన్ జెరూసలేం" అని పిలుస్తారు.

ఏథెన్స్, గ్రీస్..

ప్రపంచంలోని అతి పురాతన నగరాల్లో ఒకటి గ్రీస్‌లోని ఏథెన్స్. ఇదో అద్భుతమైన, చారిత్రకమైన నగరం. ఇప్పటికీ అక్కడ అనేక చారిత్రక అవశేషాలు కనిపిస్తుండటం విశేషం. అలాగే అక్కడి పార్క్‌లు, బీచ్‌లు, అద్భుతమైన నిర్మాణాలు, సుందరమైన ప్రదేశాలు పర్యాటకులను మైమరపిస్తుంటాయి. రెండు దశాబ్దాలుగా అక్కడి మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడటంతో టూరిజం రంగంలోనూ మంచి గుర్తింపు సాధించింది. దీంతో ఈ చారిత్రక నగరాన్ని ఒక్కసారైనా చూసితీరాల్సిందే.

బాన్స్కో, బల్గేరియా..

బల్గేరియాలోని బాన్స్కో అనే నగరం అత్యంత అందమైనదని చెప్పొచ్చు. ఇది పిరిన్ నేషనల్ పార్క్‌లో భాగమైన పిరిన్ హిమాలయ పర్వతాల దిగువన ఉండే అద్భుతమైన పర్యాటక ప్రదేశం. ఇక్కడ ఉండే టోడోర్కా శిఖరం అనేక కార్యకలాపాలకు ప్రసిద్ధి చెందింది. దీంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులు మంచు అందాల్లో తడిసిముద్దవుతారు. స్కీయింగ్, స్నోబోర్డ్ వంటి సాహస క్రీడలు ఆస్వాదించేవారికి ఇదో స్వర్గధామం అని చెప్పొచ్చు. అలాగే పిరిన్ నేషనల్ పార్క్‌లోని క్రాగీ ఆల్పైన్ చెట్ల అందాలు, సమీపంలో అందే హిమనీ సరస్సులు, ఎత్తైన పర్వత శిఖరాలు ఎవరికైనా తప్పక నచ్చుతాయి.

టోక్యో, జపాన్..

జపాన్‌లోని టోక్యో ప్రపంచంలోనే అద్భుతమైన ఎలక్ట్రానిక్ సిటీ అని చెప్పొచ్చు. అక్కడ రాత్రివేళ ఏ మూలకెళ్లినా కళ్లు జిగేల్ మనే విద్యుద్దీపాల అందాలే కనువిందు చేస్తాయి. ముఖ్యంగా టోక్యోలో చూడాల్సిన వాటిల్లో స్కై ట్రీ, షిబుయా క్రాసింగ్, సకురా ట్రీ లైన్డ్ స్ట్రీట్స్ తప్పక ఉంటాయి. అలాగే అక్కడి అందమైన పార్కులు, ఆలయాలు, సంస్కృతి సంప్రదాయాలు కూడా తప్పక ఆస్వాదించాల్సినవే. అలాగే ముందుగా చెప్పినట్లు ఈ నగరంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ ప్రాడక్ట్స్‌కైనా దొరుకుతాయి.

మెర్‌జౌగా, మొరాక్కో..

మొరాక్కోలోని మెర్‌జౌగా అనేది అద్భుతమైన ఎడారి ప్రాంతం. ఇక్కడికి చాలా మంది పర్యాటకులు వచ్చి సేద తీరుతుంటారు. ఇది సహారా ఎడారికి ప్రధాన ద్వారం అని కూడా చెప్పొచ్చు. అలాగే ఇక్కడ తప్పక సందర్శించాల్సిన వాటిల్లో ఎర్గ్ చెబ్బీ ప్రధానమైన ఎడారి ప్రాంతం. అక్కడ పర్యాటకులు వివిధ రకాల కార్యకాలపాలను ఆస్వాదిస్తారు. సాండ్ డ్యూన్స్‌లో ట్రెక్కింగ్, క్యాంపింగ్, హైకింగ్, సఫారీ రైడ్లు ఆస్వాదిస్తుంటారు. దీంతో ఇది కేవలం అందమైన ప్రదేశంగానే కాకుండా మంచి సాహసయాత్రగానూ మిగిలిపోతుంది.

## హాలీ డే ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా?

# వీసా లేకుండానే ఈ దేశాలు చుట్టేయండి

హాలీ డేస్ అనగానే చాలామంది టూర్స్ ప్లాన్ చేస్తుంటారు. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి సరదాగా హాలీ డే ట్రిప్ వేస్తుంటారు. ఒక్కో ఏడాది ఒక్కో ప్రాంతానికి వెళ్తూ ఎంజాయ్ చేస్తుంటారు.

కొంతమందికి అయితే భారత్‌తో పాటు విదేశాల్లోని ప్రాంతాలను కూడా తిరిగి రావాలని కొంతమందికి కోరిక ఉంటుంది. కానీ విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు, వీసా కావాలి.. దీనికి చాలా తతంగం ఉంటుందనే ఆలోచనతో చాలామంది వెనక్కి తగ్గుతుంటారు. చూసిన ప్లేస్‌లు అయినా సరే మళ్లీ మళ్లీ వెళ్లొస్తుంటారు. కానీ వీసాతో పని లేకుండా స్వేచ్ఛగా తిరిగి రావడానికి కొన్ని దేశాలు భారతీయులను ఆహ్వానిస్తున్నాయని తెలుసా! మన వాళ్లకు ఆయా దేశాలే ఈ వీసాలు, వీసా ఆన్ అరైవల్ ఏర్పాటు చేస్తున్నాయి. మరి ఆ దేశాలేంటో ఒకసారి చూద్దామా..

**మాల్దీవులు**

హాలీ డేస్‌లో రిలాక్సేషన్‌కు మాల్దీవులు చక్కటి ప్లేస్ అని చెప్పొచ్చు. ముఖ్యంగా హనీమూన్‌కు వెళ్లే కొత్త జంటలకు ఇది చాలా ఫేమస్. టూరిస్టులు చూసేందుకు, ఎంజాయ్ చేసేందుకు ఇక్కడ చాలా ప్రదేశాలు ఉంటాయి. ఎన్నో అడ్వెంచరస్ గేమ్స్ కూడా ఆడేందుకు అవకాశం ఉంటుంది. అందుకే కాస్త ఖర్చయినా సరే చాలామంది మాల్దీవులను ప్రిఫర్ చేస్తుంటారు. అయితే మాల్దీవులకు వెళ్లాలంటే వీసా ఉండాలని చాలామంది అనుకుంటుంటారు. కానీ అక్కర్లేదు. భారతీయుల కోసం అక్కడి ప్రభుత్వం వీసా ఆన్ అరైవల్ సమకూరుస్తోంది. ఈ విధానం ప్రకారం ఎలాంటి ఛార్జీలు లేకుండానే వీసాలను పొందవచ్చు. 30 రోజుల నుంచి 90 రోజుల కాలపరిమితితో ఈ వీసా పొందవచ్చు.

**బ్యాంకాక్ ( థాయిలాండ్ )**

వెకేషన్ అనగానే చాలామంది నోట వినిపించే పేరు థాయిలాండ్. కుర్రకారు నుంచి పెద్దవాళ్ల దాకా ఒక్కసారైనా బ్యాంకాక్ వెళ్లి ఎంజాయ్ చేసి రావాలని అనుకుంటుంటారు. థాయిలాండ్‌లో ఒక్క బ్యాంకాక్ మాత్రమే కాదు.. క్రిబి, ఫుకెట్, ఫిఫి దీవులు కూడా పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తుంటాయి. ఇక్కడికి హాలీ డే ట్రిప్ వెళ్లాలని అనుకుంటే ఎలాంటి వీసా అక్కర్లేదు. థాయిలాండ్ వెళ్లిన తర్వాత కేవలం 35 అమెరికన్ డాలర్లు చెల్లించి టూరిస్ట్ వీసా తీసుకోవచ్చు. ఈ వీసాతో 15 రోజుల పాటు థాయిలాండ్‌లోని అన్ని దీవులు తిరిగేసి రావొచ్చు.

**ఇండోనేసియా**

అందమైన బీచ్‌లకు, నోరూరించే వంటకాలకు ఇండోనేసియా ఫేమస్ అని చెప్పొచ్చు. ఇక్కడి సముద్ర తీరంలో సేద తీరేందుకు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడికి వెళ్లాలంటే కూడా ముందుగా వీసా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇండోనేసియా వెళ్లిన తర్వాత దాదాపు 30 అమెరికన్ డాలర్లు చెల్లించి టూరిస్ట్ వీసా పొందవచ్చు. దీని కాలపరిమితి రెండు నెలలు ఉంటుంది.

**కాంబోడియా**

ప్రకృతి ప్రేమికులకు కాంబోడియా వీనుల విందును కలిగిస్తుంది. ఇక్కడ అడవులు, చెట్లతో పాటు పురాతన బౌద్ధ ఆలయాలు, కోటలు, బురుజులు విపరీతంగా ఆకట్టుకుంటాయి. ఇక్కడికి వెళ్లాలని అనుకుంటే ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి ఈ- వీసా పొందవచ్చు. లేదా కాంబోడియా వెళ్లిన తర్వాత 30 రోజుల గడువుతో వీసా తీసుకోవచ్చు.

**శ్రీలంక**

భారత్‌కు దక్షిణ దిక్కున ఉన్న శ్రీలంక ప్రకృతి అందాలకు నెలవు. ఇక్కడి విభిన్న వృక్ష జాతులు, దట్టమైన అడవులు, బీచ్‌లు ఈ ప్రాంతానికి పేరు తీసుకొస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ పద్ధతిలో శ్రీలంకకు అనుమతిస్తారు. ఆన్‌లైన్‌లో దాదాపు 30 డాలర్లు చెల్లించడం ద్వారా ఈ వీసాను పొంది.. నెల రోజుల పాటు శ్రీలంకలో తిరిగి రావొచ్చు.

**నేపాల్**

హిమాలయాలలో ఉన్న నేపాల్ ప్రకృతి అందాలకు నెలవు. ఇక్కడి లేక్ టేబుల్ ల్యాండ్ పర్యాటకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఈ దేశానికి వెళ్లాలంటే పాస్‌పోర్టు కూడా అవసరం లేదు. ఏదైనా గుర్తింపు పత్రం చూపిస్తే సరిపోతుంది. భారతీయులకు ఎలాంటి షరతులు విధించరు.

**భూటాన్**

ఈ దేశం సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుంది. కలుషితం కాని ప్రకృతి సౌందర్యాన్ని ఇక్కడ చూడవచ్చు. ఇక్కడి కట్టు, బొట్టు అన్నీ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ఇక్కడకు వెళ్లాలంటే వీసా అక్కర్లేదు. గడువు కూడా లేదు.

**మారిషస్**



వాటర్‌ఫాల్స్, దట్టమైన అడవులు, బ్ల్యూ బే మెరీనా పార్క్, పీటర్ బోత్ కొండలు, నేచర్ పార్క్ చూడదగిన ప్రదేశాలు. ఈ దేశంలో వీసా లేకుండా 90 రోజులు ఉండవచ్చు.

**వియత్నాం**

చారిత్రక ప్రదేశాలు, ఆలయాలు అంటే ఆసక్తి ఉన్నవాళ్లు వెళ్లేందుకు వియత్నాం చక్కటి ప్రదేశం. భారత్ నుంచి వచ్చే టూరిస్టుల కోసం ఇక్కడే తక్కువ ధరలో వీసాలను అందిస్తున్నారు. 30 రోజుల నుంచి 90 రోజుల వరకు బస చేసేందుకు వీలుగా ఇక్కడ వీసాలు పొందవచ్చు. దీనికోసం దాదాపు రూ.7800 చెల్లించాల్సి ఉంటుంది.

ఇవే కాదు ఇంకా చాలా దేశాలు వీసాలు లేకుండా భారతీయులను తమ దేశానికి ఆహ్వానిస్తున్నాయి. ఆయా దేశాలకు వెళ్లిన తర్వాత వీసాలు పొందే ఛాన్స్ ఇస్తున్నాయి. ఆ జాబితా కోసం ఇక్కడ క్లిక్ చేయండి.